సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 19

మంగళవారం 11-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



'థ్రిల్లర్'లో లక్నో విన్నర్...

బెంగళూరుపై చివరి బంతికి నెగ్గిన సూపర్ జెయింట్స్ -12లో



స్వల్ప లాభాలతో...


సెన్సెక్స్ లాభం 14 పాయింట్లు. ఆరోరోజూ కొనసాగిన ర్యాలీ -13లో



దేశవ్యాప్త కోవిడ్ మాక్ డ్రిల్

దేశంలో కరోనా కేసుల్లో పెరుగుదల నమోదు చేసుకుంటున్న నేపథ్యంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోవిడ్ మాక్‌డ్రిల్ జరిగింది.

వివరాలు 6లో ▶



కల్యంపూడికి అంతర్జాతీయ అవార్డు

స్టాటిస్టిక్స్ నిపుణుడు కల్యంపూడి రాధాకృష్ణా రావు (102)ను ప్రతిష్టాత్మక అంతర్జాతీయ స్టాటిస్టిక్స్ పురస్కారం వరించింది.

వివరాలు 6లో ▶



కన్నడనాట పాల గోల

అమూల్‌ను తీసుకొచ్చి నందినీ డెయిరీని దెబ్బ తీసేందుకు బీజేపీ యత్నిస్తోందని కాంగ్రెస్, జేడీ (ఎస్) విమర్శలు గుప్పిస్తున్నాయి.

వివరాలు 6లో ▶



తైవాన్‌పై యుద్ధానికి చైనా సై!

తైవాన్‌పై ఏ క్షణంలోనైనా యుద్ధానికి దిగేందుకు సిద్ధంగా ఉన్నట్టు చైనా సైన్యం చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది.

వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

అవరోహణ విధానంలో గురుకుల పోస్టుల భర్తీ



గురుకుల విద్యా సంస్థల్లో ఖాళీల భర్తీ ప్రక్రియలో టీఆర్ఈఐఆర్‌బీ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. అవరోహణ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

- వివరాలు 14లో ▶

ఈ స్పీడ్ సరిపోదు!



మరో 7, 8 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో ప్రస్తుతం చేస్తున్న కృషి సరిపోదని, తెలంగాణలోని అన్ని వర్గాలను చేరుకుని, రాష్ట్రంలో రాజకీయ మార్పు తెచ్చేందుకు కార్యక్రమాల వేగం పెంచాలని రాష్ట్ర బీజేపీని జాతీయ నాయకత్వం ఆదేశించింది.

- వివరాలు 3లో ▶

స్ట్రాంగ్ రూమ్ తాళాలు మిస్



ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల డాక్యుమెంట్ కాపీలు, సీసీ ఫుటేజీలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు మిస్సయ్యాయి. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అక్రమమని కాంగ్రెస్ అభ్యర్థి అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు.

- వివరాలు 3లో ▶

ఇక్కడ నిజాం షుగర్స్ తెరవలేరు కానీ..

- వైజాగ్ స్టీల్‌కు టెండర్లు వేస్తారా?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ ఎద్దేవా -2లో

మూడు బిల్లులకు ఓకే



రాష్ట్రపతి పరిశీలనకు పంపిన బిల్లులు.. **2**

2 వివరణ కోసం ప్రభుత్వానికి వెనక్కి పంపినవి

పరిశీలన కోసం పెండింగ్‌లో ఉంచినవి **3**

- గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులపై కదలిక
- సుప్రీంకోర్టులో సర్కారు కేసు నేపథ్యంలో స్పష్టత
- వర్సిటీల బోర్డు, అటవీ వర్సిటీ బిల్లులు రాష్ట్రపతికి..
- ఆజామాబాద్ భూముల బిల్లుపై సందిగ్ధం
- పీఆర్ బిల్లుపై ప్రభుత్వ వివరణ కోరిన గవర్నర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాల నేపథ్యంలో చాలాకాలం నుంచి రాజ్‌భవన్‌లో పెండింగ్ పడిన బిల్లుల వ్యవహారంలో కదలిక వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. మూడు సాధారణ బిల్లులపై ఆమోదముద్ర వేశారు. కీలకమైన యూనివర్సిటీల నియామక బోర్డు, అటవీ వర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన రెండు బిల్లులను రాష్ట్రపతికి నివేదించడం కోసం నిలిపివేశారు. మరో రెండు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోసం తిప్పిపంపారు. మరింత పరిశీలన అవసరమంటూ ఇంకో రెండు బిల్లులను రాజ్‌భవన్‌లోనే అట్టిపెట్టుకున్నారు. మొత్తంగా గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇటీవలి వరకు రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది బిల్లులకు సంబంధించి.. రాజ్‌భవన్ ఇచ్చిన వివరాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం సుప్రీంకోర్టుకు అందజేశారు.

ఆ బిల్లులపై మరింత జాప్యమే..

కీలకమైన తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లు, తెలంగాణ అటవీ విశ్వవిద్యాలయం బిల్లులను రాష్ట్రపతి పరిశీలన, ఆమోదం కోసం పంపాలన్న నిర్ణయం నేపథ్యంలో.. వీటి ఆమోదానికి మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. గతేడాది సెప్టెంబర్ 13 నుంచి ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి నియామకాల బోర్డు బిల్లుకు ఆమోదముద్ర లభిస్తే.. యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తోంది. బోధన సిబ్బంది లేక

మిగతా 2వ పేజీలో ▶

బిల్లులపై విచారణ ఈనెల 24కు వాయిదా

పెండింగ్‌పై సొలిసిటర్ జనరల్ వివరణ -2లో

బిల్లుల ఆమోదంలో గవర్నర్‌కు కాలపరిమితి నిర్ణయించాలి

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం -6లో

సుప్రీంకు వెళితే తప్ప బిల్లులు పాస్ చేయరా?

వ్యవస్థలను అడ్డుపెట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోంది: హరీశ్‌రావు

- ఉద్దేశపూర్వకంగా 7 నెలలు బిల్లులను ఆపేశారు
- పిల్లల భవిష్యత్ కంటే రాజకీయాలు ముఖ్యమా?
- గవర్నర్, కేంద్రం తీరు దారుణమని మండిపాటు
- మల్లన్నసాగర్ నుంచి మిషన్ భగీరథకు నీరిచ్చే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ట్రయల్ రన్



సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కితే తప్ప గవర్నర్ నుంచి బిల్లులు పాస్ కాని పరిస్థితి ఏర్పడిందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. శాసనసభ ఓకే చేసిన బిల్లుల విషయంలో మంత్రులు, సీఎస్ వెళ్లి వివరాలు తెలిపినా, సందేహాలను తీర్చినా కూడా.. గవర్నర్ ఏడు నెలలు ఉద్దేశపూర్వకంగా ఆపారని ఆరోపించారు. సోమవారం హరీశ్‌రావు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలంలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ట్రయల్ రన్ నిర్వహించారు. హరీశ్‌రావు ఈ సందర్భంగా గవర్నర్, కేంద్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. ''రాష్ట్రంలో ఫారెస్ట్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడం కాదా? కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాలు ఇస్తామంటే.. ఆ బిల్లును ఏడునెలల పాటు ఆపి, ఇప్పుడు రాష్ట్రపతి

మిగతా 2వ పేజీలో ▶

ఆప్.. ఇక జాతీయ పార్టీ

జాతీయ హోదా కోల్పోయిన సీపీఐ, టీఎంసీ, ఎన్సీపీ

- ఏపీలో బీఆర్ఎస్‌కు రాష్ట్ర పార్టీ హోదా తొలగింపు
- పలు పార్టీలకు రాష్ట్ర హోదా కల్పన.. కొన్నింటికి కట్
- ఇకపై జాతీయ పార్టీలు ఆరు... బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, ఎన్పీపీ, ఆప్
- ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకే ఆప్‌కు జాతీయ హోదా కట్టబెట్టారని సీపీఐ మండిపాటు

న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని ఎన్నికల సంఘం జాతీయ పార్టీగా గుర్తించింది. ఢిల్లీ, గోవా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కనబర్చిన పనితీరు ఆధారంగా ఆప్‌కు జాతీయ పార్టీ హోదా కల్పిస్తున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఇదే సమయంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ), ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లకు ఇప్పటిదాకా ఉన్న జాతీయ పార్టీ హోదాను ఉపసంహరించుకుంది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో బీఆర్ఎస్‌కు, ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎల్‌డీ, మణిపూర్‌లో పీడీఏ, పుదుచ్చేరిలో పీఎంకే, పశ్చిమబెంగాల్‌లో ఆర్ఎస్పీ, మణిపూర్‌లో ఎంపీసీ పార్టీలకు ఇప్పటివరకు ఉన్న రాష్ట్ర పార్టీ హోదాను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇక నాగాలాండ్‌లో ఎన్సీపీ, మేఘాలయలో టీఎంసీలకు త్వరలో రాష్ట్ర పార్టీ హోదా కల్పించనున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. నాగాలాండ్‌లో లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్), మేఘాలయలో వాయిస్ ఆఫ్ ద పీపుల్ పార్టీ, త్రిపురలో తిప్రా మోతా పార్టీలకు 'గుర్తింపు పొందిన రాష్ట్ర రాజకీయ పార్టీ'

మిగతా 5వ పేజీలో ▶



సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామంలో దళిత బంధు పౌల్ట్రీని సందర్శించిన మంత్రి కేటీఆర్

సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు పంచుతున్నాం

పేదరికమే గీటురాయిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

- సిరిసిల్ల జిల్లా పర్యటనలో మంత్రి కేటీఆర్
- తెలంగాణలో ఉన్న సౌలత్‌లు మరే రాష్ట్రంలోనూ లేవని వ్యాఖ్య.. దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని కితాబు
- పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ
- జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సిరిసిల్ల: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో సంపదను సృష్టిస్తున్నామని, తిరిగి ఆ సంపదను పేదలకు పంచుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలను ఆయన సోమవారం ఆవిష్కరించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినప్పుడు భూముల ధరలు ఎంత ఉన్నాయని, ఇప్పుడు ఎంత

మిగతా 3వ పేజీలో ▶

పొంగులేటి, జూపల్లి సస్పెన్షన్





బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ప్రకటన

- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వెల్లడి
- కేసీఆర్ ఆదేశాల మేరకే సస్పెండ్ చేసినట్లు స్పష్టీకరణ..
- కొత్తగూడెం ఆత్మీయ సమ్మేళనం నేపథ్యంలో చర్య

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘకాలంగా అసమ్మతి స్వరాన్ని వినిపిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఖమ్మం లోక్‌సభ మాజీ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని భారత్ రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఇద్దర్నీ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొంది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన 'అభిమానుల ఆత్మీయ సమ్మేళనం'లో పొంగులేటి, జూపల్లి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ అధినేత సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 'తప్పులు చేశారు.. శిక్ష తప్పదు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదు. ప్రభుత్వం వల్ల ఇబ్బంది పడుతున్న వారు ఏకమవుతున్నారు..'అంటూ పొంగులేటి కొత్తగూడెం సభలో విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఇదే వేదికపై నుంచి

మిగతా 2వ పేజీలో ▶

పార్టీలకంటే వ్యక్తులు గొప్ప కాదు: నిరంజన్‌రెడ్డి

ఒక్కర్నీ అసెంబ్లీ గేటు తాకనివ్వను: పొంగులేటి

బండారం బయటపడుతుందనే..: జూపల్లి

- వివరాలు 2లో

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

పాత బియ్యం అప్పగిస్తేనే కొత్త ధాన్యం

- సీఎంఆర్ ఇవ్వని మిల్లులకు ధాన్యం బంద్
- సరిహద్దులలో చెక్ పోస్టుల ఏర్పాటు
- సీఎంఆర్ లో జాప్యాన్ని ఇక ఉపేక్షించేది లేదు
- రాష్ట్రంలో ప్రతి రైస్ మిల్లు సీఎంఆర్‌లోకి రావాల్సిందే



అధికారులతో భేటీలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, హరీశ్, గంగుల

సాక్షి, హైదరాబాద్: గత సీజన్‌లో రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని సీఎంఆర్ కింద పౌరసరఫరాల శాఖకు అప్పగించని మిల్లర్లకు యాసంగి ధాన్యం కేటాయించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎంఆర్ కోసం 18 నెలల పాటు గడువు ఇచ్చినా, ధాన్యాన్ని మర పట్టించి ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న రైస్ మిల్లులను ఇక బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంగళవారం నుంచి రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఈ మేరకు మంత్రులు టి.హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతస్థాయి అధికారులు సోమవారం బీఆర్‌కే భవన్‌లో జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఎంలు, డీఎస్‌ఓలు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాసంగి ధాన్యం సేకరణ, సీఎంఆర్ కేటాయింపు, రైతులకు ఉపయోగకర అంశాలు వంటి వాటిపై చర్చించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని కొనుగోళ్ళకు సిద్ధం కావాలని, రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో

మిగతా 5వ పేజీలో ▶



అంగుళమైనా ఆక్రమించలేరు!

భారత సరిహద్దులను ఎవరుపడితే వాళ్లు ఆక్రమించుకునే రోజులు పోయాయి. ఇప్పుడు వాటిపై ఎవరూ కన్నేసే ధైర్యం కూడా చేసే పరిస్థితి లేదు. భారత సైన్యం, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ధైర్యసాహసాలే అందుకు కారణం. మన భూభాగంలో సూది మొన మోపినంత కూడా ఎవరూ ఆక్రమించలేరు. అరుణాచల్‌లో జై హింద్ అని పలకరించుకుంటారు. ఈ స్ఫూర్తి వల్లే అరుణాచల్‌ను ఆక్రమించలేక చైనా తోకముడిచింది

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

- వివరాలు 6లో

ఇదంతే!



మన సీఎంగారే పార్టీ ఆఫీసుకు వెళ్తున్నారు!!

చట్టాలకు రామోజీ అతీతుడా!

మార్గదర్శి చిట్స్ విషయంలో తటస్థుల పేరిట ఎల్లో డ్రామా



- 1982 కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఇప్పుడే తెచ్చినట్లుగా పెడబొబ్బలు
- డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం 1999లోనే చేశారు
- అవన్నీ చందాదారులు, డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ కోసమే.. వాటిని అమలు చేయాలని కోరటమే నేరమన్నట్లుగా రామోజీ గగ్గోలు
- చట్టాలను ఉల్లంఘించడం వల్లే శారదా చిట్స్, సుదర్శన్ చిట్స్ దివాలా
- డిపాజిట్లను మళ్లించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్, కృషి, చార్మినార్, బ్యాంక్‌లు
- 'మార్గదర్శి' ఖాతాదారులు మోసపోకూడదన్నదే ప్రభుత్వం ఉద్దేశం
- నిధులు మళ్లించామని అంగీకరించిన ఏ–1 చెరుకూరి రామోజీ
- ఆ చట్టాన్ని పాటించబోమని తేల్చిచెప్పిన ఏ–2 చెరుకూరి శైలజ
- డిపాజిట్ల సేకరణ, నిధుల మళ్లింపు సహా ఇప్పటికే బట్టబయలైన మార్గదర్శి అక్రమాలు.. విచారణ సాగించటమే తప్పనేలా తనవాళ్లతో తటస్థుల ముసుగులో రాద్ధాంతం

సాక్షి, అమరావతి

ఇది నా దేశం... అనుకున్న వాళ్లెవరైనా ఇక్కడి చట్టాలను గౌరవించి తీరాలి. ఆ చట్టాలకు లోబడే పనిచేయాలి. అసలు ఒక వ్యాపారం చేస్తూ... ఆ వ్యాపారాన్ని ఏ చట్టం కింద రిజిస్టర్ చేశారో ఆ చట్టం తనకు తెలియనే తెలియదని... దాన్ని తాను పాటించనని నిస్సిగ్గుగా... నిర్భీతిగా చెప్పే మనుషులను ఏం చేయాలి? తమకు ఏ చట్టాలూ వర్తించవని చెప్పే పెద్ద మనుషుల్ని ఏమనాలి?

ఇక్కడైతే చెరుకూరి రామోజీరావు అనో... చెరుకూరి శైలజా కిరణ్ అనో పిలవాల్సి ఉంటుంది. ఎందుకంటే నాటి మార్గదర్శి ఫైనాన్షియర్స్ నుంచి నేటి మార్గదర్శి చిట్స్ వరకూ... మేం డిపాజిట్లు సేకరించలేదని కానీ, మేం నిధులు మళ్లించలేదని గానీ వాళ్లు చెప్పటం లేదు. చట్టప్రకారం అలా చెయ్యకూడదు కదా? అంటే... ఆ చట్టాలేవీ తమకు వర్తించవంటున్నారు. ఆ చట్టాలు తాము పాటించబోమని చెబుతున్నారు. మార్గదర్శి

మిగతా 10వ పేజీలో ▶

పి7 నంబర్ ప్లేట్ @ రూ.122 కోట్లు

'వన్ బిలియన్ మీల్స్' దాతృత్వ కార్యక్రమం కోసం 'మోస్ట్ నోబుల్ నంబర్స్' వేలం పాట

జుమెయిరా: దుబాయ్‌లో 'పి7' కారు నంబర్ ప్లేటు వేలంలో రూ.122.6 కోట్లు పలికి, రికార్డు నెలకొల్పింది. శనివారం రాత్రి జుమెయిరాలోని ఓ హోటల్‌లో 'మోస్ట్ నోబుల్ నంబర్స్'వేలం పాట జరిగింది. ఎమిరేట్స్ ఆక్షన్, దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, టెలికమ్యూనికేషన్స్ కంపెనీలైన ఎటిసలాట్, డ్యు ఈ వేలాన్ని చేపట్టాయి. ఇందులో పలు కారు నంబర్ ప్లేట్లు, ప్రత్యేకమైన ఫోన్ నంబర్లు కలిపి మొత్తం రూ.221 కోట్లు పలికాయి. ఈ మొత్తాన్ని దుబాయ్ పాలకుడు షేక్ మహ్మద్ బిన్ రషీద్ నేతృత్వంలోని 'వన్ బిలియన్ మీల్స్'దాతృత్వ కార్యక్రమం కోసం వినియోగించనున్నారు. 'పి7'వేలం ప్రారంభ ధర రూ.33 కోట్లు కాగా కొన్ని సెకండ్లలోనే రూ.66 కోట్లకు ఎగబాకింది.ఒక దశలో 'పి7'కారు నంబర్ ప్లేట్‌కు దుబాయ్‌కి చెందిన ఫ్రెంచి వ్యాపారవేత్త, టెలిగ్రామ్ యాప్ యజమాని పావెల్ దురోవ్ రూ.78 కోట్లు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. కొద్దిసేపటికే 'ప్యానెల్ సెవెన్' రూ.122.6 కోట్లకు బిడ్ వేసింది. అయితే,'పి7'ను దక్కించుకున్న వ్యక్తి పేరు వెల్లడికాలేదు. 2008లో యూఏఈ రాజధాని అబుదాబి 'నంబర్ 1'వాహన ప్లేట్ వేలంలో సుమారు రూ.123 కోట్లు పలికింది.



రెండ్రోజులు ఎండలు మండుతాయ్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు సూచించింది. ఉత్తర కేరళ, అంతర్గత కర్ణాటక, మధ్య మహారాష్ట్ర మీదుగా విదర్భ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుంది. దీని ప్రభావం తెలంగాణలో పెద్దగా ఉండదని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 42.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.8	26.4
కర్నూలు	41.5	21.8
రాజమహేంద్రవరం	40.5	23.5
విజయవాడ	40.0	24.0
భద్రాచలం	39.0	25.0
నిజామాబాద్	38.6	23.5
మహబూబ్‌నగర్	38.5	23.7
నల్లగొండ	38.5	21.4
ఖమ్మం	38.2	23.4
రామగుండం	38.2	22.9
ఆదిలాబాద్	37.8	22.7
మెదక్	37.6	21.3
హనుమకొండ	37.0	22.5
హైదరాబాద్	35.7	22.0
హకీంపేట్	35.5	21.1
దుండిగల్	35.2	22.0

క్లుప్తంగా...

నిజాం షుగర్స్ తెరవలేరు కానీ వైజాగ్ స్టీల్‌కు టెండరా?

టీపీసీసీ నేత మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: మూతపడిన నిజాం షుగర్స్‌ను తెరిచే దమ్ము లేని బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్ద మనుషులు వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు టెండర్లు వేస్తారా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వక, నిరుద్యోగులకు భృతి ఇవ్వక ఇబ్బందుల పాలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం పక్క రాష్ట్రంలోకి వెళ్లి టెండర్లు వేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసే రాష్ట్రంలో రాజకీయ డ్రామాను నడుపుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఏటీఎంలా మారిందని ఆరోపించే బీజేపీ విచారణ ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత తర్వాత నోటీసులు తీసుకున్న వారు కూడా అరెస్టవుతారు కానీ కవిత మాత్రం కాకపోవడంలో మర్మమేమిటని ప్రశ్నించారు. ఈనెల 14న మంచిర్యాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైభారత్ సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నామని ఆ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.

కేసీఆరూ.. సింగరేణి గురించి ఆలోచించు: ఏపీ బీజేపీ

సాక్షి, అమరావతి: ప్రస్తుతం కేంద్ర పరిధిలో ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్ దాఖలు చేయనున్నట్లు వస్తున్న కథనాలపై బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ తీవ్రంగా స్పందించింది. రాజకీయ గిమ్మిక్కులు చేయడం కేసీఆర్‌కు అలవాటేనని.. ముందు తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి సంస్థ ఎందుకు దివాళా తీస్తుందో ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేటుకూరి సూర్యనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి వేరుగా ఈ అంశంపై స్పందిస్తూ.. కేసీఆర్ తన స్వార్థ రాజకీయాల కోసం ఇంకెంత కాలం సెంటిమెంట్ రాజకీయాలు వాడుకుంటారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకోవడం కోసం కేంద్రం కోట్లాది రూపాయలు ఇచ్చిందని.. అదే పది వేల కోట్ల నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను రక్షించేందుకు కేసీఆర్ ఆలోచిస్తే మంచిదని సలహా ఇచ్చారు. రాష్ట్రంలోని ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త త్వరలోనే బీజేపీలో చేరనున్నట్లు వేటుకూరి సూర్యనారాయణ చెప్పారు.

కేసీఆర్ గుడ్ జాబ్

'విశాఖ స్టీల్ కొనుగోలు'పై నారాయణ

సాక్షి, హైదరాబాద్: విశాఖ స్టీల్ ప్రభుత్వ రంగ సంస్థను తెలంగాణ ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తా మని సీఎం కె.చంద్రశేఖర్‌రావు చేసిన ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. బొగ్గు, స్టీల్‌కు లింకు ఉన్నందున, సింగరేణి సంస్థ ద్వారా నడిపించవచ్చంటూ కేసీఆర్ ముందుకు రావడాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈ నెల 14 నుంచి మే 15వ తేదీ వరకు నిర్వహించే 'బీజేపీ హటావో – దేశ్ బచావో' పాదయాత్ర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి సోమవారం నారాయణ ఆవిష్కరించారు.

ఒక్కర్నీ అసెంబ్లీ గేటు తాకనివ్వను

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు ఆ ఒక్క సీటు కూడా రాదు
- నాకు పార్టీలో సభ్యత్వమే లేదన్న వాళ్లు ఇప్పుడెలా సస్పెండ్ చేశారో చెప్పాలి
- అయినా ఇది దొంగలు పడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగిన చందంగా ఉంది
- మాజీ ఎంపీ పొంగులేటి ఫైర్
- భవిష్యత్ కార్యాచరణ కొద్దిరోజుల్లో వెల్లడిస్తానని వెల్లడి



ఖమ్మంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, పక్కన నాయకులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లా నుంచి ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థినీ అసెంబ్లీ గేటు తాకనివ్వనంటూ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో (2014, 2018) బీఆర్ఎస్‌కు ఒక్కో సీటు లభించిందని, కానీ వచ్చే ఎన్నికల్లో ఆ సీటు కూడా రాదని అన్నారు. తనను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం, దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. తనకు సభ్యత్వమే లేదని, మేం సస్పెండ్ చేయం, దమ్ముంటే మీరే రాజీనామా చేయాలని చెప్పిన నేతలు ఇప్పుడు ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

పార్టీలోకి ఆహ్వానించారా, లేదా?

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2014 ఎన్నికల్లో తాను ఎంపీగా, మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉమ్మడి జిల్లాలో గెలుపొందామని పొంగులేటి తెలిపారు. ఆ ఫలితాలు రాకముందే కేటీఆర్, జగదీశ్‌రెడ్డి తనను పార్టీలోకి ఆహ్వానించారని, ప్రభుత్వ ఏర్పాటుకు సీట్లు తక్కువ అవుతాయని చెప్పిన మాట వాస్తవమా, కాదా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సముచిత స్థానం ఇస్తానని చెప్పడంతో టీఆర్ఎస్‌లో చేరిన తనకు ఐదు నెలలకే ఆయన తీరు తెలిసిందన్నారు.

ఇబ్బంది పెట్టినా దిగమింగా..

తనను నమ్ముకున్న వారిని అవమానపరిచి, ఆర్థికంగా ఇబ్బందులు పెట్టినా దిగమింగానని శ్రీనివాసరెడ్డి చెప్పారు. 2014, 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఒక్కో అభ్యర్థే గెలవడానికి కారణాలపై ఎప్పుడైనా చర్చించారా? అని నిలదీశారు. అయినా గొర్రె కసాయిని నమ్మినట్లు కేసీఆర్, కేటీఆర్‌ను తాను నమ్మితే, వేరే అభ్యర్థికి టికెట్ ఇచ్చి గెలిపించాలని సూచించారని చెప్పారు. ఆ తర్వాత రాజ్యసభ సీటు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదని తెలిపారు. తనను నమ్ముకున్న వారికి సైతం స్థానిక సంస్థల్లో టికెట్లు ఇవ్వకుండా తనను తొక్కేయాలని చూసినా ప్రజల హృదయాల్లో ఉన్నందున ఏమీ చేయలేకపోయారన్నారు. పార్టీ ప్లీనరీ కోసం రాష్ట్రంలో ఎవరూ ఇవ్వనట్లు రూ.2 కోట్లు ఇచ్చానని చెప్పారు.

అప్పుడు నిజం తెలుసుకోలేకపోయా..

టీఆర్ఎస్ నుంచి జయశంకర్, కోదండరాం, విజయశాంతి, ఈటల తదితరులను అవమానించి పంపినప్పుడే తాను నిజం తెలుసుకోకపోవడంతో ఇప్పుడు అనుభవిస్తున్నానని పొంగులేటి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఏం కోరుకొంటున్నారో కొత్తగూడెం సమ్మేళనానికి జూపల్లి కృష్ణారావు రావడంతోనే అర్థమై ఉంటుందన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే నీళ్లు, నిధులు, నియామకాలు అందాయని, రావణాసురుడి కబంధ హస్తాలను వీడి భద్రాచలం రాముడి పాదాలు తాకే అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పరోక్షంగా సస్పెన్షన్‌పై వ్యాఖ్యానించారు.

రాజకీయ నిర్ణయం త్వరలోనే చెబుతా..

రాష్ట్రంలో తనలా నష్టపోయిన వారితో కలిసి సొంత పార్టీ పెట్టడమా?, ఇతర పార్టీలో చేరడమా? అనేది కొద్ది రోజుల్లో వెల్లడిస్తానని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో తనకు సత్సంబంధాలు ఉన్నా, ఏ పార్టీలో చేరాలో ఆయన ఎప్పుడూ చెప్పలేదన్నారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కనకయ్య, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకంటే వ్యక్తులు గొప్ప కాదు

మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడి

- జూపల్లి, పొంగులేటి పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు
- ఉద్యమంలో పొంగులేటి పాత్ర లేదు, ఆ తర్వాతే పార్టీలోకి వచ్చారు
- జూపల్లికి ప్రాధాన్యత ఇచ్చి మంత్రిని చేసినా ఎన్నికల్లో ఓడారని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పార్టీలకంటే వ్యక్తులమే గొప్ప అని చెప్పేందుకు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నందునే వారిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌పై వారిద్దరు చేసిన విమర్శలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పరాకాష్టగా పేర్కొన్నారు. ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి నిరంజన్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. 'వ్యక్తుల కోసం పార్టీ తలొగ్గదు. పార్టీకి అతీతులమనే ధోరణిని ఎవరూ సహించరు, పునరాలోచన చేసుకుంటారని ఇన్నాళ్లూ ఎదురుచూశాం. తనను తిట్టిన వారిని కూడా అక్కున చేర్చుకున్న గొప్ప మనసు కేసీఆర్‌ది. పార్టీలోకి ఎవరిని తీసుకున్నా తెలంగాణ ప్రయోజనాల కోసమే' అని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొంతకాలంగా జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎవరి ఉచ్చులో ఉన్నారో అందరికీ తెలుసన్నారు.

నైతికత లేదు

'తెలంగాణ ఉద్యమం మొదలైన పుష్కరకాలం తర్వాత జూపల్లి కృష్ణారావు పార్టీలో చేరారని, తెలంగాణ కోసం జరిగిన బలిదానాల గురించి మాట్లాడేందుకు జూపల్లికి నైతికత లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. 'మంత్రిగా సేవలు వినియోగించుకునేందుకు పార్టీలో ఎంతోకాలంగా పనిచేసిన వారిని కూడా కాదని జూపల్లికి కేసీఆర్ అవకాశమిచ్చారు. ఓటమి పాలైన జూపల్లి ఆత్మవిమర్శ చేసుకోకుండా విమర్శలు చేస్తున్నారు. ఉద్యమంలో పొంగులేటికి ఎలాంటి పాత్ర లేదు. ఆయనకు రాజకీయ అవకాశాలు ఎందుకు రాలేదో ఖమ్మం ప్రజలకు తెలుసు. తెలంగాణ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే శక్తుల తరహాలో ఇద్దరు నేతలూ మాట్లాడుతున్నారు' అని నిరంజన్‌రెడ్డి విమర్శించారు.

పొంగులేటి, జూపల్లి సస్పెన్షన్

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడిన జూపల్లి కూడా కేసీఆర్‌లో నిజాయితీ లోపించిందంటూ విమర్శించారు. కాగా సభ జరిగిన మరుసటి రోజే ఈ ఇద్దరు నేతలపై సస్పెన్షన్ వేటు పడటం గమనార్హం.

ఎంపీగా గెలిచి, టీఆర్ఎస్‌లో చేరి...

తెలంగాణ ఆవిర్భావం నేపథ్యంలో 2014 లోక్‌సభ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 2016 మే నెలలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి ఎంపీగా పోటీ చేస్తారని భావించినా పార్టీ టికెట్ దక్కలేదు. అయితే పొంగులేటికి రాజ్యసభ సభ్యత్వం దక్కుతుందని కొన్నిసార్లు, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి రాష్ట్ర కేబినెట్‌లో చోటు కల్పిస్తారని మరికొన్ని సందర్భాల్లో ప్రచారం సాగుతూ వచ్చినా వాస్తవ రూపం దాల్చలేదు. దీంతో గత ఏడాది ఆరంభం నుంచే శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ అధిష్టానంపై వివిధ రూపాల్లో తన అసంతృప్తిని వెల్లడిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ నేతల నడుమ విభేదాలను తొలగించే లక్ష్యంతో గత ఏడాది జూన్‌లో ఖమ్మం పర్యటనకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు స్వయంగా పొంగులేటి నివాసానికి వెళ్లారు. అయితే ఆ తర్వాత కూడా బీఆర్ఎస్ అధిష్టానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పొంగులేటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తన అనుచర వర్గంతో వరుస భేటీలు జరుపుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జనవరి 18న ఖమ్మం వేదికగా జరిగిన బీఆర్ఎస్ తొలి బహిరంగ సభకు కూడా దూరంగా ఉన్నారు. ఇటీవలి కాలంలో తన కార్యకలాపాలను ముమ్మరం చేసిన శ్రీనివాసరెడ్డి, ఆదివారం కొత్తగూడెంలో అభిమానుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి పార్టీ, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయడం సస్పెన్షన్‌కు దారితీసింది.

నేడు కొల్లాపూర్‌లో జూపల్లి చర్చలు

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో 2011 అక్టోబర్‌లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జూపల్లి కృష్ణారావు టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయడంతో 2012 మార్చిలో జరిగిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2014లో కొల్లాపూర్ నుంచి మరోమారు టీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన జూపల్లి తెలంగాణ తొలి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. కానీ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయితే ఆయనపై గెలుపొందిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరడంతో విభేదాలు తెరపైకి వచ్చాయి. కొల్లాపూర్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఈ నేపథ్యంలో జూపల్లి తన అనుచరులతో సొంత ప్యానెల్ ఏర్పాటు చేసి మున్సిపల్ ఎన్నికల బరిలో దిగారు. ఈ క్రమంలోనే దూరం పెరుగుతూ రాగా, తాజాగా ఆయనపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. కాగా బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన జూపల్లి కృష్ణారావు సోమవారం కొల్లాపూర్‌కు వెళ్లనున్నారు. తదుపరి కార్యాచరణపై అనుచరులతో భేటీ కానున్నారు.

బండారం బయటపడుతుందనే..

సస్పెన్షన్‌పై జూపల్లి వెల్లడి

- నా రాష్ట్రం నా ఇష్టం అన్నట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు
- మా ఇంట్లో వైఎస్సార్, కేసీఆర్ ఇద్దరి ఫొటోలు ఉన్నాయి
- మా ఇంట్లో ఎవరి ఫొటో ఉండాలో వీరు చెప్తారా అంటూ ధ్వజం



ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జూపల్లిని అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: పారదర్శకంగా పాలన చేయాల్సిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 'నా రాష్ట్రం నా ఇష్టం' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌ను గురైన జూపల్లి సోమవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ సముదాయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణ సాధనలో అందరి పాత్ర ఉంది. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. నాకు భయపడి సస్పెండ్ చేశారా లేక మీ బండారం బయటపడుతుందని బయటకు పంపారా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా ఇంట్లో ఎవరి ఫొటో ఉండాలో వీరు చెప్తారా, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ ఇద్దరి ఫొటోలూ ఉన్నాయి. మూడేళ్లుగా నాకు పార్టీ సభ్యత్వ నమోదు పుస్తకాలు ఇవ్వకపోయినా కేసీఆర్ ఫొటో మా ఇంట్లో ఉంది. గతంలో కాంగ్రెస్ నుంచి, ఇండిపెండెంట్‌గా కూడా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచా. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్‌లో నా ఓటమికి పార్టీ పెద్దలే కారణం. మంత్రి నిరంజన్‌రెడ్డికి నిజాయితీ లేదు. నా మీద వందిమాగదులతో ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టించారని సీఎంను అడుగుతున్నా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవరికీ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. కొల్లాపూర్‌లో ఉద్యమకారుల మీద అనేక కేసులు పెట్టారు. రాబోయే ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లలో నా మనుషులు కూర్చోవద్దనే లక్ష్యంతో ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ ద్రోహులకు అందలాలు, తాయిలాలు ఇస్తున్నారు. ప్రజాస్వామ్యం నిలబడాలన్నదే నా కర్తవ్యం. పార్టీ నుంచి బయటకు రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. నా రాజకీయ భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుంది' అని జూపల్లి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు చేరుకున్న జూపల్లిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే క్వార్టర్స్ సముదాయంలో ప్రెస్‌మీట్ నిర్వహించడానికి వీల్లేదని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే క్వార్టర్స్ గేటు బయటే జూపల్లి మీడియాతో మాట్లాడారు.

ఆ ఇద్దరు ఎటువైపు?

- పొంగులేటి, జూపల్లిల భవితవ్యంపై రాజకీయ వర్గాల్లో చర్చ

సాక్షి, హైదరాబాద్: పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుల రాజకీయ భవితవ్యంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్నారని తెలిసినప్పటి నుంచీ పొంగులేటి, జూపల్లిలు కాంగ్రెస్, బీజేపీల్లో ఎటో ఒకవైపు వెళతారనే చర్చ జరుగుతూనే ఉంది. అలాగే వారిని తమ వైపు లాక్కునేందుకు రెండు పార్టీలకు చెందిన పెద్దలు చాపకింద నీరులా చర్చలు జరుపుతున్నారనే ప్రచారం కూడా ఎప్పటి నుంచో జరుగుతోంది. కానీ వారి మనసులో ఏమున్నదన్నది మాత్రం అంతు పట్టడం లేదు. పొంగులేటి మనసు బీజేపీ వైపే ఉందని, కానీ కేడర్ మాత్రం కాంగ్రెస్‌లో చేరమని చెపుతోందని తెలుస్తోంది. ఇక జూపల్లి కాంగ్రెస్‌లో చేరే ఉద్దేశంతో ఉన్నారని సమాచారం. మరోవైపు వీరిద్దరూ మరికొందరు నాయకులతో కలిసి కొత్త పార్టీ ఏర్పాటు చేస్తారనే ఊహాగానాలు కూడా సాగుతుండటం గమనార్హం. పొంగులేటి సన్నిహిత నాయకుడు ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఇరువురు నాయకులు ఏ పార్టీలో చేరాలన్నది తేల్చుకోలేదని చెప్పారు. ఈ ఇద్దరే కాదని, రాష్ట్రంలోని ఐదు ఉమ్మడి జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు చాలామంది కలిసి ఒకే వేదిక మీదకు వస్తారని, అది కాంగ్రెస్సా? బీజేపీనా? అన్నది ఈ నెలాఖరుకు తేలే అవకాశం ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం.

బిల్లులపై విచారణ 24కు వాయిదా

- రాజ్‌భవన్‌లో ఆగిన బిల్లులపై సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వివరణ
- మూడు బిల్లులే పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడి
- తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది హాజరుకాకపోవడంతో విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ తన వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో మూడింటిని ఇప్పటికే ఆమోదించారని, రెండు బిల్లులను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. మరో రెండింటిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ వెనక్కి తిప్పి పంపారని, ఇంకో మూడు బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే అందుబాటులో లేని కారణంగా.. విచారణ వాయిదా వేయాలని జూనియర్ న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అయితే గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వర్చువల్‌గా హాజరుకావడంతో వాదనలు వినిపించాలని ధర్మాసనం సూచించింది. గవర్నర్ నుంచి తనకు అందిన వివరాలను కోర్టుకు సమర్పిస్తున్నట్టు తుషార్ మెహతా తెలిపారు. 'శాసనసభ గతేడాది సెప్టెంబరులో పాస్ చేసిన కొన్ని బిల్లులు ఉన్నాయి కదా.. వాటిపై తుది నిర్ణయం ఏమైనా గవర్నర్ కార్యాలయం నుంచి అందిందా?' అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించగా.. ఈ అంశాలపై ప్రస్తుతం తానేమీ చెప్పలేనని తుషార్ మెహతా వివరించారు. ఈ క్రమంలో ధర్మాసనం.. సొలిసిటర్ జనరల్ అందజేసిన వివరాలను రికార్డుల్లోకి తీసుకుంటున్నామని పేర్కొంటూ, తెలంగాణ తరపు న్యాయవాది విజ్ఞప్తి మేరకు విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

సొలిసిటర్ జనరల్ కోర్టుకు ఇచ్చిన వివరాలివీ..

''మూడు బిల్లులు.. తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ బిల్లు–2022, తెలంగాణ మున్సిపాలిటీస్ చట్ట సవరణ బిల్లు– 2023, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు–2023లను గవర్నర్ ఆమోదించారు. యూనివర్సిటీ ఆఫ్ ఫారెస్ట్రీ తెలంగాణ బిల్లు–2022, తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు–2022.. ఈ రెండింటిని రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపివేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు (స్థాపన, నియంత్రణ) సవరణ బిల్లు–2022, తెలంగాణ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు–2022, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (వయసు నియంత్రణ, పదవీ విరమణ) సవరణ బిల్లు–2022 గవర్నర్ క్రియాశీల పరిశీలనలో ఉన్నాయి. తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు–2023కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి గవర్నర్ వివరణ కోరారు. ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా (టర్మినేషన్, రెగ్యులేషన్ ఆఫ్ లీజు) సవరణ బిల్లు–2022కు న్యాయ విభాగం నుంచి వివరణపై స్పందన రాలేదు'' అని కోర్టుకు సొలిసిటర్ జనరల్ తెలిపారు.

మూడు బిల్లులకు ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

యూనివర్సిటీల్లో విద్యార్థులు నష్టపోతున్నారని అధికారవర్గాలు అంటున్నాయి.

ఆజామాబాద్ బిల్లుపై సందిగ్ధం

2022 సెప్టెంబర్ 13న రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఆమోదించిన ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంత (లీజుల నియంత్రణ, రద్దు) చట్ట సవరణ బిల్లు–2022పై కాస్త సందిగ్ధం నెలకొంది. ఆ బిల్లును అదే రోజున గవర్నర్ ఆమోదముద్ర కోసం రాజ్‌భవన్‌కు పంపినట్టు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటుండగా.. ఇప్పటివరకు న్యాయశాఖ నుంచి రాజ్‌భవన్‌కు అందలేదని గవర్నర్ కార్యదర్శి తాజాగా పేర్కొనడం గమనార్హం. అయితే సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ సమర్పించిన వివరాల మేరకు.. ఆజామాబాద్ బిల్లుకు సంబంధించి న్యాయశాఖ నుంచి స్పందన రావాల్సి ఉందని గవర్నర్ కార్యాలయం పేర్కొంది. ఈ బిల్లుల వ్యవహారంలో తాజా పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా అధికారికంగా ఎలాంటి స్పందన వెలువడలేదు.

రాష్ట్రపతి పరిశీలన కోసం నిలిచిపోయిన బిల్లులివీ..

తెలంగాణ అటవీ విశ్వవిద్యాలయం బిల్లు-2022

హైదరాబాద్‌లోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థను విశ్వవిద్యాలయంగా నవీకరించి.. ప్రపంచ స్థాయి అటవీ విద్య, పరిశోధన అందించడానికి ఈ బిల్లును తీసుకొచ్చింది.

తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లు-2022

తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డును ఏర్పాటు చేసి.. ఉన్నత విద్య, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల పరిపాలన నియంత్రణలో వర్సిటీల్లోని బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి ఈ బిల్లును తెచ్చింది.

ఇంకా గవర్నర్ పరిశీలనలో ఉన్న బిల్లులివీ..

తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు-2022

రాష్ట్రంలో కొత్తగా మరో ఐదు ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు వీలుగా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది.

తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లు-2022

మున్సిపల్ చైర్‌పర్సన్/ వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే కనీస కాలవ్యవధి ప్రస్తుతమున్న మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంపు.. మున్సిపాలిటీల్లో కో–ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంపు, ములుగు మున్సిపాలిటీ ఏర్పాటు, కేతనపల్లి మున్సిపాలిటీ పేరును రామకృష్ణాపూర్‌గా మార్పు కోసం ఈ బిల్లును తెచ్చింది.

గవర్నర్ ఆమోదించిన 3 బిల్లులివీ..

తెలంగాణ మోటారు వాహన పన్నుల చట్ట సవరణ బిల్లు-2022

ఇంతకుముందు మోటార్ వాహనాల చట్టంలో వాహనాల ధరకు సంబంధించి సరైన నిర్వచనం లేకపోవడంతో పన్నుల విధింపులో సమస్యలు ఎదురయ్యాయి. దీనితో డిస్కౌంట్లతో సంబంధం లేకుండా ఎక్స్‌షో రూమ్ ధర ఆధారంగా పన్ను విధించేలా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది.

తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లు-2023

ఆసిఫాబాద్, జనకాపూర్, గోదవెల్లి గ్రామాల కలయికతో కొత్తగా ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు.. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి నుంచి బోయపల్లి, తాళ్లనరసింహాపూరం గ్రామాలను తొలగింపు కోసం ప్రభుత్వం ఈ బిల్లును తెచ్చింది.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు-2023

ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలకు అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ఇచ్చే అధికారాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కల్పించడంతోపాటు బీఎస్సీ(హోమ్‌సైన్స్) కోర్సు పేరును బీఎస్సీ (కమ్యూనిటీ సైన్స్)గా మార్చడానికి ఈ బిల్లును తెచ్చింది.

తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ యాన్యుయేషన్) చట్ట సవరణ బిల్లు-2022

వైద్య కళాశాలల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 61 నుంచి 65 ఏళ్లకు పొడిగించేందుకు ప్రభుత్వం ఈ బిల్లును తెచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోసం తిప్పి పంపినవి..

తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు-2023

పాలన వికేంద్రీకరణలో భాగంగా భద్రాచలంను మూడు గ్రామ పంచాయతీలుగా, సారపాకను రెండు గ్రామ పంచాయతీలుగా విభజించడానికి, రాజంపేటను కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు ఈ బిల్లును తెచ్చింది.

ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంత (లీజుల నియంత్రణ, రద్దు) చట్ట సవరణ బిల్లు-2022

హైదరాబాద్ నగరంలో ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంతంలోని భూములను విక్రయించడానికి ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది.

సుప్రీంకోర్టుకు వెళితే తప్ప బిల్లులు పాస్ చేయరా?

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలనకు పంపామని చెబుతున్నారు. మా పిల్లలకు ప్రొఫెసర్ చదువులు చెప్పొద్దా? పిల్లల భవిష్యత్ కంటే రాజకీయా లు ముఖ్యమా?'' అని ప్రశ్నించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను పాస్ చేయకుండా గవర్నర్ రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

మిషన్ భగీరథకు నిధులేవి?

ప్రజల తాగునీటి కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా కేంద్రం పక్షపాతం చూపిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. మిషన్ భగీరథకు రూ.13 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పినా.. కనీసం 13 పైసలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ''తెలంగాణకు కేంద్రం తీరని అన్యాయం చేస్తోంది. తెలంగాణ పథకాలు అద్భుతమని తీయటి మాటలు చెప్తారు, అవార్డులు కూడా ఇస్తారు. కానీ నయా పైసా నిధులు మాత్రం ఇవ్వరు'' అని విమర్శించారు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఈ పథకం చేపట్టామని, మల్లన్న సాగర్ నుంచి ఆరు జిల్లాల్లో 10 నియోజకవర్గాల పరిధిలోని 1,922 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. వచ్చే 50 ఏళ్ల అవసరాలు తీర్చేలా ప్రాజెక్టును రూపొందించామన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.



గోదారమ్మకు సారె సమర్పిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి

నిధులు ఇవ్వకుండా మోసం: ఎర్రబెల్లి

కేంద్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి నిధులు ఇవ్వకుండా మోసం చేసిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు డబ్బులిస్తూ.. తెలంగాణపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

క్లుప్తంగా...

పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం

సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక తత్వవేత్త, మహాత్మాజ్యోతిరావ్ పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా, దళిత, గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా దాదాపు రెండు వందల ఏళ్ల కిందే కార్యాచరణ చేపట్టారని కొనియాడారు. జ్యోతిరావ్ పూలే 197వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను, త్యాగాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ స్వయంగా పూలేను తన గురువుగా ప్రకటించుకున్నారని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహనీయుల ఆశయాలను నెరవేర్చేదిశగా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణను అమలు చేస్తోందన్నారు.

కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో చేరికల పర్వం కొనసాగుతోంది. మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు శంకరన్న ధోంగే నేతృత్వంలో మహారాష్ట్రకు చెందిన పలువురు సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ఎన్సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ సలుంఖే, మాజీ ఎమ్మెల్యే సంగీత వి.థోంబరే, విజయ్ థోంబరే, ముఖేడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన నానాసాహెబ్ జాదవ్, జెడ్పీ మెంబర్ శివ మొహోద్, మాజీ సభాపతి సునీల్ ఫోటె, మాజీ జెడ్పీ మెంబర్ దేవానంద్ మూలె, నాందేడ్ కార్పొరేటర్ శ్రీనివాస్ జాదవ్, శివ్ సంగ్రామ్ పార్టీ నుంచి కచ్రే సహేద్, ఎ బీడ్ నుంచి అమర్ షిండే, శివ్ సంగ్రామ్ పార్టీ ప్రెసిడెంట్ పంజాబ్ రావ్ దేశ్ ముఖ్, శివ్ సంగ్రామ్ పార్టీ స్టూడెంట్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శైలేష్ సర్కేట్, కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు శివరాజ్ ధోంగే పాల్గొన్నారు.

విచారణకు సంజయ్ సహకరించడం లేదు

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు

సాక్షి, హైదరాబాద్: పదోతరగతి హిందీపేపర్ లీకేజీకి సంబంధించి నమోదైన కేసులో పోలీసు విచారణకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సహకరించడంలేదని హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ఫోన్ కూడా ఇవ్వడంలేదని, దర్యాప్తు అధికారికి ఆయన ఫోన్ అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. విచారణకు సహకరించనందున సంజయ్ బెయిల్ పిటిషన్‌ను రద్దు చేయాలని కోరారు. పదోతరగతి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సంజయ్‌ను అరెస్టు చేసి హనుమకొండ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. దీన్ని సవాల్ చేస్తూ బీజేపీ హైకోర్టు ను ఆశ్రయించగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మా సనం విచారణ చేపట్టింది. జైలు నుంచి సంజయ్ విడుదలైనందున విచారణ అవసరంలేదన్న ఏజీ వాదన సీజే ఏకీభవించారు. తదుపరి విచారణఈ నెల 21కి వాయిదా పడింది.

అన్ని ఆసుపత్రుల్లో మాక్‌డ్రిల్

సాక్షి, హైదరాబాద్: దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతుండటంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్‌ఆసుపత్రుల్లో సోమవారం కోవిడ్ మాక్‌డ్రిల్ నిర్వహించింది. మంగళవారం కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించనుంది. మరోవైపు కరోనా వ్యాక్సిన్ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద వ్యాక్సిన్లు అందుబాటులో లేవు. దీనిపై ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు వివరణ కోసం ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

బీఎస్పీ గెలిస్తే బంగ్లా కట్టను



ప్రవీణ్‌కుమార్

అలంపూర్: రాష్ట్రంలో బీఎస్పీ గెలిచి అధికారంలోకి వస్తే సీఎం కేసీఆర్‌లాగా బంగ్లా కట్టనని, ఇప్పుడు ఉన్న కిరాయి ఇంట్లోనే ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో నిర్వహించిన బీఎస్పీ బహుజన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ పార్టీ అధ్యక్షురాలు మాయావతి సీఎం అయ్యాక, కేసీఆర్‌లా ఫాంహౌస్ కట్టుకోలేదని, ప్రత్యేక విమానం కొనలేదని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మాదిరిగా బంగ్లాలు కట్టుకోలేదని అన్నారు. మాయావతి యూపీ సీఎంగా ఉన్న సమయంలో 7 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, అవినీతి లేకుండా 12 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు పేదలకు న్యాయం చేయడం ఇష్టం లేదని దుయ్యబట్టారు. ఆ పార్టీలు ఏ పని చేసినా కమీషన్ల కోసమేనని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత బంధు, పింఛన్లు ఇస్తామని మరోసారి మోసం చేయడానికి చూస్తున్నారని, కొందరు భయపెట్టడానికి ప్రయత్నిస్తారని అలాంటి వాటికి భయపడొద్దని చెప్పారు.

మహిళా పోలీస్.. లెక్కలో లెస్..


సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర జనాభాలో మహిళలు దాదాపు సగం (49.7 శాతం) ఉన్నప్పటికీ... మహిళా పోలీసుల శాతం మాత్రం ఇప్పటికీ నామమాత్రంగానే ఉంది. కేంద్రం అధీనంలోని బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డీ) గణాంకాల ప్రకారం రాష్ట్ర పోలీసు విభాగంలో పనిచేస్తున్న మొత్తం సిబ్బంది, అధికారుల సంఖ్య 62,731గా ఉండగా అందులో మహిళా పోలీసులు కేవలం 5,349 (8.53 శాతం) మందే ఉన్నారు.

రాష్ట్రంలో నామమాత్రంగా మహిళా పోలీసుల సంఖ్య

మొత్తం 62,731 మంది పోలీసుల్లో మహిళా పోలీసుల సంఖ్య 5,349 మాత్రమే	ఆంధ్రప్రదేశ్‌లో మహిళా పోలీసుల సంఖ్య 19 వేల పైనే...

కేంద్రం అధీనంలోని పోలీసు పరిశోధనాభివృద్ధి బ్యూరో గణాంకాల్లో వెల్లడి



బీపీఆర్ అండ్ డీ ఏటా అన్ని రాష్ట్రాలు, కమిషనరేట్లలో పోలీసు సిబ్బంది వివరాలను సేకరిస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న జనాభాతో పురుష-మహిళా పోలీసులు, సివిల్-ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాల్లోని సిబ్బందిని

2021 జనవరి నాటి పరిస్థితుల ఆధారంగా...

గణించి నివేదిక రూపొందిస్తోంది. 2021 జనవరి నాటి గణాంకాల ఆధారంగా అధ్యయనం చేసిన బీపీఆర్ అండ్ డీ... రాష్ట్రంలో మహిళలకు అవసరమైన స్థాయిలో మహిళా పోలీసులు లేరని స్పష్టం చేసింది. అయితే అన్ని రాష్ట్రాలూ మహిళా పోలీసు పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు భర్తీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

ఇవీ బీపీఆర్ అండ్ డీ గణాంకాలు...

రాష్ట్రం	మొత్తం పోలీసులు	అందులో మహిళలు	శాతం
ఆంధ్రప్రదేశ్	88,689	19,299	21.76
బిహార్	93,313	19,790	21.21
తమిళనాడు	1,18,057	22,547	19.1
మహారాష్ట్ర	1,70,570	30,432	17.84
కర్ణాటక	95,516	8,240	8.63
తెలంగాణ	62,731	5,349	8.53

రాష్ట్రంలో ప్రతి 1,699 మంది మహిళలకు ఒక ఉమెన్ పోలీసు మాత్రమే అందుబాటులో ఉన్నారు.

ఉన్న సిబ్బందికీ సమస్యలెన్నో...

ప్రస్తుతం పోలీసు విభాగంలో ఉన్న మహిళా సిబ్బందిని ఫిట్‌నెస్ సమస్యలు వెంటాడుతున్నాయి. చాలా మంది మహిళా పోలీసులు స్థూలకాయంతో బాధపడుతున్నారు. వ్యాయామం లేకపోవడం, ఏళ్ల తరబడి కార్యాలయ విధులకే పరిమితం కావడంతో బందోబస్తు డ్యూటీ చేయాల్సి వస్తే నిరసనకారులను అదుపు చేయడం వారికి సాధ్యం కావట్లేదు. కొత్తగా విధుల్లో చేరిన యువ మహిళా సిబ్బంది మినహా మిగిలిన వారిలో అనేక మందికి ఈ సమస్యలు ఉన్నాయి. మహిళా పోలీసు సిబ్బంది కొరత తీర్చడంతోపాటు ఉన్న వారిలోనూ నైపుణ్యాలు మెరుగుపరచడానికి ఉమ్మడి రాష్ట్రంలో తెరపైకి వచ్చిన ప్రతిపాదనలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. మహిళా పోలీసులకు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించడం, వృత్తిలో మెళకువలు నేర్పే ఉద్దేశంతో క్రాష్‌కోర్స్ నిర్వహించాలని గతంలో భావించారు. అయితే ఈ ప్రక్రియ కొందరికి పూర్తయినా మిగిలిన వారికి ఆగిపోయింది. ప్రత్యేక మహిళా బెటాలియన్ ఏర్పాటుకు సన్నాహాలు చేసినా ఆచరణకి రాలేదు.

ఎట్టకేలకు లా అండ్ ఆర్డర్‌కు నేతృత్వం..



హైదరాబాద్‌లోని మూడు కమిషరేట్లలో 150కిపైగా లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్లు, ఐదు మహిళా ఠాణాలు ఉన్నాయి. మహిళా ఠాణాలకు ఉమెన్ ఆఫీసర్లే నేతృత్వం వహిస్తున్నా చాలాకాలం వరకు మూడు కమిషనరేట్లలో ఏ ఒక్క శాంతి భద్రతల విభాగం పోలీసు స్టేషన్‌కు మహిళా పోలీసును స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా నియమించిన దాఖలాలు లేవు. అయితే హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గతేడాది మహిళా దినోత్సవం రోజు లాలాగూడ ఠాణాకు మధులతను మొదటి మహిళా ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. మరోవైపు గతంలో మహిళా పోలీసు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా అభ్యర్థినుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన ఉండేది కాదని... తాజాగా చేపట్టిన పోలీసు రిక్రూట్‌మెంట్‌లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతోపాటు వారికి అనేక వెసులుబాట్లు కల్పించడంతో పోలీసు విభాగంలో అతివల కొరత చాలా వరకు తీరుతుందని అధికారులు చెబుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్ తాళాలు మిస్

- ‘ధర్మపురి’ కేసులో హైకోర్టు నిర్ణయం మేరకే తదుపరి చర్యలన్న కలెక్టర్



స్ట్రాంగ్‌రూమ్ వద్ద లక్ష్మణ్‌కుమార్ ఆందోళన

జగిత్యాల: జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల డాక్యుమెంట్ కాపీలు, సీసీ పుటేజీలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు మిస్సయ్యాయి. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అక్రమమని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు సుమారు నాలుగున్నరేళ్లుగా కొనసాగుతోంది. అయితే, ఎన్నికల ఫలితాలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచి 17ఏ, 17సీ డాక్యుమెంట్ కాపీలు, సీసీ పుటేజీలు, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను ఈనెల 11న తమకు సమర్పించాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా సమక్షంలో మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచేందుకు ఉద్యోగులు వెళ్లారు. ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించిన మూడు స్ట్రాంగ్‌రూమ్‌లు వీఆర్‌కే కళాశాలలో ఉండగా, అందులో కోర్టు అడిగిన 17ఏ, 17సీ వీడియో పుటేజీలు భద్రపర్చిన గది లాక్ ఓపెన్ కాలేదు. మిగతావి రెండు ఓపెన్ అయ్యాయి. అందులో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రంగానే ఉన్నాయి. కోర్టు అడిగిన డాక్యుమెంట్లు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ మాత్రమే ఓపెన్ కాకపోవడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయమై కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. ధర్మపురి నియోజకవర్గం స్ట్రాంగ్‌రూమ్-3కి లాక్ ఓపెన్ కావడం లేదని తెలిపారు. పతినెలా వచ్చి చూసినప్పుడు తాళానికి సీల్ వేసే ఉందన్నారు. ఇదే విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్తామని, నివేదిక సమర్పిస్తామని, హైకోర్టు నిర్ణయానుసారం వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

కలెక్టర్ తప్పిదం వల్లే: అడ్లూరి

ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల వీడియో పుటేజీ, డాక్యుమెంట్లు ఉంచిన రూమ్ 786051 తాళం చెవి లేకపోవడానికి కలెక్టర్, మంత్రి కొప్పుల ఈశ్వరే బాధ్యత వహించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ తప్పిదం వల్లే ఇది జరిగిందని ఆరోపించారు.

సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు పంచుతున్నాం

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నాయో తేడాను ప్రజలు గమనించాలన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తూ రైతులకు రైతుబంధు ఇవ్వడంతోనే భూముల ధరలు పెరిగాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 13,117 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరగ్గా ఇప్పుడు తెలంగాణలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఏటా విద్యుత్ కొనుగోలుకు రూ. 10 వేల కోట్లు వెచ్చిస్తున్నామని... రూ. 50 వేల కోట్లు వెచ్చించి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నామన్నారు.

రూ. 200 నుంచి రూ. 2,016కు పెన్షన్ పెంచాం..

పేదరికమే గీటురాయిగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మంత్రి కేటీఆర్ వివరించారు. ఒకప్పుడు రూ. 200గా ఉన్న పెన్షన్‌ను రూ. 2,016కు పెంచామని గుర్తుచేశారు. తెలంగాణలో ఉన్న సౌకర్యాలు ఏ రాష్ట్రంలోనూ లేవని స్పష్టం చేశారు. ఏ ఊరికి వెళ్లినా వైకుంఠధామాలు, డంప్‌యార్డులు, పల్లె ప్రకృతివనాలు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు ఇలా ఎక్కడాలేని సౌలత్‌లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. నిత్యం తమ ప్రభుత్వాన్ని నిందించే ప్రతిపక్షాలకు చెందిన నాయకులకు సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షలు అందిస్తామన్నారు. అర్హులందరికీ డబ్బులిస్తామని కేటీఆర్ తెలిపారు.

అంబేడ్కర్ చలవతోనే తెలంగాణ...

దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చలవతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాజ్యాంగంలో నాడు ఆర్టికల్-3ని పొందుపరచడం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కంటివెలుగు పథకం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని వివరించారు. సీఎం కేసీఆర్ దమ్మున్న నాయకుడని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని కుటుంబాలేమైనా ఉంటే ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సాయాన్ని ఆయా కుటుంబాలకు అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రాష్ట్ర పవర్ లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ‘సెస్’చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మన ఎంపీ సక్కంగ లేడు...

మన ఎంపీ (కరీంనగర్) బండి సంజయ్ సక్కంగ లేడని, ఆయన సక్కంగ ఉంటే ఇప్పటికే సిరిసిల్ల జిల్లాకు రైలు సౌకర్యం వచ్చేదని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆయన హిందూ, ముస్లింల చిచ్చుపెట్టేలా మసీదులను కూలుస్తామని చెప్పడంతోపాటు పేపర్ లీక్‌లు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే ఈపాటికి జిల్లాకు రైలు వచ్చేదన్నారు.

కేసీఆర్‌వన్నీ మనీ సంబంధాలే

- ఆయన మానవత్వంలేని మూర్ఖుడు: బండి సంజయ్
- పార్టీ నేతలతో కలసి బలగం సినిమా వీక్షణం.. చిత్ర బృందానికి ప్రశంస



సినిమా చూస్తున్న బండి సంజయ్

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ మానవత్వం లేని, మానవ సంబంధాల విలువ తెలియని మూర్ఖుడని... ఆయనవన్నీ మనీ సంబంధాలేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. ఆయనకు మానవత్వం ఉండి ఉంటే గతంలో కుమార్తె పెళ్లికి హాజరు కాకుండా రేవంత్‌రెడ్డిని, అత్తమ్మ దశదిన కర్మకు వెళ్లకుండా తనను అరెస్ట్ చేయించి ఉండేవారు కాదన్నారు. ప్రతిపక్ష నాయకుల ఇళ్లలో ఎలాంటి కార్యాలు జరిగినా అరెస్ట్ చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మానవత్వపు విలువలు, బాంధవ్యాలపై తీసిన బలగం సినిమాను కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు కట్టేసి చూపించాలన్నారు. ఈ సినిమా చూసైనా వారికి బుద్ధి వస్తుందేమోనన్నారు. సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని దేవి 70 ఎంఎం థియేటర్‌లో ప్రదర్శితమవుతున్న బలగం సినిమాను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్ సుందర్‌గౌడ్‌తో కలసి బండి సంజయ్ వీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మానవత్వ విలువలు నశించిపోతున్న ఈ తరుణంలో దర్శకుడు వేణు ఎల్దండి బలగం సినిమా తీసి ఎంతో మేలు చేశారన్నారు. మనిషి మరణించినా విలువ ఇవ్వాలనే అంశాన్ని ఈ సినిమాలో చూపించారని ప్రశంసించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరవలేని... బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు హామీని విస్మరించిన సీఎం కేసీఆర్‌కు ఏపీలోని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి మాట్లాడే అధికారం లేదని బండి సంజయ్ విమర్శించారు.

సెల్‌ఫోన్ మీరే వెతికి పట్టుకోవాలి: సంజయ్

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి వరంగల్ పోలీసులు 91 సీఆర్‌పీసీ కింద ఇచ్చిన నోటీసులకు బండి సంజయ్ సమాధానమిచ్చినట్టు సమాచారం. లీకేజీకి సంబంధించిన అంశాల పరిశీలనకు సంజయ్ సంబంధిత ఫోన్‌తో రావాలంటూ పోలీసులు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సంజయ్ లిఖిత పూర్వక సమాధానాన్ని బీజేపీ లీగల్‌సెల్ బృందం వరంగల్ వెళ్లి పోలీసులకు అందజేసింది. తన వద్ద ఫోన్ లేదని, దానిని పోలీసులే వెతికి పట్టుకోవాలని సంజయ్ ఆ లేఖలో పేర్కొన్నారు. తన అరెస్ట్ సందర్భంలో వివిధ చోట్లకు తిప్పడం, తోపులాటలో తన ఫోన్ పోయిందన్నారు. ఫోన్ పోయిన విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమ ంలో తనను హాజరుకావాలంటూ ఇచ్చిన నోటీస్‌ను వెనక్కి తీసుకోవడంతో పాటు, వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఒత్తిడి తేవొద్దని కోరారు. లేనిపక్షంలో చట్టాన్ని ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు.

15న వరంగల్‌లో నిరుద్యోగ మార్చ్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలలో ఈ మార్చ్‌లను నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వతీరుపై నిరసనలు తెలపాలని బీజేపీ భావిస్తోంది. ఈ మేరకు 15న వరంగల్‌లో నిర్వహించడంతోపాటు త్వరలోనే మిగతా 9 జిల్లాల్లోనూ నిర్వహించే తేదీలు నిర్ణయించనున్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టీసేవ్ పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్ షర్మిల, గద్దర్, కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్

మోదీ కార్పొరేట్ మోడల్... కేసీఆర్ మాఫియా మోడల్

భూదోపిడీతో కేసీఆర్ లక్షల కోట్లు సంపాదించాడు...

- వేల కోట్లు సమకూరుస్తానని బేరసారాలు చేస్తున్నాడు
- కర్ణాటకలో కాంగ్రెస్‌ను అస్థిరపరిచే కుట్రకు పాల్పడుతున్నాడు
- కేసీఆర్ వైఖరి కరోనా కంటే ప్రమాదకరం: పీసీసీ చీఫ్ రేవంత్



సాక్షి, హైదరాబాద్: దేశంలో మోదీ కార్పొరేట్ మోడల్‌తో ప్రభుత్వ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ మాఫియా మోడల్‌తో భూదోపిడీతో లక్షల కోట్ల రూపాయలు సంపాదించాడని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్క కేసీఆర్ వందమంది దావూద్ ఇబ్రహీంలకు సమానమని, కేసీఆర్ మోడల్ దేశానికే ప్రమాదకరమని దుమ్మెత్తిపోశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు మహేశ్‌కుమార్ గౌడ్, మల్లురవి, సంగిశెట్టి జగదీశ్వరరావు, చరణ్‌కౌశిక్ యాదవ్, మెట్టుసాయికుమార్‌తో కలిసి రేవంత్ మాట్లాడారు. అక్రమ సంపాదనతో దేశ రాజకీయాలను శాసించాలని కేసీఆర్ భావిస్తున్నారని నిందించారు. అందుకే ఎన్నికల నిర్వహణకు రూ.వేల కోట్లు ఖర్చు పెడతానని బేరసారాలు చేస్తున్నారని, కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అస్థిరపరిచేందుకు జేడీఎస్ నేత కుమారస్వామికి వందల కోట్ల రూపాయలు ఇస్తున్నారని ఆరోపించారు.

కేసీఆర్ భూ దోపిడీని సీరియల్‌గా విడుదల చేస్తా

కేసీఆర్ భూదోపిడీని సీరియల్‌గా విడుదల చేస్తానని రేవంత్ ప్రకటించారు. ఈ దోపిడీకి సహకరించిన ఆ ఏడుగురు అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ‘ఆరు నెలల్లో మా ప్రభుత్వం వస్తుంది. ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదు. సోమేశ్ కుమార్, అరవింద్ కుమార్, జయేశ్ రంజన్, మేడ్చల్, రంగారెడ్డి కలెక్టర్లు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ఖానామెట్‌లోని 41 సర్వే నెంబర్‌లో 150 ఎకరాల భూమి ఉండేది. అందులో 60 ఎకరాలు మాఫియాకు కట్టబెట్టారు. యశోదా హాస్పిటల్ కొల్లగొట్టిన భూములపై వివరాలు ఇవాళ చెబుతా. ఖానామెట్ భూములపై ధారావాహికగా వివరాలు విడుదల చేస్తా.’అని రేవంత్ వెల్లడించారు. కేసీఆర్ వైఖరి కరోనా వైరస్ కంటే ప్రమాదకరమని హెచ్చరించారు. కేసీఆర్‌ను జాతీయ నేతలెవరూ దరిదాపుల్లోకి కూడా రానీయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు లేఖ రాస్తామని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా వందల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న కేసీఆర్ కుటుంబ ఆస్తులు ఎన్నికల ముందు ఎంత ఉన్నాయని, ఇప్పుడు ఎంత ఉన్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ తనకు సన్నిహితుడైన ఎంపీ పార్థసారథిరెడ్డికి చెందిన ట్రస్టుకు అధికారుల నివేదికలను కూడా పక్కనపెట్టి.. నామమాత్రపు అద్దె చెల్లించేలా 15 ఎకరాల భూమిని కట్టబెట్టారని ఆరోపించారు.

పొంగులేటి, జూపల్లికి నా సానుభూతి ఉంటుంది

బీఆర్‌ఎస్ సస్పెండ్ చేసిన మాజీ ఎంపీ పొంగులేటి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారా అన్న ప్రశ్నకు రేవంత్ స్పందిస్తూ ‘కేసీఆర్ చేతిలో మోసపోయినవారిపై నా సానుభూతి ఉంటుంది. వారు కేసీఆర్‌పై తిరుగుబాటు జెండా ఎగరేశారు. కేసీఆర్ కోట గోడలు బీటలు బారుతున్నాయి.’అని వ్యాఖ్యానించారు.


కొలువుల కోసం కొట్లాడుదాం

- విపక్షాలకు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు
- నిరుద్యోగులకోసం పోరాటానికి కలసి రావాలని అఖిలపక్షం విజ్ఞప్తి
- ఈ నెల 17న 48 గంటల నిరాహార దీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాల కోసం పోరాడటం మన నైతిక బాధ్యత అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. ఈ విషయంలో రాజకీయాలు, సిద్ధాంతాలను పక్కన పెట్టి కలసి పోరాటం చేద్దామన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగులు, విద్యార్థుల కోసం చేపడుతున్న ‘టీ-సేవ్’పోరాటంలో భాగంగా షర్మిల ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం జరి గింది. కలసి ఉద్యమిస్తే తెలంగాణ భవిష్యత్‌ను కాపాడిన వాళ్లమవుతామన్నారు. అందుకే టీ-సేవ్ ఫోరం ఏర్పాటు చేశామని తెలిపారు. దీని ద్వారా ఉద్యోగాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, హాస్టళ్లలో వసతులు.. తదితర అంశాల మీద పోరాటం చేద్దామన్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత 3.85 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంటుందన్నారు. కానీ, ప్రభుత్వం ఇన్నేళ్ల తర్వాత 80 వేల ఉద్యోగాలని చెప్పి.. ఇప్పటివరకు 43 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ మెడలు వంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 17న 48 గంటలపాటు నిరాహార దీక్ష చేద్దామని పిలుపునిచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకులపై తక్షణం సీబీఐ దర్యాప్తు చేయించాలని, ముందు ఆ బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 2.20 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కేసీఆర్ ఒక దమ్ములేని ముఖ్యమంత్రని మండిపడ్డారు. కమ్యూనిస్టులు కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రజా ఉద్యమ నాయకుడు గద్దర్ మాట్లాడుతూ యువత ఏకం అయితే కేసీఆర్ పేక మేడ కూలిపోతుందన్నారు. సమావేశంలో ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ, గిరిజన శక్తి నాయకుడు శరత్ నాయక్, బీసీ యునైటెడ్ ఫ్రంట్ రామకృష్ణయ్య, న్యూ డెమోక్రసీ నేత వెంకటరామయ్య, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుశీలా బాయి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ స్పీడ్ సరిపోదు!

- ఎన్నికల కార్యక్రమాల విస్తృతి పెరగాలి
- రాష్ట్రంలో బీజేపీ అధికార సాధన లక్ష్యంగా ముందుకు సాగాలి
- 7 మోర్చాల సమావేశంలో తరుణ్ ఛుగ్, అర్వింద్ మీనన్ దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: మరో 7, 8 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో ప్రస్తుతం చేస్తున్న కృషి సరిపోదని, తెలంగాణలోని అన్ని వర్గాలను చేరుకుని కార్యక్రమాల వేగం పెంచాలని రాష్ట్ర బీజేపీని జాతీయ నాయకత్వం ఆదేశించింది. ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించింది. పార్టీలోని అన్ని విభాగాలు, 7 మోర్చాలు సన్నద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేసింది. రాష్ట్ర నాయకత్వం, వివిధ విభాగాలు, మోర్చాల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిలు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్ రెండు, మూడు రోజులుగా అంతర్గత సమావేశాలు నిర్వహించారు. శనివారం జరిగిన ప్రధాని మోదీ సభతో పార్టీ ఎన్నికల శంఖం పూరించినట్టేనని తెలిపారు.

ఎస్సీ నియోజకవర్గాల్లో గెలుపు కోసం: అర్వింద్ మీనన్

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, కిసాన్ ఇతర మోర్చాల జిల్లా ఇన్‌చార్జిలతో జాతీయ నాయకుడు అర్వింద్ మీనన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సోమవారం వేర్వే రుగా సమావేశమయ్యారు. ఎస్సీ లు, ఎస్టీలు, ఓబీసీలు అధికంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆయా కులాలు, వర్గాలవారీగా ఓటర్లు, ప్రభా వం చూపే అంశాలపై లోతైన కసరత్తు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 19 ఎస్సీ, 12 ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాలపై ఫోకస్ చేయాలని ఆదేశించారు. ఈ నియోజకవర్గాల్లో అధికస్థానాలు గెలిస్తేనే పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అసెంబ్లీని యూనిట్‌గా తీసుకుని అసెంబ్లీ, మండల, గ్రామ స్థాయి, శక్తి కేంద్రం (మూడు, నాలుగు పోలింగ్ బూత్‌లు కలిపి ఒకటి), బూత్ స్థాయి వరకు ఎవ్వేళలా కృషి చేయాలని సూచించారు.

ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతం...

ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర నేతలను మండలాల ఇన్‌చార్జీలుగా నియమించి 31 నియోజకవర్గాల్లోని ప్రతిబూత్‌లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని మోర్చాల నేతలు తెలియజేసినట్టు సమాచారం. ఎస్సీ, ఎస్టీ బస్తీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం, ఆయా వర్గాల్లోని మేధావులకు, విద్యావంతులకు బీజేపీ ఆలోచనలు, ఆశయాలను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాషా, ఓబీసీ మోర్చా ఆలె భాస్కర్ రాజ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, ఎస్సీ మోర్చా ఇంచార్జి డా.జి.మనోహర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ పాల్గొన్నారు.



బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు.
క్షమాగుణం కేవలం బలవంతుల లక్షణం.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, ఏప్రిల్, 11

లీకుల సుడిగుండంలో అమెరికా

ఈ ప్రపంచంలో మూడింటిని దాచిపెట్టడం అసాధ్యమని బుద్ధుడు చెబుతాడు. అవి–సూర్యుడు, చంద్రుడు, సత్యం! ఏ దేశమైనా అంతర్జాతీయంగా తనవారెవరో, కానివారెవరో తెలుసుకోవటానికి నిత్యం ప్రయత్నిస్తుంటుంది. ఎలాంటి వ్యూహాలు పన్నాలో, ఏ ఎత్తుగడలతో స్వీయప్రయోజనాలు కాపాడుకోవాలో అంచనా వేసుకుంటుంది. అందుకు తన వేగుల్ని ఉపయోగిస్తుంది. పరస్పర దౌత్య మర్యాదలకు భంగం లేకుండా చాపకింద నీరులా ఈ పని సాగిపోతుంటుంది. ఈ విషయంలో అమెరికాది అందె వేసిన చేయి. నిఘా నిజమైనప్పుడు అది ఎన్నాళ్లు దాగుతుంది? తాజాగా బజారున పడిన అత్యంత రహస్యమైన పత్రాలు అమెరికాను అంతర్జాతీయంగా ఇరకాటంలో పడేశాయి. శత్రువులు సరే...దక్షిణ కొరియా, ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లాంటి దేశాలు సైతం తమపై అమెరికా నిఘా పెట్టిందన్న సంగతిని జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇక దాని ప్రధాన ప్రత్యర్థి రష్యా గురించి చెప్పేదేముంది? ఆ దేశ రక్షణశాఖలోకి అమెరికా నిఘా విభాగం ఎలా చొచ్చుకుపోయిందో ప్రస్తుతం వెల్లడైన రహస్యపత్రాలు తెలియజెబుతున్నాయి. అలా సేకరించిన సమాచారం ఆధారంగా ఉక్రెయిన్‌కు సలహాలిస్తూ రష్యాపై దాని యుద్ధవ్యూహాలను పదునెక్కిస్తున్న వైనం బయట పడింది. ఉక్రెయిన్ వ్యూహాలపై, అది తీసుకుంటున్న నిర్ణయాలపై అమెరికాకు ఎలాంటి అభి ప్రాయాలున్నాయో ఈ పత్రాలు వివరిస్తున్నాయి. ఇటీవల ఉక్రెయిన్‌లో రష్యాకు వరస అపజయాలు ఎదురయ్యాయి. గతంలో స్వాధీనమైన నగరాల నుంచి అది తప్పుకోక తప్పనిస్థితి ఏర్పడింది. వీటన్నిటి వెనుక అమెరికా మార్గదర్శకం ఉన్నదని పత్రాలు చెబుతున్నాయి. ఇవన్నీ నకిలీ పత్రాలని ఉక్రెయిన్ సైనికాధికారులు దబాయిస్తున్నా పెంటగాన్ మాత్రం ఆ పని చేయలేకపోతోంది. ఉక్రెయిన్‌లోని ఏ ప్రాంతంపై ఏ రోజున ఎన్ని గంటలకు రష్యా సైన్యం దాడి చేయదల్చుకున్నదో అమెరికా నిఘా సంస్థ ఎప్పటికప్పుడు ఆ దేశాన్ని హెచ్చరించిన వైనాన్ని ఈ పత్రాలు బయటపెట్టాయి. అయితే సందట్లో సడేమియాలా లీకైన ఈ పత్రాల్లో ఫొటోషాప్ ద్వారా తనకు అనుకూలమైన మార్పులు చేర్పులూ చేసి ప్రత్యర్థులను గందరగోళపరచడానికి రష్యా ప్రయత్నిస్తోంది. ఎవరి ప్రయోజనం వారిది!

సరిగ్గా పదమూడేళ్లక్రితం జూలియన్ అసాంజ్ వికీలీక్స్ ద్వారా అమెరికాకు సంబంధించిన లక్షలాది కీలకపత్రాలు వెల్లడించాడు. ఆ తర్వాత సైతం ఆ సంస్థ అడపా దడపా రహస్య పత్రాలు వెల్లడిస్తూ అమెరికాకు దడపుట్టిస్తోంది. తాజా లీక్‌లు ఎవరి పుణ్యమో ఇంకా తేలాల్సివుంది. సాధారణ పరిస్థితుల్లో ఇలాంటి లీక్‌లు పెద్దగా సమస్యలు సృష్టించవు. గతంలో అసాంజ్ బయటపెట్టిన పత్రాలు అంతక్రితం నాలుగైదేళ్లనాటివి. అవి గతించిన కాలానివి కనుక నిఘా బారిన పడిన దేశం చడీచప్పుడూ లేకుండా తన వ్యవస్థలో అవసరమైన మార్పులు చేసుకుంటుంది. ఆ పత్రాల్లో ప్రస్తావనకొచ్చిన ఉదంతాల తీవ్రత కూడా చల్లబడుతుంది. కానీ ఈ పత్రాలు ఇటీవల కాలానివి. కేవలం 40 రోజులనాటివి. ఉక్రెయిన్ ఇంకా రష్యాతో పోరు సాగిస్తూనే ఉంది. సైన్యం బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అది తీసుకుంటున్న దిద్దుబాటు చర్యలూ, అందుకోసం అనుసరిస్తున్న వ్యూహాలూ ఇంత వెనువెంటనే బట్టబయలు కావటం దాన్ని దెబ్బతీస్తాయనటంలో సందేహం లేదు. ముఖ్యంగా వైమానిక యుద్ధంలో ఉక్రెయిన్ బలహీనంగా ఉన్న వైనం బయటపడటం ఆ దేశానికి ముప్పు కలిగించేదే. అమెరికా నిఘా సంస్థ సీఐఏ పనితీరు కూడా ఈ పత్రాల ద్వారా బయటపడింది. రష్యా రక్షణ శాఖలోని ముఖ్యవ్యక్తుల ఫోన్ సంభాషణలు ఆ సంస్థ వేగులు వింటున్నారని, వారి మధ్య బట్వాటా అయ్యే సందేశాలు సంగ్రహిస్తున్నారని, వీటి ఆధారంగానే దాని రోజువారీ నివేదికలు రూపొందుతున్నాయని ఈ పత్రాలు తేటతెల్లం చేశాయి. అయితే ఉక్రెయిన్‌పై ఏడాదిగా సాగుతున్న యుద్ధంలో పెద్దగా పైచేయి సాధించలేకపోయిన రష్యాకూ ఈ లీక్‌లు తోడ్పడతాయి. ఉక్రెయిన్ విజయం సాధించటానికి దారితీస్తున్న పరిస్థితులేమిటో, ఇందులో తమ వైపు జరుగుతున్న లోపాలేమిటో తెలియటం వల్ల రష్యా తన వ్యూహాలను మార్చుకోవటం సులభమవుతుంది. అంతేకాదు...తన రక్షణ వ్యవస్థలోని ఏయే విభాగాల్లో అమెరికా నిఘా నేత్రాలు చొరబడ్డాయో ఈ లీక్‌లద్వారా గ్రహించి సొంతింటిని చక్కదిద్దుకునేందుకు రష్యాకు అవకాశం దొరికింది. అయితే అదే సమయంలో తల్చుకుంటే ప్రత్యర్థి శిబిరంలోకి అమెరికా ఎంత చురుగ్గా చొచ్చుకు పోగలదో, ఎలాంటి కీలక సమాచారం సేకరించగలదో ఈ వ్యవహారం తేటతెల్లం చేసింది. దాని సంగతెలావున్నా ఇజ్రాయెల్‌లో ప్రధాని నెతన్యాహూ తలపెట్టిన న్యాయసంస్కరణలకు వ్యతిరేకంగా పెల్లుబికిన ఉద్యమం వెనుక ఆ దేశ గూఢచార సంస్థ మొసాద్ హస్తమున్నదని అమెరికా అంచనా కొచ్చిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఈ అభిప్రాయం తప్పని ఇజ్రాయెల్ చెబుతున్నా నిజమేమిటో ముందుముందు బయటపడక తప్పదు.

కానీ నిఘాలో ఇంతటి చాకచక్యాన్ని ప్రదర్శించే అమెరికాను సైతం బోల్తా కొట్టించగల అరివీర భయంకరులున్నారని తాజా లీకులు చెప్పకనే చెబుతున్నాయి. ఇవి ఎక్కడినుంచో కాదు...సాక్షాత్తూ పెంటగాన్ కార్యాలయం నుంచే బయటికొచ్చాయని పత్రాల్లోని సమాచారం చూస్తే అర్థమవుతుంది. ఇతర దేశాలపై నిఘా మాట అటుంచి స్వగృహ ప్రక్షాళనకు నడుం కట్టకతప్పదని అమెరికాను తాజా లీకులు హెచ్చరిస్తున్నాయి. అభిప్రాయాలు, అంచనాలు ఏవైనా...మస్తిష్కంలో ఉన్నంత వరకే వాటికి రక్షణ. అవి రహస్యపత్రాలుగా అవతారమెత్తిన మరుక్షణం ఎక్కడెక్కడికి ఎగురుకుంటూ పోతాయో చెప్పటం అసాధ్యమని తాజా వ్యవహారం తేటతెల్లం చేస్తోంది. అగ్రరాజ్యం ఇప్పటికైనా అప్రమత్తంగా ఉండకతప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పంచమి ఉ.6.43 వరకు, తదుపరి షష్ఠి తె.4.46 వరకు (తెల్లవారితే బుధవారం), **నక్షత్రం:** జ్యేష్ఠ ప.12.25 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.8.04 నుండి 9.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.19 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.35 వరకు
అమృతఘడియలు: తె.5.09 నుండి 6.43 వరకు (తెల్లవారితే బుధవారం).

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

హక్కులకు ప్రమాదం!

ఒక నిషిద్ధ సంస్థలో కేవల సభ్యత్వం ఉన్నా సరే దాన్ని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–1967 కింద నేరంగా పరిగణించవచ్చని సుప్రీం కోర్టు బెంచ్ ఇచ్చిన తాజా తీర్పుతో మౌలిక న్యాయసూత్రాలకు విఘాతం కలిగినట్లయింది!


అభిప్రాయం



అశీష్ ఖేతాన్

ఇటీవల సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఒక నిషిద్ధ సంస్థలో కేవల సభ్యత్వం ఉన్నా సరే దాన్ని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం – 1967 కింద నేరంగా పరిగణించవచ్చని సారాంశం. అయితే నిర్దిష్ట సంస్థలో క్రియాశీల, నిష్క్రియాత్మక సభ్యత్వాల మధ్య వ్యత్యాసాన్ని ఈ తీర్పు పట్టించుకోలేదు! ఉగ్రవాదంపై పోరు, దేశ భద్రత పరి రక్షణ పేరుతో చట్టవ్యతిరేకంగా ఏజెన్సీలు పని చేయడాన్ని చట్టబద్ధం చేయడం అనే ప్రమాదం ఈ తీర్పులో దాగుంది. 2011నాటి అరూప్ భూయాన్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ అసోం హోమ్ డిపార్ట్‌మెంట్ కేసులో సుప్రీంకోర్టే ఇచ్చిన తీర్పుకు ఇది స్వీయ విఘాతం. నిషిద్ధ సంస్థలు తమ సభ్యుల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు, ఈమెయిల్‌తో కూడిన రిజిస్ట్రీని నిర్వహించవు. చట్టబద్ధ సంస్థ సభ్యత్వ రికార్డుల విషయంలో కూడా, ఒక సంస్థ నిషేధానికి గురైన తర్వాత ఆ సంస్థలో ఎవరు సభ్యులు, ఎవరు దాంట్లో కొనసాగుతారు అని ఏ సంస్థ అయినా లేదా న్యాయస్థానమైనా ఎలా నిర్ధారిస్తాయి? సంబంధం ఉన్నంత మాత్రాన అమాయకులైన యువతీ యువకులను చట్టవిరుద్ధ ఉగ్రవాద సంస్థల సభ్యులుగా ఎలా ఇరికిస్తారు అనే విషయాన్ని గతంలో జ్యోతి బాబా సాహెబ్ కోర్డే వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (2012) కేసు చక్కగా విశ్లేషించింది. ఈ కేసులో 15 మంది వ్యక్తులను (అందరూ గిరిజన యువతీయువకులే) ఉగ్రవాద సంస్థ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సభ్యులుగా ఆరోపించారు. పుస్తకాలు, ఆర్టికల్స్, పాంప్లెట్స్ వంటి మావోయిస్టు ప్రచార సాహిత్యాన్ని కలిగివుండటమే వీరు చేసిన నేరం. ఇది తప్ప, వీరు ఉగ్రవాద చర్యల్లో లేదా హింసాత్మక చర్యల్లో పాల్గొన్నారని కానీ, ఉగ్రవాద శిబిరాన్ని నిర్వహించారనికానీ, రిక్రూట్‌మెంట్ చేశారని గానీ, మావోయిస్టు కార్యకర్తలకు ఆశ్రయం ఇచ్చారని కానీ, ఉగ్రవాద చర్యల కోసం నిధులు సేకరించారని కానీ వీరిపై ఆరోపణలు లేవు. కానీ, ఉగ్రవాద సంస్థ సభ్యత్వం తీసుకోవడం అనేది నిర్బంధించదగిన శిక్షార్హమైన నేరం అవుతుందని, దీనిగ్గాను యావజ్జీవ శిక్షకూడా విధించొచ్చని బాంబే హైకోర్టు 'ఉపా' సెక్షన్ 20కి విస్తృతార్థం కల్పించింది.

2011లో అరూప్ భూయాన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు, ''హింసాత్మక చర్యలకు పాల్పడటం లేదా ప్రజలను హింసాత్మక చర్యలకు ప్రేరేపించడం లేదా అశాంతిని సృష్టించడానికి పూనుకోవడం చేస్తే తప్ప, నిషిద్ధ సంస్థలో కేవలం సభ్యత్వం ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తిపై నేరారోపణ చేయలేము''. సూచించడం, ప్రేరేపించడం మధ్య వ్యత్యాసం ఉందంటూ బ్రాండెన్‌బర్గ్ వర్సెస్ ఓహియో కేసులో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పుపై ఆనాడు భారత సుప్రీంకోర్టు ఆధారపడింది. ''కేవలం సభ్యత్వం ఉన్నంత మాత్రాన దాన్ని చట్టవిరుద్ధం అని చెప్పలేము. చట్టవ్యతిరేక కార్యాచరణకు స్పష్టంగా ప్రేరేపించినట్లయితేనే అది చట్టవిరుద్ధంగా మారుతుంద''ని అమెరికా ఫెడరల్ కోర్టు రనీఫ్ కేసులో తీర్పు చెప్పింది. సభ్యత్వం విషయంలో క్రియాశీలకంగా ఉండటానికి నిష్క్రియాత్మకంగా ఉండటానికి మధ్య వ్యత్యాసం ఉందంటూ స్కేల్స్ వర్సెస్ యునైటెడ్ స్టేట్స్ కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు ఇచ్చింది. నిషిద్ధ సంస్థతో సంబంధం ఉన్నంత మాత్రాన అపరాధం మోపడానికి నేరన్యాయ చట్టంలో తావులేదని ఎల్‌బ్రాండ్ట్ వర్సెస్ రస్సెల్ కేసులో కూడా అమెరికా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పులను నాడు భారత సుప్రీంకోర్టు ప్రస్తావించింది. కానీ తాజా తీర్పు భద్రత పేరుతో హక్కులకు విఘాతం కలిగించేలా ఉంది.



కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు 44 సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా, 13 సంస్థలను చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించింది. ఉగ్రవాదాన్ని, టెర్రరిస్టు చట్టాలను, ఉగ్రవాద బృందాలను నిర్వచించడంలో, అసంబద్ధంగా ఉగ్రవాదిగా ముద్రల పాలైన వారిని ఒక మేరకు కాపాడేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు పెనుగులాడుతున్నాయి. అదే సమయంలో ఉగ్రవాద నిరోధక సంస్థల అధికారాలను దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాల్సి ఉంది. వ్యక్తులపై తప్పుడు ముద్రలు వేయడం అనేది వాస్తవానికి ఉగ్రవాదంపై పోరాట యత్నాలను పలుచబారుస్తుంది. ఇది ప్రజాస్వామిక విలువలను, సంస్థలను అణగదొక్కుతుంది. ఉగ్రవాద, చట్టవ్యతిరేక కార్యాచరణను ఏది ఏర్పరుస్తుంది? ఉగ్రవాద, చట్టవ్యతిరేక బృంద సభ్యుడిగా ఏదీ నిర్ధారిస్తుంది అనే అంశాలపై ప్రతి ఉదార ప్రజాస్వామిక వ్యవస్థలో కచ్చితమైన న్యాయపరమైన వ్యాఖ్యలకు అనుగుణంగానే మునుపటి మూడు తీర్పులు ఉంటూ వస్తున్నాయి. ఉదాహరణకు, సామాజిక లేదా వృత్తిపరమైన పరస్పర ప్రతిచర్యల క్రమంలో ఉగ్రవాద బృందాల సంబంధంలోకి తెలియకుండా వచ్చిన వారిని మినహాయించడానికి ఇవి ప్రాధాన్యమిచ్చాయి. ఇక్కడ మాత్రం అనుమానితులు కాని పౌరులను ఉచ్చులో చిక్కుకునేలా చేయడానికి నిఘా సంస్థలకు సుప్రీం తన తాజా తీర్పులో సమర్థంగా లైసెన్సును మంజూరు చేసినట్లయింది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్
జిందాల్ గ్లోబల్ లా స్కూల్

పాశ్చాత్య ప్రభావంతో...

రాజ్యాంగ నిర్మాతల ఆశయం కొన్ని తీర్పులలో ప్రతిబింబించక పోవడమే కాక, కాలదోషం పట్టిన పాశ్చాత్య భావనలను ఇప్పుడు భారత న్యాయవ్యవస్థలో ప్రవేశపెట్టే ప్రయత్నం జరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

చట్టసభల, పరిపాలనా విభాగాల పని తీరును సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉన్నప్పటికీ ఆ అధికారానికి కూడా పరిధులున్నాయి. అలాగే న్యాయవ్యవస్థ పరిధిలో సమీక్ష అంటే చట్ట నిర్మాణ వ్యవస్థ మీద, లేదా పరిపాలనా వ్యవస్థ మీద న్యాయవ్యవస్థ పర్యవేక్షణ అని భాష్యం కాదు. అందుకే చట్టసభలు చేసిన ఒక విధానంతో కొందరు విభేదించి, దానిని కొట్టివేయవలసిందిగా కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఆ వ్యాజ్యాల విషయంలో కోర్టులు అప్రమత్తంగా వ్యవహరించడం అనివార్యం. అలాగే సంప్రదాయాలకి సంబంధించి విదేశీ కోర్టుల నిర్ణయాలను ఇక్కడి తీర్పులలో చొప్పించడం కూడా ఇటీవల చర్చకు దారి తీసింది. 'అరూప్ భూయాన్ వర్సెస్ అస్సాం రాష్ట్ర ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు గతంలో తాను ఇచ్చిన తీర్పును తానే తిరగ రాసుకుంది. మరొకటి ప్రస్తుతం సుప్రీంకోర్టు నిర్ణయం కోసం ఎదురు చూస్తున్న సేమ్ సెక్స్ మ్యారేజీ వ్యవహారం. ఈ వ్యవహారం మీద నిర్ణయం చేసేటప్పుడు భారతీయ కుటుంబ వ్యవస్థ శ్రేయస్సును, చరిత్రను దృష్టిలో ఉంచుకోవాలని సుప్రీం కోర్టుకు ఒక మాజీ న్యాయమూర్తి లేఖ రాశారు.



'అరూప్ భూయాన్ వర్సెస్ అస్సాం రాష్ట్ర ప్రభుత్వం', 'కేరళ ప్రభుత్వం వర్సెస్ రనీఫ్' కేసులలో కొత్త మలుపు నేపథ్యంలో దేవాలయాలకు సంబంధించిన వ్యాజ్యాలలో, అక్రమ సంబంధాలు, సేమ్‌సెక్స్ మ్యారేజీ అంశంలో న్యాయ వ్యవస్థ నిర్ణయాలపై పునరాలోచన అవసరమన్న అభిప్రాయం వినిపిస్తున్నది. అరూప్ భూయాన్, రనీఫ్ కేసులు, సేమ్ సెక్స్ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం వేర్వేరు వివాదాలే అయినా వాటికి ఒక అంతస్సూత్రం ఉంది. అది భారతీయ న్యాయ నిర్వాహణలో అమెరికనిజమ్ ప్రవేశం! అంటే అమెరికా న్యాయసూత్రాలను తీర్పులలో ప్రవేశ పెడుతున్నారన్న నిరసన ఉంది.

భూయాన్ కేసులోనే 2011లో సుప్రీం నిర్ణయం ప్రకారం ఒక నిషిద్ధ సంస్థలో సభ్యుడైనంత మాత్రానే అతడు నేరగాడు కాదు. అతడు హింసకు పాల్పడినట్టు, దేశ విచ్ఛిత్తికి పాల్పడినట్టు తెలియాలి. ఆ నిర్ణయంతో మావోయిస్టు పార్టీ సభ్యులే కాదు, పీఎఫ్ఐ వంటి సంస్థ సభ్యులు కూడా స్వేచ్ఛగా బయటకు వచ్చారు. 'ఉపా'లోని సెక్షన్ 10 (ఎ) (1)ని కొట్టేయడంతో ఇది సాధ్యమైంది. ఎలాంటి వారు విడుదల కావడానికి అది దోహదపడింది? ఐఎస్ ఐఎస్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణతో పాటు, భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసమే వచ్చాడని మీడియా కూడా ఆరోపించిన 27 ఏళ్ల అరీబ్ మాజీద్‌కు బెయిల్ దొరికింది. ఇతడిని ఉపా కింద అరెస్టు చేశారు. ఇతడి పన్నాగం వల్ల ఎవరూ చనిపోలేదని కోర్టు భావించింది. ప్రత్యేక కోర్టు ఇతడికి ఇచ్చిన బెయిల్‌ను బొంబాయి హైకోర్టు సమర్థించింది. ఉపా కింద అరెస్టయిన మరొక ఉగ్రవాది మహమ్మద్ రయా సుద్దీన్‌కు కూడా ఇదే విధంగా బొంబాయి హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే ఈ మార్చి 24న ఉపా మీద తన గత నిర్ణయాన్ని తానే అత్యున్నత న్యాయస్థానం తిరగ రాసుకుంది. అంటే కొట్టేసిన సెక్షన్‌కు చెల్లుబాటు కల్పించింది.

ఇది భారతీయమైన న్యాయ నిర్వహణకు ఊతమిచ్చే నిర్ణయమని పలువురు భావించారు. ఈ అంశం మీద సుప్రీంకోర్టు విచారించినప్పుడు ప్రభుత్వ న్యాయవాది తుషార్ మెహతా పలు అంశాలను కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 నాటి నిర్ణయం వెలువరించిన ధర్మాసనం తీవ్ర తప్పిదానికి పాల్పడిందని మెహతా చెప్పారు. భారత రాజ్యాంగ చట్టాల పరిధిని గమనంలోకి తీసుకోకుండా అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అన్వయించారని తెలియచేశారు. ఈ పరిణామం ఇతర కేసులలో తీవ్ర గందరగోళానికి దారి తీసింది. వ్యక్తిగత గోప్యత, సేమ్‌సెక్స్ వివాహం, హిందూ ఆలయాల సంప్రదాయాలపై ఇచ్చిన తీర్పులలో ఆ గందరగోళం కనిపిస్తుందన్న అభిప్రాయం ఉంది.

భారత రాజ్యాంగం తొలి వాక్యమే 'భారతీయులమైన మేము..'. అలాంటిది ఇక్కడి కేసులలో తీర్పులకు అమెరికనిజాన్ని అంటగట్టడం ఎంత చేటు చేసే విషయమో చాలామందికి అర్థమైంది. స్వేచ్ఛ అనే అంశంలో అక్కడికీ ఇక్కడికీ ఉన్న వైరుధ్యం కూడా తెలిసి వచ్చింది. అందుకే అమెరికా లేదా యూరప్‌లకు చెందిన న్యాయ సూత్రాలను భారతీయ న్యాయవ్యవస్థ నుంచి పరిహరించే ప్రయత్నం స్వాగతించదగినదేనని నిపుణులు చెబుతున్నారు. సేమ్ సెక్స్ మ్యారేజీ గురించిన నిర్ణయం సుప్రీంకోర్టు వెలువరించవలసి ఉంది. ఈ నేపథ్యంలోనే జస్టిస్ ఎస్ఎన్ ధింగ్రా ఒక విన్నపం చేశారు. భారతీయ కుటుంబ వ్యవస్థ, సంస్కృతులను దృష్టిలో ఉంచుకొని దాని మీద నిర్ణయం తీసుకోవాలని కోరారు. వీటిని అనుమతించిన పాశ్చాత్య దేశాలు ఇప్పుడు అందుకు మూల్యాన్ని చెల్లిస్తున్నాయి. అయినా భారతీయ వ్యవస్థలోను ఆ రకమైన వివాహాలను అనుమతించాలని కోరడం వ్యవస్థ స్వరూపాన్ని, విలువలను ధిక్కరించడమే కదా!

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్' వ్యవస్థాపకులు | pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంచనాల గెలుపు



కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మెజారిటీ మార్కును కూడా దాటి 4 శాతం మొగ్గుతో గెలవనున్న కాంగ్రెస్.. బీజేపీ, జేడీఎస్‌లను చెరో రెండు శాతం చొప్పున సమానంగా ప్రతికూలతలోకి నెట్టడం ద్వారా ఆ నాలుగు శాతాన్ని సాధిస్తుంది.

– సంజయ్ కుమార్, పొలిటికల్ ఎనలిస్ట్

అంతర్గత పాలన



కశ్మీర్ నియంత్రణ రేఖ ఒప్పందంపై చర్చలను పునః ప్రారంభించేందుకు 2017లో మోదీ తన రహస్య దూతను నవాజ్ షరీఫ్ చెంతకు పంపినట్లు ఈ వారం విడుదల కానున్న 'ది పర్స్యూట్ ఆఫ్ పీస్ : ఇండియా – పాకిస్తాన్ రిలేషన్స్ అండర్ సిక్స్ ప్రైమ్ మినిస్టర్స్' వెల్లడించనుంది! (గ్రంథకర్త : దివంగత సతీందర్ లంబా). ఈ యత్నాన్ని ఎన్.ఎస్.ఎ. అజిత్ దోవల్ నిర్ధరించినట్లు కూడా ఆ పుస్తకం పేర్కొంది.

– సుహాసినీ హైదర్, దౌత్య వ్యవహారాల ఎనలిస్ట్

ఇవి కలపండి



వేసవికి ఉత్తమమైన పానీయం.. కొత్తిమీర, కరివేపాకు, అల్లం.. వీటితో పాటు చిలకరింతగా కాస్తంత కాస్త ఇంగువ, కల్లు ఉప్పు కలిపిన తాజా మజ్జిగ! ఉష్ణ తాపాన్ని తక్షణం తీర్చడంలో ఈ ద్రవాహారం తర్వాతే ఏదైనా!

– డా॥ దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

వికృత పోకడలు!



లండన్ వెళ్లవలసిన ఎయిర్ ఇండియా ఎ.ఐ. 111 విమానం, బయలుదేరిన కొద్ది సేపటికే ఒక ప్రయాణికుడి హింసాత్మక ధోరణి కారణంగా తిరిగి ఢిల్లీలో ల్యాండ్ అయింది! క్యాబిన్ సిబ్బందిపై చెయ్యి చేసుకున్న అతడిని ఏకంగా విమాన ప్రయాణాల నుంచే నిషేధించాలి.

– విష్ణు సోమ్, న్యూస్ యాంకర్

పరుగెత్తి పాలు



కర్ణాటకలోకి అమూల్‌ను తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నంతో కాంగ్రెస్ నేత డి.కె. శివకుమార్ రాష్ట్రవాళీ 'నందిని మిల్క్' పార్లర్‌ను సందర్శించారు! ఎన్నికల వేళ అక్కడ పాల రాజకీయాలూ షురూ!

– శాంతన్, గాంధేయవాది

ఇన్‌బాక్స్

సిక్కోలు ఉద్యమ ధీరుడు

శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాట నిర్మాతలలో పైలా వాసుదేవరావు ఒకరు. 1950 నుండి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీతో ఆయన ఉద్యమ ప్రయాణం సాగింది. సిక్కోలు పోరాటం 1968 నవంబర్ 25న ప్రారంభమైంది. కాలినడకన అనేక గ్రామాలు తిరుగుతూ టెక్కలి ప్రాంత ఆర్గనైజర్‌గా పనిచేశారు. వ్యవసాయ కూలీ రేట్ల కోసం, బంజరు భూములు, పోరంబోకు భూములు, దేవాదాయ భూములు వంటివాటిని పేదలకు పంచడం కోసం ఉద్యమాలు చేశారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరల కోసం అనేక ఉద్యమాలు నడిపారు.

గిట్టుబాటు ధరల కోసం, కూలీ రేట్ల కోసం సుబ్బారావు పాణిగ్రాహి నాయకత్వంలో గరుడభద్ర ప్రాంతంలో మహిళలు ప్రదర్శనగా వెళ్ళినప్పుడు భూస్వామి మజ్జి కామేష్ గూండాలు ఆనాడు పంచాది నిర్మల జాకెట్టు చింపివేసి, సుబ్బారావు పాణిగ్రాహిపై దాడి చేశారు. ఈ చర్య జరిగిన వెంటనే పార్టీ సమావేశం జరిపి మద్ది కామేష్ పంట కోతకు పిలుపునిచ్చింది. దీంతో శ్రీకాకుళ పోరాటం ప్రారంభమయ్యింది. ఈ పంట కోత జరిగిన తదుపరి రాజాం, బొడ్డపాడు, మామిడిపల్లి, మర్రిపాడు గ్రామాల్లో 144 సెక్షన్ పెట్టి పోలీసులు గ్రామాల్లో కొచ్చి 168 మందిపై కేసులు పెట్టారు. దీంతో పైలాతో సహా పార్టీ ముఖ్యులందరూ రహస్య జీవితంలోకి వెళ్లిపోయారు. ఉద్యమం ఉధృతం అవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్ కాన్సన్ట్రేషన్ క్యాంపులు పెట్టారు. గ్రామాలను వల్లకాడులుగా మార్చారు. పార్వతీపురం ఏజెన్సీ వైపు గ్రామాలకు గ్రామాలే తగలబెట్టారు. 360 మంది కామ్రేడ్స్‌ను 1971 నాటికి బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపారు. ఈ పరిస్థితుల్లో అనేక కష్టనష్టాలకు ఓర్చి, పైలా మళ్లీ పార్టీని పునర్నిర్మించి రాష్ట్రకమిటీని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఆయన చారు మజుందార్‌తో విభేదించి, సీపీఐ ఎంఎల్‌లో తన పార్టీని విలీనం చేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో చంద్ర, తరిమెల నాగిరెడ్డి వంటి అగ్ర నాయకులతో చర్చలు జరిపారు. ఫలితంగా సీపీ, పైలా పార్టీలు విలీనమయ్యాయి.



పైలా వాసుదేవరావు

42 సంవత్సరాలు అజ్ఞాతవాసంలో ఉండి అంతిమ శ్వాస వరకు పీడిత ప్రజలకు అండగా నిలబడ్డ పైలా జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం.

– వంకల మాధవరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి
(నేడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు వర్ధంతి)

సమ సమాజ స్వాప్నికుడు


అభిప్రాయం



డా॥ తిరునాహరి శేషు

అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మా జ్యోతిబా గోవిందరావు పూలే. మహారాష్ట్రలోని సతారాలో వెనుకబడిన వర్గాలకు చెందిన 'మాలి' (పూల దండలు కట్టే) కులంలో 1827 ఏప్రిల్ 11న జన్మించారు. బుద్ధుడి బోధనలు, కబీర్ రచనలు, అబ్రహం లింకన్ భావజాలం పూలేని ప్రభావితం చేశాయి. దీంతో వర్ణాశమ ధర్మం బలంగా వేళ్లూనుకొని ఉన్న భారతదేశ సామాజిక వ్యవస్థ గోడలను బద్దలు కొట్టడానికి ఉద్యమ బావుటా ఎగరేశారు. థామస్ పెయిన్ రాసిన 'ది రైట్స్ ఆఫ్ మ్యాన్' పుస్తకం చదివిన ప్రభావం, ఓ బ్రాహ్మణ మిత్రుడి వివాహ వేడుక సందర్భంగా ఎదురైన అవమానాలు పూలేని నిమ్న జాతుల హక్కులు, కుల వ్యవస్థ నిర్మూలన వంటి వాటి కోసం ఉద్యమించేలా చేశాయి.

1848 నుండి 1890 వరకు మరణించే దాకా... నిమ్న వర్గాల హక్కుల కోసం, స్త్రీల సాధికారత కోసం, రైతుల కోసం చేసిన ఉద్యమాలు పూలేని 'మహాత్ము'నిగా నిలబెట్టాయి. సమాజంలోని అన్ని అనర్థాలకూ మూలం విద్య లేకపోవటమే అని బలంగా నమ్మిన పూలే... అప్పటివరకు విద్యకు దూరంగా నెట్టివేయబడిన స్త్రీల కోసం 1848లో పూనా బిడేవాడలో మొట్టమొదటి బాలికల పాఠశాల స్థాపించారు. 1852లో అంటరాని కులాల కోసం మరొక పాఠశాలను ఏర్పాటు చేశారు. అది మొదలు పీడిత వర్గాలలో విద్యా వ్యాప్తి కోసం అనేక పాఠశాలలను పూలే దంపతులు ఏర్పాటు చేశారు. దీంతో సంప్రదాయవాదులు పూలే తండ్రి గోవిందరావుపై ఒత్తిడి తెచ్చి... పూలేను గృహ బహిష్కరణ చేయించారు. అయినా ఆయన వెనక్కి తగ్గలేదు. భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి మొక్కవోని దీక్షతో సమాజ ఉద్ధరణకు మునుముందుకే సాగారు.



స్త్రీ విద్యతోపాటూ, వితంతు పునర్వివాహాలు జరిపించి వారికి ఆశ్రయం ఇచ్చే ఏర్పాటూ చేశారు. వితంతువుల పిల్లలను, ఇతర అవాంఛిత గర్భందాల్చిన స్త్రీల పిల్లలను చేరదీసి వారిని కన్నబిడ్డల్లాగా చూసుకున్నారు. ఒక బ్రాహ్మణ వితంతువుకు జన్మించిన పిల్లవాడిని దత్తత తీసుకుని పెంచి ప్రయోజకుడిగా తీర్చిదిద్దారు. బాల్య వివాహాలకు, మద్యానికి వ్యతిరేకంగా పని చేశారు. రైతులను దోపిడీ చేస్తున్న కులకర్ణిలూ, దేశ్‌ముఖ్‌లూ, పట్టేళ్లకు వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటాలు రైతులకూ మేలు చేశాయి. సామాజిక సమస్యల పరిష్కారం కోసం సామాజిక విప్లవ సంస్థ అయిన 'సత్య శోధక్ సమాజ్'ని 1873లో ఏర్పాటు చేయటం పూలే సామాజిక ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు.

సత్యాన్ని అన్వేషణ చేయడం, సామాజిక ఉద్యమాలను వ్యాప్తి చేయటానికి మార్గాలను వెతకటం, అందరికీ సమాన హక్కుల సాధన వంటి లక్ష్యాలతో సత్యశోధక్ సమాజ్ పని చేసింది. రైతు ఉద్యమాల వ్యాప్తి కోసం 'దీనబంధు', 'దీన మిత్ర' అనే పత్రికలు కూడా సత్య శోధక్ సమాజ్ ఆధ్వర్యంలోనే నడిచాయి. 1873లో పూలే రాసిన 'గులాంగిరీ' సామాజిక ఉద్యమాలకు దిశా నిర్దేశం చేసిందనే చెప్పాలి.

'అగ్రకులాలకు కింది కులాలు బానిసలు కావు' అనేది గులాంగిరీ చేసిన బోధన. 'తృతీయ రత్న' నాటకం, 'రైతు చేతిలో కొరడా' గ్రంథంతోపాటు పూలే చేసిన అనేక రచనలు సామాజిక మార్పులకు దోహదపడ్డాయి. ఆ విధంగా దేశంలో సమ సమాజ నిర్మాణానికి పూలే ప్రధాన భూమిక పోషించారు.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ వర్సిటీ | 98854 65877
(నేడు జ్యోతిబా పూలే జయంతి)

ధర్మ స్నానం

శరీరంపై ధూళి పేరుకున్నప్పుడు, చెమట పట్టి మలినంగా ఉన్నప్పుడు మన శరీరం మనకే మోయలేని భారం అనిపిస్తుంది. ఇటువంటి స్థితిలో శరీరానికి ఎక్కడ లేని హాయినిస్తుంది స్నానం. శరీర బరువును దించేస్తుంది. తల భారాన్ని తలస్నానం వదిలించేస్తుంది. అంటే... శుభ్రత, శుద్ధి అనేవి మనల్ని తేలికపరుస్తాయి. భారాన్ని దించి హాయినిస్తాయి. అందుకే... 'స్నాత్యనేన ఇతి స్నానం' అంటారు. అంటే... దేనివల్ల శుచిగా మారి శుద్ధి అవుతుందో అది స్నానం.

ఈ శుద్ధి మనిషికి కేవలం శరీరానికే కాదు. మనస్సుకి కూడా అవసరం. మానసిక మలినాల్ని తొలగించి, మనస్సును శుద్ధి చేసే మాటల్ని సుభాషితాలు అంటాం. మనిషి ఆలోచనల్లో మలినాలు ఉంటే అవి మనిషికి పెను భారం అవుతాయి. మలిన యోచన వల్ల మలిన కర్మలకు మనుషులు పూనుకుంటారు. వాటివల్ల అపఖ్యాతి కలుగుతుంది. అది దుఃఖాన్ని తెచ్చిపెడుతుంది. మంచి మాటలు వినడం, మంచి సాహిత్యం చదవడం, ధార్మిక గ్రంథ పఠనం మనస్సును తేటపరిచే స్నానఘట్టాలు. వాటిలో తలార మునిగితే మనో మలినాలు తొలగిపోతాయి. బుద్ధుని ప్రబోధాలన్నీ మనస్సుని శుద్ధి పరిచేవే!



నందకుడు ఒక గణానికి రాజు. ఒకసారి బుద్ధుడు వైశాలి దగ్గరి మహావనంలో ధర్మ ప్రసంగం చేస్తున్నాడు. ఆ ప్రబోధాన్ని నందకుడు శ్రద్ధగా వింటున్నాడు. ఆ రోజు శీలం గురించి, మనోశుద్ధి గురించి బుద్ధుడు చెప్తున్నాడు. నందకుడు వింటూ, తనను తాను దర్శించుకుంటూ అందులో లీనమైపోయాడు. కాసేపటికి ఒక పరిచారికుడు వచ్చి వంగి, చెవి దగ్గరలో మెల్లగా.. 'రాజా! తమ స్నానానికి వేళయ్యింది. వేన్నీళ్ళు సిద్ధం చేశాము' అన్నాడు.

'సేవకా! చాలు చాలు. ఇప్పుడు నన్ను పిలవకు. నేనిప్పుడు అదే పనిలో ఉన్నాను. భగవానుని ప్రవచనాలు వింటూ నా మనస్సును శుద్ధి చేసుకుంటున్నాను. ధర్మ స్నానం చేస్తున్నాను. నీవు చెప్పే బాహ్య స్నానం కంటే ఇదెంతో మేలైంది. ఆరోగ్యకరమయింది. నా మనస్సు మలినాల బరువు దించుకుని తేలిక పడుతోంది. ఇక నీవు వెళ్ళు' అని పంపివేశాడు. ప్రతి రోజూ కలత నిదురతో కలత చెందే రాజు, ఎన్నో ఏళ్ళ తర్వాత... ఆ రోజు రాత్రి కంటి నిండా నిద్రపోయాడు.

– బొర్రా గోవర్ధన్

క్లుప్తంగా...

సైన్స్ పరీక్ష రాసిన విద్యార్థి హరీశ్


తండ్రితో హరీశ్

కమలాపూర్: హిందీ ప్రశ్నపత్రం లీక్ ఘటనలో డీబార్‌ై హైకోర్టు ఉత్తర్వులతో మిగిలిన పరీక్షలు రాసేందుకు అనుమతి పొందిన విద్యార్థి దండబోయిన హరీశ్ సోమవారం సైన్స్ పరీక్ష రాశాడు. ఈ నెల 4న పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో హరీశ్‌ను అధికారులు ఐదేళ్ల పాటు డీబార్ చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్.. హరీశ్ తరఫున హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో హరీశ్ మిగతా పరీక్షలు రాసేందుకు అనుమతిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులతో తన తండ్రి రాజుతో కలిసి సోమవారం కమలాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి హరీశ్ చేరుకున్నాడు. సంబంధిత అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు అప్పటికే అందడంతో విద్యార్థిని పరీక్షకు అనుమతించారు.

విచారణ లేకుండానే తీర్పు ఎలా?: కోదండరాం

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ఇద్దరు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ వారిపై చర్యలు తీసుకుని, మిగతా వారికి క్లీన్‌చిట్ ఇచ్చారని.. ఇదంతా విచారణ జరగకుండానే ఎలా చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన అఖిలపక్ష పార్టీల నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. గత నెల 11న ప్రశ్నపత్రాల లీకేజీ విషయం బయటకు రాగా.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం సిట్‌ను నియమించినా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఎవరికీ లేదని పేర్కొన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్లు వస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం, పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో ఒక్కరోజులోనే బాధ్యులను అరెస్ట్ చేసిందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల ఫోన్లతో పాటు మంచి మార్కుల వచ్చిన వారి కాల్‌డేటా ఆధారంగా విచారణ చేస్తే అసలు విషయం బయట పడుతుందని కోదండరాం పేర్కొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ వృద్ధురాలిపై లైంగిక దాడి

సూర్యాపేట క్రైం: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఇస్తాళ్లాపురం గ్రామంలో ఇటీవల వెలుగుచూసిన ఒంటరి వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన నిమ్మల ఉమాదేవి అలియాస్ ఉమమ్మ(65) ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అదే ఊరిలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న కప్పల విజయ్ ఈ నెల 8వ తేదీ రాత్రి తన మిత్రుడైన బోరింగుతండాకు చెందిన గుగులోతు కలేందర్‌తో పూటుగా మద్యం సేవించాడు. అనంతరం సుమారు 11 గంటల సమయంలో కలేందర్‌ను కాపలాగా పెట్టి ఒంటరిగా ఉంటున్న ఉమాదేవి ఇంట్లోకి విజయ్ చొరబడ్డాడు. పడుకొని ఉన్న ఉమాదేవిపై దాడి చేశాడు. మూతిపై పిడిగుద్దులు గుద్ది, ఆమె అరవకుండా నోట్లో దూది కుక్కాడు. ఆపై సెల్ఫీ వీడియో తీసుకుంటూ లైంగికదాడి చేశాడు. నోట్లో దూది కుక్కి ఘాతుకానికి ఒడిగట్టడంతో ఆమె ఊపిరి ఆడక ప్రాణాలు విడిచింది. అనంతరం విజయ్ ఆమె సూట్ కేసులో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు దోపిడీ చేశాడు.

బైక్, బట్టలు కొని.. ఎంజాయ్ చేస్తూ..

మరుసటి రోజు విజయ్ దోపిడీ చేసిన ఆభరణాలను జిల్లా కేంద్రంలోని ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టగా రూ.1.90లక్షలు వచ్చాయి. అందులోని కొంత డబ్బుతో బైక్, దుస్తులు కొనుగోలు చేసి స్నేహితులకు పార్టీ ఇచ్చి ఎంజాయ్ చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 8వ తేదీ రాత్రి ఉమాదేవి ఇంటి వద్ద ఎవరి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉన్నాయో ఆరా తీశారు. అదే గ్రామానికి చెందిన విజయ్, కలేందర్ ఫోన్ల సిగ్నల్స్ గుర్తించారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసు కుని విచారించగా నేరం అంగీకరించారని ఎస్పీ వివరించారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, రూ.1.40లక్షల నగదు, బంగారం తాకట్టు పెట్టిన రసీదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హత్య చేసిన వ్యక్తికి ముందస్తు బెయిలా?

దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్ట వ్యతిరేకం

- వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?
- సీసీ కెమెరా ఫుటేజీని, పోలీసులు సేకరించిన మెటీరియల్‌ను ఎందుకు పరిశీలించలేదు?
- కడప కోర్టు సుప్రీంకోర్టు ఉత్తర్వులను పాటించకుండా తీర్పు ఇచ్చింది
- తాము చెప్పినట్లు వింటున్నందుకే దస్తగిరికి అనుకూలంగా సీబీఐ కౌంటర్
- కడప కోర్టు దస్తగిరికి ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను కొట్టివేయాలి
- తెలంగాణ హైకోర్టులో వివేకా పీఏ కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు
- మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు దస్తగిరిని సీబీఐ అప్రూవర్‌గా ప్రకటించడం, అతడికి కడప కోర్టు బెయిల్ ఇవ్వడం చట్టవ్యతిరేకమని వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పట్టించుకోకుండా కడప కోర్టు దస్తగిరికి అనుకూలంగా ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దస్తగిరిని అప్రూవర్‌గా పేర్కొంటూ.. అతడికి బెయిల్ ఇస్తూ సీబీఐ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు కొట్టివేయాలంటూ ఎంవీ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అభ్యర్థనతో వైఎస్ భాస్కర్‌రెడ్డి కూడా మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్‌లపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న ఆయన తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. కాగా వైఎస్ భాస్కర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున మరో సీనియర్ న్యాయవాది నాగేందర్ కోర్టుకు హాజరయ్యారు.

చంపడానికి గొడ్డలి కొనుగోలు చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడు..: ఈ సందర్భంగా వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది దేశాయి ప్రకాష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హత్యకు సంబంధించి వివేకా వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను, సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో ఫుటేజీని, పోలీసులు సేకరించిన మెటీరియల్‌ను సీబీఐ పరిశీలించలేదన్నారు. ''వివేకాను హత్య చేయడానికి నగదు తీసుకున్నానని, చంపడం కోసం గొడ్డలి కూడా కొనుగోలు చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడు. అలాంటి హంతకుడిని కనీసం కస్టడీలోకి తీసుకుని విచారించకుండానే క్షమించడం చట్టవిరుద్ధం. వివేకాతో దస్తగిరే బలవంతంగా లేఖ రాయించినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. విచారణలో సీబీఐ చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో సీబీఐ కూడా అతడికి ముందస్తు బెయిల్ ఇప్పించేందుకు, అప్రూవర్‌గా ప్రకటించేందుకు పూర్తిగా సహకరించింది. అతడు ఇచ్చిన వాంగ్మూలానికి ఎలాంటి ఆధారాలు లేకున్నా.. తొలుత నలుగురు ఉన్న నిందితుల జాబితాకు మరికొందరిని చేర్చింది. హత్య కేసులో వారిని బలవంతంగా ఇరికించే ప్రయత్నం చేస్తోంది. ప్రధాన నిందితుడు దస్తగిరికి బెయిల్ ఇప్పించడం, అప్రూవర్‌గా ప్రకటించడంపై సరికాదని సీబీఐ అధికారులకు కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సీబీఐ తప్పుడు పద్ధతుల్లో దర్యాప్తు చేస్తుండటంతో కృష్ణారెడ్డి పులివెందుల జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ కూడా దాఖలు చేశారు'' అని ప్రకాష్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపించారు.

రంగన్న స్టేట్‌మెంట్‌ను తొక్కిపెట్టి..

'సీఆర్‌పీసీ సెక్షన్లు 161, 164 కింద వివేకా వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను సీబీఐ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు అతడికి వినిపించాయి. దీంతో పార్క్ వైపు ఉన్న తలుపు వద్దకు వెళ్లి.. పక్కనే ఉన్న కిటికీలోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నాడు. దీంతో భయపడ్డ రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ దగ్గర తలుపు తీసుకుని సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్, గంగిరెడ్డి హడావుడిగా బయటికి వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. వారిని రంగన్న స్పష్టంగా చూశాడు. రంగన్న చీకట్లో ఉండటంతో వారు అతడిని గుర్తించలేదు. వారందరూ వెళ్లిపోయాక రంగన్న లోపలికి వెళ్లాడు. ఇల్లంతా చూసినా వివేకా కనిపించకపోవడంతో బాత్రూమ్‌కి వెళ్లి చూడగా రక్తపు మడుగులో వివేకా పడి ఉన్నారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాలు కూడా రంగన్న చెప్పిన వివరాలకు సరిపోయాయి. ఈ ఆధారాలతోనే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు. నిందితులు హత్య సమయంలో వివేకా ఇంటి వద్దే ఉన్నట్లు గూగుల్ లొకేషన్ ద్వారా కూడా తెలిసింది. ఇన్ని ఆధారాలు ఉన్నా వాటిని తొక్కిపెట్టి సీబీఐ విచారణ సాగిస్తోంది. ఇంతవరకు దస్తగిరిని అరెస్టు చేయలేదు.. కస్టడీలోకి తీసుకోలేదు. కాబట్టి కడప కోర్టు దస్తగిరికి బెయిల్ ఇస్తూ, అప్రూవర్‌గా ప్రకటిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి' అని ప్రకాష్ రెడ్డి కోరారు.

గంటసేపు ఈటల విచారణ

- టెన్త్ ప్రశ్నపత్రం లీక్ కేసులో పోలీసుల ముందు హాజరు
- 9.30కు పరీక్ష మొదలై.. 11 గంటలకు పేపర్ బయటికొస్తే లీకేజీ ఎలా అవుతుందని ఈటల ప్రశ్న


ఈటలను భుజాలపై ఎత్తుకున్న కార్యకర్తలు

వరంగల్ క్రైం: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సోమవారం వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 12.30కు బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదులతో కలిసి కమిషనరేట్‌లోకి వెళ్లిన ఈటల.. గంట తర్వాత బయటికి వచ్చారు. సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ చాంబర్‌లో ఈటల రాజేందర్‌ను పోలీసు అధికారులు ప్రశ్నించారు. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నిందితులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? నిందితుల నుంచి వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నపత్రాలను ఏం చేశారు? అనే అంశాలపై వారు ఆరా తీసినట్టు తెలిసింది. ఫోన్ ఇవ్వాలని వారు ఈటలను కోరగా ఆయన ఇవ్వలేదని తెలిసింది. కానీ ఈటల పీఏ చైతన్య ఆ ఫోన్‌ను ఓపెన్ చేసి అధికారులకు చూపించినట్టు సమాచారం. నిందితుడు మహేశ్ పంపించిన పేపర్‌కు సంబంధించిన మెసేజీను ఓపెన్ చేయడంగానీ, డౌన్‌లోడ్ చేయడంగానీ జరగలేదని వివరించినట్టు తెలిసింది. దీంతో వాట్సాప్ ఎందుకు ఓపెన్ చేయలేదని పోలీసులు ప్రశ్నించగా.. 'నేను పెద్దగా వాట్సాప్‌ను ఆపరేట్ చేయను. ఫోన్ నా పీఏ దగ్గరే ఉంటుంది. ఏదైనా అతి ముఖ్యమైన మెసేజీలు ఉంటేనే నేను చూస్తా..''అని ఈటల రాజేందర్ వివరించినట్టు సమాచారం. కాగా, ఈటల రాజేందర్ సుమారు 100కు పైగా వాహనాల భారీ కాన్వాయ్‌తో పోలీస్ కమిషనరేట్‌కు వచ్చారు. విచారణకు హాజరై బయటికి వచ్చిన తర్వాత అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఈటల రాజేందర్‌ను భుజాలపై ఎత్తుకుని నినాదాలు చేశారు.

టీఎస్‌పీఎస్సీ, లిక్కర్ కేసుల డైవర్షన్ కోసమే..: ఈటల

లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలను అడియాసలు చేసిన టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్, కవిత లిక్కర్ స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే.. కావాలని పదో తరగతి పేపర్ లీక్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. పోలీసుల విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''పదో తరగతి పరీక్ష ఉదయం 9.30 గంటలకే ప్రారంభమై.. పేపర్ ఉదయం 11 గంటల తర్వాత బయటికొస్తే అది లీక్ అయిందని అనడం ఏమిటి? అది ఆ పరీక్ష కేంద్రాల్లో జరిగే మాల్ ప్రాక్టీస్ అవుతుంది. బీజేపీ నాయకులు ప్రజల్లో తిరుగుతున్నారు. ప్రజలను ఏకం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోతుందనే భయంతోనే సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో కూర్చుని అక్రమ కేసులు పెడుతున్నారు..''అని ఈటల ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ దోషిగా నిలబడిందన్నారు. దేశంలో ధనికుడైన సీఎం కేసీఆరేనని అన్నారు.

కస్టడీ, బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

వరంగల్ లీగల్: పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ, కాపీ కేసులో నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లు, ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పోలీస్ కస్టడీ పిటిషన్లపై సోమవారం ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. తీర్పు మంగళవారానికి వాయిదా వేస్తూ 4వ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి, రైల్వేకోర్టు జడ్జి ఆరిఫ్ ఆదేశాలు జారీ చేశారు.

ఆప్.. ఇక జాతీయ పార్టీ

▶ మొదటి పేజీ తరువాయి

హోదా ఇస్తున్నట్టు వెల్లడించింది. సంబంధిత పార్టీల ప్రతినిధులతో సంప్రదింపులు, సమీక్షల తర్వాతే ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు వివరించింది.

ప్రస్తుతం జాతీయ పార్టీలు ఆరు

ఎన్నికల సంఘం తాజా చర్యల మేరకు ప్రస్తుతం దేశంలో ఆరు పార్టీలకు జాతీయ హోదా ఉన్నట్టయింది. బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ), నేషనల్ పీపుల్స్ పార్టీ,ఆమ్ ఆద్మీ పార్టీ ఈ జాబితాలో ఉన్నాయి.

● జాతీయ హోదా పొందిన ఆప్‌ను అరవింద్ కేజ్రీవాల్ 2012లో స్థాపించారు. 2015, 2020లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో, 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. అతి తక్కువ సమయంలోనే తమ పార్టీకి జాతీయ హోదా దక్కడం పట్ల కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ● 1925లో ఏర్పాటైన సీపీఐ 1989లో జాతీయ పార్టీగా గుర్తింపు పొందింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతినడం, దేశవ్యాప్తంగా కూడా తగిన సంఖ్యలో లోక్‌సభ సీట్లను సాధించలేకపోవడంతో జాతీయ హోదాను కోల్పోయింది. ● జాతీయ హోదా కోల్పోయిన టీఎంసీని 1998లో మమతా బెనర్జీ స్థాపించారు. టీఎంసీ 2004లో రాష్ట్ర పార్టీ హోదా పొందింది. తర్వాత అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురకూ విస్తరించగా.. 2016లో జాతీయ పార్టీ హోదా వచ్చింది. కానీ తర్వాత పెద్దగా ప్రభావం చూపకపోవడంతో హోదా కోల్పోవాల్సి వచ్చింది. ● శరద్‌పవార్ 1999లో కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి ఎన్సీపీని స్థాపించారు. వివిధ ఎన్నికల్లో విజయం సాధించడంతో 2000 సంవత్సరంలో జాతీయ హోదా లభించింది.

పోటీ చేయకపోవడంతో బీఆర్ఎస్‌కు హోదా రద్దు

తెలంగాణ ఏర్పాటు నినాదంతో 2001లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) ఏర్పాటైంది. 2004 సాధారణ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసింది. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న నేపథ్యంలో.. రాష్ట పార్టీ హోదా కోసం తెలంగాణతో పాటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ 16 చోట్ల బరిలోకి దిగింది. తెలంగాణలో ఐదు లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతోపాటు ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాల్లో ఒక శాతం ఓట్లు సాధించింది. ఈ నేపథ్యంలో 2004 ఎన్నికల తర్వాత రాష్ట్ర పార్టీ హోదా దక్కింది. 2009 సాధారణ ఎన్నికలతోపాటు తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన ఏ ఇతర ఎన్నికల్లోనూ ఏపీలో బీఆర్ఎస్ పోటీ చేయలేదు. అయినా ఉమ్మడి రాష్ట్రంనాటి రాష్ట్ర హోదా గుర్తింపు.. విభజన తర్వాత కూడా ఏపీలో కొనసాగింది. ప్రస్తుతం ఎన్నికల సంఘం సమీక్షలో ఆ హోదాను కోల్పోయింది.

జాతీయ హోదా రద్దు విచారకరం: సీపీఐకి జాతీయ హోదాను రద్దు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడాన్ని ఆ పార్టీ నేతలు తప్పుపట్టారు. దీనిపై అప్పీలుకు వెళతామని ప్రకటించారు. త్వరలో జాతీయ హోదా పునరుద్ధరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వందేళ్ల చరిత్ర ఉన్న సీపీఐ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నదని, ఈసీ నిర్ణయం విచారకరమని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. ఇక సీపీఐకి జాతీ య హోదా రద్దు, ఆప్‌కు హోదా ఇవ్వడంలో రాజకీయ కుట్ర కోణం దాగి ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకే ఆప్‌కు జాతీయ పార్టీ హోదా కట్టబెట్టారని ఆరోపించారు.

భార్య మీద కోపంతో కూతుళ్లపై విష ప్రయోగం

- పెద్ద కుమార్తె మృతి.. మరో కుమార్తె పరిస్థితి విషమం
- జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో దారుణం

పాలకుర్తిటౌన్: కన్న బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి.. ఆ పిల్లల పాలిట కాలయముడయ్యాడు. భార్యపై కోపంతో ఇద్దరు కుమార్తెలపై విష ప్రయోగం చేశాడు. పెద్ద కుమార్తె చికిత్స పొందుతూ మృతి చెందగా, చిన్న కుమార్తె చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ విషాద ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు శివారు జానకీపురంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జానకీపురానికి చెందిన గుండె శ్రీనుకు మండలంలోని దర్దెపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు నాగప్రియ(9), నందిని (5), రక్షిత్ తేజ్(4) ఉన్నారు. శ్రీను మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్యను వేధించిన కేసులో శ్రీను జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. దీంతో ధనలక్ష్మి భర్తను విడిచి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. పెద్ద మనుషులు రాజీ కుదిర్చి ఆమెను కాపురానికి పంపించారు. తీరు మారని శ్రీను భార్యను చిత్ర హింసలకు గురిచేశాడు. విసిగిపోయిన భార్య ఇటీవల కుమార్తెలను తండ్రి వద్దే వదిలి నాలుగేళ్ల కుమారుడితో పుట్టింటికి వెళ్లింది. భార్య తనతో లేనప్పుడు పిల్లలు ఎందుకని భావించిన శ్రీను వారిని చంపేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ నెల 6న కూల్‌డ్రింక్‌లో విషం కలిపి కుమార్తెలకు ఇచ్చాడు. అదేమీ తెలి యని బిడ్డలు దాన్ని తాగారు. అపస్మారక స్థితికి చేరిన పిల్లలను జనగామ ఆస్పత్రికి తరలించాడు. పెద్ద కుమార్తె నాగప్రియ పరిస్థితి విషమించడంతో ఎంజీఎం తరలించా రు. చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. చిన్న కుమార్తె నందిని ఆరోగ్యం సైతం ఆందోళనకరంగా మారడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నాగప్రియ


బాలిక తండ్రి శ్రీను

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేయాలని మంత్రులు ఆదేశించారు. ఇందు కోసం యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా 7,100 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయా జిల్లాల్లో మొదలైన కోతలు, ధాన్యం దిగుబడికి అనుగుణంగా కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

వచ్చే వారంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ముగ్గురు మంత్రులు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోళ్ళకు కావాల్సిన ఏర్పాట్లను కలెక్టర్లు సిద్ధం చేసుకోవాలని, వచ్చే వారంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. యాసంగికి సీజన్ సీఎంఆర్ అప్పగింతకు ఆఖరు తేదీగా ఈ నెల 30వ తేదీని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ఈలోగా మిల్లర్లు నుంచి సీఎంఆర్‌ను పూర్తి స్థాయిలో సేకరించాలని ఆదేశించారు. ఇక నుంచి సీఎంఆర్ అప్పగించే విషయంలో ఏమాత్రం ఆలస్యం జరిగినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సీఎంఆర్‌ని అప్పగించిన తరువాతే ఈ సీజన్ కు సంబంధించి ధాన్యాన్ని తీసుకోవాలని రైస్ మిల్లర్లుకు సూచించారు. ఇప్పటి వరకు సీఎంఆర్‌లో పాల్గొనని మిల్లర్లను కూడా ఈ యాసంగి సీజన్ నుంచి భాగస్వామ్యం చేస్తున్నట్లు మంత్రులు ప్రకటించారు.

రెండు సీజన్లలో పూర్తి ధాన్యాన్ని సేకరిస్తున్న రాష్ట్రం తెలంగాణనే...

దేశ వ్యాప్తంగా రెండు సీజన్‌లలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమేనని మంత్రులు హరీశ్‌రావు, గంగుల, సింగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నుంచి అదనపు కలెక్టర్లు ఆయా జిల్లా స్థాయిలలో కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసుకొని ధాన్యం కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం నిల్వలకు ఇంటర్మీడియట్ గోడౌన్లను గుర్తించి తగు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. అలాగే ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకోచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

రాష్ట్రంలో భారీగా ధాన్యం దిగుబడి

రాష్ట్రంలో రోజురోజుకూ ధాన్యం దిగుబడి, కొనుగోలు గణనీయంగా పెరుగుతున్నాయని మంత్రులు వెల్లడించారు. 2014-15 లో రూ.3392 కోట్లతో ధాన్యం సేకరిస్తే 2020-21 నాటికి రూ.26 వేల 600 కోట్లతో ధాన్యం సేకరించగలిగామని చెప్పారు. 9 సంవత్సరాలలో ఆరు రెట్ల ధాన్యం కొనుగోలు పెరగగా , ఈ రబీ(యాసంగి)లో దేశంలో సగం పంట తెలంగాణలో మాత్రమే ఉండడం మనకు గర్వకారణమన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న చెక్ పోస్టులను బలోపేతం చేయాలని మంత్రులు ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం జరగకుండా ధాన్యం కొనుగోలు వివరాలను కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పౌర సరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఇంతకాలం ఎందుకు స్పందించలేదు


- ఎమ్మెల్యే మల్లయ్య పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల కేసులో మూడేళ్లు గడిచినా హైకోర్టులో విచారణకు స్పందించకుండా, ఇక్కడకెందుకు వచ్చారంటూ మల్లయ్య యాదవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2018 కోదాడ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో మల్లయ్య యాదవ్ ఆస్తుల వివరాలు సరిగా వెల్లడించలేదంటూ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ 2019 డిసెంబర్ నుంచి 2020 మార్చి వరకూ పలుసార్లు విచారణకు వచ్చినా యాదవ్ తరఫు న్యాయవాదులు ఎవరూ కోర్టుకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో కౌంటరు దాఖలు చేయడానికి వీలు లేకుండా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో హైకోర్టులో తన వివరణ ఇచ్చుకొనే అవకాశం కల్పించాలంటూ మల్లయ్య యాదవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. మల్లయ్య యాదవ్ తరఫు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. హైకోర్టులో వివరణ ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలని, కౌంటరు దాఖలు చేస్తామని తెలిపారు. అయితే పలుసార్లు అవకాశమిచ్చినా కోర్టుకు హాజరు కాలేదని పద్మావతి తరఫు సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మూడేళ్ల నుంచి ఏం చేస్తున్నారని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. హై కోర్టులో ఎందుకు సమాధానం చెప్పలేదంటూ అసహనం వ్యక్తం చేసింది. విచారణలో జోక్యం చేసు కోబోమంటూ మల్లయ్య పిటిషన్‌ను కొట్టివేసింది.

శ్రీశైలంలో పెళ్లని చెప్పి.. | నల్లమలలో హత్య చేసి..

- పెళ్లి చేసుకోవాలని అడిగినందుకు ప్రియురాలిని కడతేర్చిన ప్రియుడు
- మృతురాలు ఏడు నెలల గర్భిణి

జడ్చర్ల: పెళ్లి చేసుకోమని ప్రియురాలు గట్టిగా అడుగుతుండటంతో శ్రీశైలంలో చేసుకుందామంటూ నల్లమల అడవిలోకి తీసుకెళ్లి దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని పెట్రోల్ పోసి దహనం చేసిన ఓ కిరాతకుడి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిటకు చెందిన లక్ష్మి అలియాస్ రత్నమ్మ(34) మూడేళ్ల క్రితం భర్తతో గొడవ పడి దూరంగా ఉంటూ.. కూలి పనులకు వెళ్లే క్రమంలో అదే గ్రామానికి చెందిన లింగస్ చెన్నయ్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. కాగా, చెన్నయ్యకు మరో యువతితో వివాహం కాగా.. లక్ష్మి గొడవపడి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టడంతో రూ.లక్ష జరిమానా చెల్లించాడు. గతేడాది చెన్నయ్య భార్య గర్భిణిగా ఉండడంతో మళ్లీ లక్ష్మికి దగ్గరయ్యాడు. ప్రస్తుతం లక్ష్మి కూడా 7 నెలల గర్భిణి. ఈ సమయంలో తననూ పెళ్లి చేసుకోవాలని, తన పేరిట 2 ఎకరాల భూమి రాసివ్వాలని లేకపోతే గ్రామానికి వచ్చి గొడవ చేస్తానని చెన్నయ్యపై ఒత్తిడి తెచ్చింది. దీంతో ఎలాగైనా ఆమెను అంతమొందించాలని చెన్నయ్య పథకం వేశాడు.


లక్ష్మి (ఫైల్)

పక్కా ప్లాన్ ప్రకారమే..

శ్రీశైలంలో పెళ్లి చేసుకుందామని నమ్మించి ఫిబ్రవరి 28న జడ్చర్ల నుంచి తన బైక్‌పై లక్ష్మిని తీసుకెళ్లాడు. మార్గమధ్యలో ఫర్హాబాద్- మన్ననూర్ మధ్యలో తాళ్ల చెరువు వద్ద నల్లమల అడవిలోకి వెళ్లారు. అక్కడ కర్రతో ఆమె తలపై బాది గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం బైక్‌లో ఉన్న పెట్రోల్ తీసి మృతదేహంపై చల్లి కాల్చివేశాడు. ఈ క్రమంలో తన కూతురు కనిపించడం లేదంటూ చెన్నయ్యపై అనుమానం వ్యక్తం చేస్తూ హతురాలి తల్లి చెన్నమ్మ మార్చి 25న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న చెన్నయ్యను సోమవారం స్థానిక నిమ్మబాయిగడ్డ వద్ద పోలీసులు పట్టుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు చెన్నయ్యపై గతంలో తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్‌లో ఓ ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన కేసు కూడా నమోదైందని, .మూడేళ్ల జైలుశిక్ష కూడా అనుభవించాడని సీఐ తెలిపారు.

క్లుప్తంగా...

ఈసారి తక్కువ వర్షాలే

న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది సాధారణ కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రైవేట్ వాతావరణ అంచనాల ఏజెన్సీ 'స్కైమెట్ వెదర్' సోమవారం ప్రకటించింది. లా నినా, ఎల్‌నినో ప్రభావంతో కరువు సంభవించడానికి 20 శాతం అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. వరుసగా గత నాలుగేళ్లుగా దేశంలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు పడ్డాయి. ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైతే ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఇబ్బందులు తప్పవు. పంటల ఉత్పత్తి పడిపోతుంది. తద్వారా ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి.

వీడియోపై వివాదం.. దలైలామా క్షమాపణ



సిమ్లా: టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా ఇటీవల తన వద్దకు ఆశీర్వాదం కోసం వచ్చిన ఓ బాలుడి పెదాలపై ముద్దు పెట్టుకోవడం వివాదాస్పదంగా మారింది. దీంతో సోమవారం ఆ బాలుడి కుటుంబానికి దలైలామా క్షమాపణలు తెలిపారు. బాలుడిని పెదాల పై ముద్దుపెట్టుకోవడం, తన నాలుకను నోటితో తాకాలని కోరినట్లుగా ఉన్న 2 నిమిషాల వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దలైలామా చర్యల పట్ల నెటిజన్లు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. దీంతో, తన మాటలతో ఎవరైనా బాధపడితే వారందరినీ ఆయన క్షమాపణ కోరారని దలైలామా బృందం తెలిపింది. 'తనను కలిసే వ్యక్తులతో, ముఖ్యంగా చిన్నారులతో సరదాగా ఉంటారు. ఒక్కోసారి ఆటపట్టిస్తుంటారు. సమావేశాల్లోనైనా, కెమెరాల ముందైనా ఆయన ఇలాగే ఉంటారు. అయితే, జరిగిన దానికి ఆయన క్షమాపణలు కోరుతున్నారు' అని వివరించింది.

అమృత్ సన్నిహితుడు అరెస్ట్

చండీగఢ్: ఖలిస్తానీ అనుకూల బోధకుడు అమృత్‌పాల్ సింగ్ ప్రధాన అనుచరుడు పాపల్‌ప్రీత్ సింగ్‌ను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమృత్‌సర్‌లోని కథునంగల్ ఏరియాలో ఇతడిని పట్టుకున్నట్లు పంజాబ్ ఐజీ సుఖ్‌చైన్ సింగ్ చెప్పారు. పాపల్‌ప్రీత్ సింగ్‌పై జాతీయ భద్రతా చట్టంతోపాటు ఆరు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఖలిస్తానీ మద్దతుదారులపై మార్చి 18వ తేదీ నుంచి మొదలైన అరెస్టుల నుంచి అతడు తప్పించుకు తిరుగుతున్నాడు.

కర్ణాటక శాసనసభ ఎన్నికలకు సరిగ్గా నెల రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీ(ఎస్) పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. రాష్ట్రంలో 1985 నుంచి అధికార పార్టీ వరుసగా రెండోసారి నెగ్గిన దాఖలాలు లేవు. 38 ఏళ్ల ఆ సంప్రదాయాన్ని బద్దలుకొట్టి, మళ్లీ జెండా ఎగురవేయాలన్న కృతనిశ్చయంతో బీజేపీ ఉంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలాన్ని సొంతంగానే సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగుతోంది. తగిన మెజార్టీ లేక దెబ్బతిన్న అనుభవాలు ఆ పార్టీకి ఉన్నాయి. కర్ణాటకలో గెలుపు కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ నెగ్గి, సొంతంగా మెజార్టీ సాధిస్తే రెండు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నట్లే.

రెండో గండం దాటేస్తారా!?



ఆసక్తికరంగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు

వరుసగా రెండోసారి అధికారంలోకి రాలేకపోతున్న పార్టీలు

38 ఏళ్ల సంప్రదాయాన్ని తిరగరాయాలనుకుంటున్న బీజేపీ

సొంతంగానే పూర్తి మెజార్టీ సాధించాలన్నదే లక్ష్యం

స్వయంగా రంగంలోకి దిగిన నరేంద్ర మోదీ, అమిత్ షా

కర్ణాటకలో జనతా పార్టీ నేత రామకృష్ణ హెగ్డే ముఖ్యమంత్రిగా 1983 నుంచి 1985 వరకూ మైనార్టీ ప్రభుత్వం కొనసాగింది. రాష్ట్రంలో అదే తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం. 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జనతా పార్టీకి ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో రామకృష్ణ హెగ్డే తన ప్రభుత్వాన్ని రద్దు చేశారు. మూడు నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. జనతా పార్టీ ఘన విజయం సాధించింది. 224 సీట్లున్న అసెంబ్లీలో ఏకంగా 139 సీట్లు గెలుచుకుంది. 1985లో వరుసగా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం జనతా పార్టీలో విభేదాలు తలెత్తాయి. జనతా పార్టీ మూడు పార్టీలుగా విడిపోయింది. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైంది. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. వీరేంద్ర పాటిల్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లో అధికార పార్టీ ఓడిపోతూ వచ్చింది. 1989 నుంచి ఇప్పటివరకూ ఏడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రులకు మళ్లీ అదే పదవి వరుసగా రెండోసారి దక్కలేదు. మూడున్నరేళ్ల క్రితం సీఎంగా కుర్చీనెక్కిన బసవరాజ బొమ్మై తన పార్టీని గెలిపించి, మళ్లీ సీఎం అవుతారా! అన్నది చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన భవితవ్యం తేలిపోనుంది.

బొమ్మై లక్ ఎలా ఉందో!



మోదీ-షాకు ప్రతిష్టాత్మకం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలపై నరేంద్ర మోదీ, అమిత్ షా ఎంతో శక్తిని, సమయాన్ని, కేంద్ర ప్రభుత్వ వనరులను వెచ్చిస్తున్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మళ్లీ బీజేపీని గెలిపించి, ట్రెండ్‌ను రివర్స్ చేయాలన్నదే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. గత ఏడు నెలలుగా కర్ణాటకలో ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. బెంగళూరు-మైసూర్ ఎక్స్‌ప్రెస్ వే, ధార్వాడలో ఐఐటీ క్యాంపస్, శివమొగ్గలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, హుబ్బళ్లిలో ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే ప్లాట్‌ఫామ్ వంటి కీలకమైన ప్రాజెక్టులను నరేంద్ర మోదీ ప్రారంభించారు. 'కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోండి, డబుల్ ఇంజిన్ ప్రయోజనాలు అందుకోండి' అని పిలుపునిస్తున్నారు.

సంపూర్ణ మెజార్టీయే లక్ష్యం


రాష్ట్రంలో 2008, 2018లో బీజేపీ విజయం సాధించింది. రెండుసార్లూ 100 సీట్ల మార్కును దాటింది. కానీ, సంపూర్ణ మెజార్టీ అడుగు దూరంలోనే ఆగిపోయింది. ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. కానీ, అందుకు భారీ మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. ఈసారి మాత్రం పూర్తి మెజార్టీ దక్కించుకునేందుకు మోదీ-షా నేరుగా రంగంలోకి దిగారు. కులాలు లెక్కలు, ప్రాంతీయ సమీకరణాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. బీజేపీ తరఫున పోటీకి దిగే అభ్యర్థులను స్వయంగా ఎంపిక చేస్తున్నారు. గెలుపు గుర్రాల ఎంపికలో నిమగ్నమయ్యారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆశలు

కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్రంలో కోట్లాది మంది లబ్ధి పొందారని, వారంతా తమకు అనుకూలంగా ఓటు వేయడం ఖాయమని బీజేపీ నాయకత్వం ఆశలు పెంచుకుంది. కర్ణాటక ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ప్రధాన మంత్రి జన సురక్ష యోజన కింద రాష్ట్రంలో 1.4 కోట్ల మంది ఖాతాల్లోకి రూ.6,000 చొప్పున బదిలీ చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద అన్ని బీపీఎల్ కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేశారు. జన్ ఆవాస్ యోజన కింద 30 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేశారు. మరోవైపు సర్కారీ కాంట్రాక్టుల్లో '40 శాతం కమీషన్లు' అనే ఆరోపణలు బొమ్మై ప్రభుత్వానికి ప్రతికూలంగా మారాయి. రాష్ట్రంలో అవినీతి భారీగా పెరిగిపోవడం, రాజధాని బెంగళూరులో కనీస మౌలిక సదుపాయాలు కొరవడడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.




కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన సీట్లు



'కోటా' కార్డు పనిచేస్తుందా?

వేర్వేరు సామాజిక వర్గాలను ఆకట్టుకొనేందుకు బసవరాజ బొమ్మై రిజర్వేషన్ కార్డును ప్రయోగిస్తోంది. ఎన్నికల ప్రకటనకు కేవలం నాలుగు రోజుల ముందు రిజర్వేషన్ ఫార్ములాను సవరించే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. ఓబీసీ కేటగిరీలో ముస్లింలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లను తొలగించి, వాటిని లింగాయత్‌లు, వొక్కళిగలకు సమానంగా వర్తింపజేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ముస్లింలకు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈడబ్ల్యూఎస్) కేటగిరీలో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అలాగే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచింది. కోటా కార్డు తమకు కచ్చితంగా లాభిస్తుందని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే, రిజర్వేషన్ల విషయంలో బొమ్మై సర్కారు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు. అందుకే వాటి ప్రభావం ఓటర్లపై పెద్దగా ఉండకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రిజర్వేషన్ల పేరిట బీజేపీ డ్రామాలు ఆడుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కర్ణాటకలో ఓట్ల శాతం పెంచుకుంటేనే కాంగ్రెస్ గట్టెక్కే పరిస్థితి కనిపిస్తోంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 38 శాతం ఓట్లతో 80 సీట్లు సాధించింది. బీజేపీ కేవలం 36.2 శాతం ఓట్లతో 104 స్థానాల్లో నెగ్గింది.



\- సాక్షి, నేషనల్ డెస్క్

జేడీ(ఎస్) బలం పాత మైసూర్

కిత్తూర్ కర్ణాటక(పాత ముంబై ప్రాంతం), కల్యాణ కర్ణాటక(హైదరాబాద్ కర్ణాటక), సెంట్రల్ కర్ణాటకతోపాటు కోస్తా ప్రాంతంలో బీజేపీ బలంగానే ఉంది. పాత మైసూర్ ప్రాంతం, బెంగళూరు సిటీలో మాత్రం వెనుకబడి ఉండడం ఆ పార్టీని కలవరానికి గురిచేస్తోంది. ఈ రెండుచోట్ల మొత్తం 89 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. పాత మైసూర్‌లో వొక్కళిగ సామాజికవర్గం ప్రాబల్యం అధికం. 2018 ఎన్నికల్లో జేడీ(ఎస్) ఇక్కడ 37 స్థానాలకు గాను 30 స్థానాలు గెలుచుకుంది. కింగ్‌మేకర్‌గా మారింది. ఆ పార్టీ నేత, వొక్కళిక సామాజికవర్గం ప్రముఖుడు హెచ్‌డీ కుమారస్వామి 14 నెలలపాటు సీఎంగా కొనసాగారు. పాత మైసూర్‌లో ఈసారి కూడా వీలైనన్ని ఎక్కువ సీట్లు సాధించి, ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారాలని జేడీ(ఎస్) భావిస్తోంది.



కన్నడనాట పాల గోల

అమూల్ నందినీ డెయిరీలపై రాజకీయ రగడ



బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటకలో పాలపై వివాదం చినికిచినికి గాలివానగా మారుతోంది. బెంగళూరులో ఆన్‌లైన్ ద్వారా అమూల్ పాలు, పెరుగు విక్రయించనున్నట్టు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఇటీవల చేసిన ప్రకటన కలకలం రేపుతోంది. అమూల్‌కు వ్యతిరేకంగా పలు కన్నడ సంస్థలు సోమవారం నిరసనలు, ధర్నాలు నిర్వహించాయి. గో బ్యాక్ అమూల్, సేవ్ నందిని అంటూ హాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలోనూ నిరసనలు జోరందుకుంటున్నాయి. అమూల్‌ను రాష్ట్రంలోకి తీసుకొచ్చి స్థానిక నందినీ డెయిరీని దెబ్బ తీసేందుకు అధికార బీజేపీ ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్, జేడీ(ఎస్) విమర్శలు గుప్పిస్తున్నాయి. ''గుజరాత్‌కు చెందిన బరోడా బ్యాంక్ మా విజయ బ్యాంక్‌ను కబళించింది. దేశంలోని నౌకాశ్రయాలు, విమానాశ్రయాలన్నింటినీ గుజరాతీ అయిన అదానీకి కట్టబెడుతున్నారు. ఇప్పుడు నందినీ డెయిరీపై పడ్డారు'' అంటూ కాంగ్రెస్ నేత సిద్దరామయ్య దుయ్యబట్టారు. జేడీ(ఎస్) నేత కుమారస్వామి కూడా అమూల్‌పై విమర్శలతో ట్వీట్లు చేశారు. ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. అమూల్ కర్ణాటకలోకి ప్రవేశించడం లేదని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ చెప్పారు. నందినీ డెయిరీని అమూల్‌లో విలీనం చేస్తారన్నది కూడా కాంగ్రెస్ కుట్రపూరిత ప్రచారం మాత్రమేనన్నారు. బీజేపీ హయాంలోనే నందినీ డెయిరీ భారీగా విస్తరించిందని చెప్పుకొచ్చారు.

అమెరికాలో కాల్పులు... ఐదుగురు దుర్మరణం

లూయిస్‌విల్లే: అమెరికాలోని కెంటకీ రాష్ట్రం లూయిస్‌విల్లెలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. ఓల్డ్ నేషనల్ బ్యాంక్ పనిచేసే భవనంలోనే కాల్పులు జరిగినట్టు పోలీసులు తెలిపారు. తమ కాల్పుల్లో దుండగుడు మరణించాడన్నారు. ఈ ఘటనలో పోలీసు అధికారి సహా ఆరుగురు గాయపడినట్లు చెప్పారు.

ఆలయంలో చెట్టు కూలి... మహారాష్ట్రలో ఏడుగురి మృతి

అకోలా: మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. ఆలయ ప్రాంగణంలో 100 ఏళ్ల వయసున్న చెట్టు కూలిపోవంతో ఏడుగురు మరణించారు. మరో 37 మంది గాయాలపాలయ్యారు. బాలాపూర్ తాలూకా పారస్ గ్రామంలోని బాబూజీ మహారాజ్ ఆలయంలో ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఈ సంఘటన జరిగిందని అధికారులు వెల్లడించారు.

కల్యంపూడి రాధాకృష్ణారావుకు అంతర్జాతీయ స్టాటిస్టిక్స్ పురస్కారం

భారత్-అమెరికన్ గణిత శాస్త్రవేత్తకు ప్రతిష్టాత్మక అవార్డు

వాషింగ్టన్: ప్రఖ్యాత భారత్-అమెరికన్ గణిత శాస్త్రవేత్త, గణాంకశాస్త్ర(స్టాటిస్టిక్స్) నిపుణుడు కల్యంపూడి రాధాకృష్ణారావు(102)ను ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. స్టాటిస్టిక్స్ రంగంలో నోబెల్ బహుమతితో సమానమైన 'ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్'ను 2023 సంవత్సరానికి గాను రాధాకృష్ణారావుకు అందజేయనున్నట్లు ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. స్టాటిస్టిక్స్‌లో 75 ఏళ్ల క్రితం ఆయన చేసిన కృషి సైన్స్‌పై ఇప్పటికీ అమిత ప్రభావం చూపిస్తోందని ప్రశంసించింది. కెనడాలోని ఒట్టావాలో ఈ ఏడాది జూలైలో జరిగే ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ వరల్డ్ స్టాటిస్టిక్స్ కాంగ్రెస్‌లో అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ బహుమతి కింద 80,000 డాలర్లు అందజేస్తారు. ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్‌ను ప్రతి రెండేళ్లకోసారి ప్రదానం చేస్తారు. 2017లో తొలిసారిగా ఈ అవార్డును డేవిడ్ ఆర్ కాక్స్ అందుకున్నారు. 2019లో బ్రాడ్లీ ఎఫ్రాన్, 2021లో నాన్ లాయిర్డ్ స్వీకరించారు.




ఏపీలో విద్యాభ్యాసం

కల్యంపూడి రాధాకృష్ణారావు కర్ణాటకలోని హడగళిలో తెలుగు కుటుంబంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, నూజివీడు, నందిగామ, విశాఖపట్నంలో విద్యాభ్యాసం సాగింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గణితశాస్త్రంలో ఎంఎస్సీ చేశారు. 1943లో కలకత్తా యూనివర్సిటీ నుంచి స్టాటిస్టిక్స్‌లో ఎంఏ డిగ్రీ అందుకున్నారు. ఇంగ్లండ్‌లో కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన కింగ్స్ కాలేజీలో పీహెచ్‌డీ చేశారు. 1965లో కేంబ్రిడ్జి వర్సిటీ నుంచి డీఎస్సీ డిగ్రీ స్వీకరించారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, తర్వాత కేంబ్రిడ్జిలోని ఆంత్రోపాలాజికల్ మ్యూజియంలో సేవలందించారు. పలు భారత, విదేశీ వర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1968లో పద్మభూషణ్, 2001లో పద్మ విభూషణ్ అందుకున్నారు.

తైవాన్‌పై యుద్ధానికి సై!

చైనా సైన్యం ప్రకటన ● ముగిసిన సైనిక విన్యాసాలు ● అయినా తైవాన్ చుట్టూ మోహరింపులు యథాతథం ● తారస్థాయికి చేరిన ఉద్రిక్తతలు

తైపీ: దక్షిణ చైనా సముద్రంపై యుద్ధ మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. చైనా-తైవాన్ ఘర్షణ క్రమంగా తారస్థాయికి చేరుతోంది. ఈ ద్వీప దేశంపై ఏ క్షణంలోనైనా యుద్ధానికి దిగేందుకు అన్నివిధాలా సిద్ధంగా ఉన్నట్టు చైనా సైన్యం సోమవారం చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది. స్వయంపాలిత హోదా ఉన్న తైవాన్ నిజానికి తమ అంతర్భాగమేనని చైనా చిరకాలంగా వాదిస్తుండటం తెలిసిందే. ఈ వాదనతో తైవాన్ తీవ్రంగా విభేదిస్తోంది. పూర్తిస్థాయి స్వతంత్ర దేశంగా గుర్తింపు పొందేందుకు చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. అందుకు అమెరికా అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తుండటంపై చైనా గుర్రుగా ఉంది. గత ఆగస్టులో చైనా హెచ్చరికలను ఖాతరు చేయకుండా అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ తైవాన్‌లో పర్యటించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా తైవాన్ దేశాధ్యక్షురాలు సై ఇంగ్ వెన్ జరిపిన అమెరికా పర్యటనపై చైనా మరోసారి అగ్గిమీద గుగ్గిలం అవుతోంది. మూడు రోజులుగా చైనా సైన్యం తైవాన్ ద్వీపకల్పాన్ని దిగ్బంధించి భారీ సైనిక విన్యాసాలకు తెర తీసింది. జాయింట్ స్వార్డ్ పేరిట జరిగిన ఈ యుద్ధ సన్నద్ధత విన్యాసాలు సోమవారంతో ముగిశాయి. కానీ తైవాన్ చుట్టూరా చైనా సైనిక మోహరింపులు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. ''ఏ క్షణంలోనైనా యుద్ధానికి దిగేందుకు సిద్ధంగా ఉన్నాం. స్వాతంత్య్రం కోసం తైవాన్ చేసే ప్రయత్నాలను పూర్తిస్థాయిలో అణచివేస్తాం. ఈ విషయంలో విదేశీ జోక్యాలను కూడా మర్చిపోలేని రీతిలో తిప్పికొడతాం'' అంటూ ఈ సందర్భంగా చైనా సైన్యం ప్రకటన విడుదల చేసింది. ''తైవాన్‌లోని వేర్పాటువాదులకు, వారికి దన్నుగా నిలుస్తున్న బయటి శక్తులకు మా సైనిక విన్యాసాలు ఒక గట్టి హెచ్చరిక'' అని చైనా సైన్యం ఈస్టర్న్ కమాండ్ అధికార ప్రతినిధి షీ యీ అన్నారు. తైవాన్ విషయంలో తాము అనుసరిస్తున్న 'వన్ చైనా' సూత్రానికి అన్ని దేశాలూ మద్దతిస్తాయని ఆశిస్తున్నట్టు ఆ దేశ విదేశాంగ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అన్నారు. ఈ ప్రాంతంపై పట్టు కోసం తైవాన్‌ను పావుగా అమెరికా వాడుకుంటోందని పీఎల్‌ఏ డైలీ ఆరోపించింది. తమతో యుద్ధమే వస్తే తైవాన్‌కు సైనిక సాయానికి అమెరికా ముందుకు రాదని అభిప్రాయపడింది. గత ఆగస్టులో నాన్సీ పర్యటనకు నిరసనగా కూడా చైనా ఇలాంటి విన్యాసాలే చేపట్టడం తెలిసిందే. తైవాన్ పరిసరాల్లోని పలు లక్ష్యాలపై క్షిపణి ప్రయోగాలకు కూడా దిగి తీవ్ర ఉద్రిక్తతకు తెర తీసింది.



తైవాన్ సముద్రజలాల్లో పయనిస్తున్న చైనా కోస్ట్‌గార్డ్ నౌక

శతాబ్దాల నాటి ఘర్షణ

చైనా, తైవాన్ ఘర్షణలకు శతాబ్దాల చరిత్ర ఉంది. కొన్నేళ్లుగా తైవాన్ చుట్టూ సైనిక విన్యాసాలు చైనాకు పరిపాటిగా మారాయి. అయితే ఆ దేశాన్ని ఈ స్థాయిలో చుట్టుముట్టి సైనికంగా పూర్తిగా దిగ్బంధించడం ఇదే తొలిసారి. దీని వెనక కచ్చితంగా ఏదో మతలబు ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. షాన్‌డాంగ్ విమాన వాహక నౌకను కూడా చైనా రంగంలోకి దించింది. యుద్ధమే మొదలయ్యే పక్షంలో తైవాన్‌కు విదేశీ సైనిక సాయం అందకుండా అడ్డుకునేందుకే చైనా ఈ చర్యకు దిగిందని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. తైవాన్‌లో అమెరికా జోక్యం మితిమీరుతోందనే సాకుతో ఆ దేశంపై ఏ క్షణంలోనైనా చైనా సైనిక చర్యకు దిగే ఆస్కారం లేకపోలేదని అభిప్రాయపడుతున్నారు. ఆదివారం నుంచి సోమవారం దాకా కనీసం 70కి పైగా యుద్ధ విమానాలు, 10 యుద్ధనౌకలు తైవాన్ జలసంధి చుట్టూ కలియ దిరిగాయి. వీటిలో 8 జే-16 ఫైటర్ జెట్లు, 4 జే-1 ఫైటర్లు, 8 ఎస్‌యూ-30 ఫైటర్లు, జే-15 ఫైటర్లున్నాయి. తైవాన్ అధ్యక్షురాలి అమెరికా పర్యటనకు ఆతిథ్యమిచ్చిన రెండు అమెరికా సంస్థలపై ఆంక్షలు విధిస్తున్నట్టు చైనా ప్రకటించింది.

అంగుళమైనా ఆక్రమించలేరు!

అరుణాచల్ పర్యటనలో అమిత్ షా



కిబితూ (అరుణాచల్‌ప్రదేశ్)/బీజింగ్: భారత సరిహద్దులను ఎవరు పడితే వాళ్లు ఆక్రమించుకునే రోజులు పోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఇప్పుడు వాటిపై ఎవరూ కన్నేసే ధైర్యం కూడా చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. మన భూభాగంలో సూది మొన మోపినంత కూడా ఎవరూ ఆక్రమించలేరన్నారు. సోమవారం ఆయన అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటించారు. తూర్పు దిశగా భారత దేశపు చిట్టచివరి సరిహద్దు గ్రామమైన కిబితూలో వైబ్రంట్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ''ఇది చివరి గ్రామం కాదు. భారత దేశపు మొదటి గ్రామం'' అని చెప్పుకొచ్చారు. ''2014కు ముందు ఈశాన్య రాష్ట్రాలన్నింటినీ సమస్యాత్మక ప్రాంతాలుగా చూసే పరిస్థితి ఉండేది. మోదీ హయాంలో అక్కడ ప్రగతి, అభివృద్ధి పరుగులు తీస్తున్నాయి'' అన్నారు. అమిత్ షా పర్యటనపై చైనా అభ్యంతరం వెలిబుచ్చింది. ఆ ప్రాంతంపై తమ సార్వభౌమత్వాన్ని ఆయన ఉల్లంఘించారంటూ తెంపరితనాన్ని చాటుకుంది. ''జంగ్నాన్ (అరుణాచల్‌కు చైనా పెట్టుకున్న పేరు) చైనాలో భాగం'' అని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ చెప్పుకొచ్చారు. అరుణాచల్‌లోని కొన్ని ప్రాంతాలకు చైనా ఇటీవల పేర్లు మార్చడం, దీనిపై భారత్ మండిపడటం తెలిసిందే.

మహిళా సిబ్బందిపై ప్రయాణికుడి దాడి.. తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం


న్యూఢిల్లీ: మహిళా సిబ్బందితో దౌర్జన్యంగా ప్రవర్తించిన ఓ ప్రయాణికుడి కారణంగా ఎయిరిండియా విమానం బయలుదేరిన కొద్ది గంటల్లోనే తిరిగి వచ్చింది. సదరు ప్రయాణికుడిని దించేసి వెళ్లిపోయింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎయిరిండియాకు చెందిన ఏఐ 111 విమానం సోమవారం ఉదయం 6.35 గంటలకు సుమారు 225 మంది ప్రయాణికులతో లండన్‌కు బయలుదేరింది. కొద్దిసేపటికే ఎకానమీ క్లాస్‌లోని 20ఈ సీట్లో కూర్చున్న జస్‌కీరత్ సింగ్(25) క్యాబిన్ మహిళా సిబ్బందితో అమర్యాదకరంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఇద్దరు సిబ్బందిని కిందపడేసి కొట్టాడు. పలుమార్లు హెచ్చరించినా అతడు లక్ష్యపెట్టలేదు. డోరు తెరిచేందుకు ప్రయత్నించాడు. దీంతో, ఇతర ప్రయాణికులు సిబ్బంది కలిసి అతడిని సీట్లోంచి కదలకుండా చేశారు. 9.40 గంటల సమయంలో పైలట్ విమానాన్ని తిరిగి ఢిల్లీ విమానాశ్రయానికి తీసుకువచ్చారు. జస్‌కీరత్ సింగ్‌ను సీఐఎస్‌ఎఫ్ అధికారులకు అప్పగించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టారు. విమానం మధ్యాహ్నం సమయంలో తిరిగి లండన్ బయలుదేరింది. పంజాబ్‌లోని కపుర్తలాకు చెందిన జస్‌కీరత్ సింగ్ తల్లిదండ్రులతో లండన్ వెళ్తున్నాడని అధికారులు తెలిపారు. కాగా, దేశీయ, అంతర్జాతీయ విమానాల్లో అమర్యాదకరంగా ప్రవర్తించిన ఘటనలపై గత ఏడాది 63 మంది ప్రయాణికులను 'నో ఫ్లై లిస్ట్'లో చేర్చినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపింది.

బిల్లుల ఆమోదంలో గవర్నర్‌కు కాలపరిమితి

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

సాక్షి, చెన్నై: చట్టసభల్లో ఆమోదించిన బిల్లులు, తీర్మానాలపై ఆమోదముద్ర వేసేందుకు గవర్నర్‌కు కాల పరిమితి నిర్ణయించాలని రాష్ట్రపతిని, కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ సోమవారం తీర్మానం చేసింది. డీఎంకే ప్రభుత్వం, గవర్నర్ ఆర్‌ఎన్ రవి మధ్య తరచూ విభేదాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

ఇవి వందల కోట్లు పలికాయి...





సోత్‌బే సంస్థ ఇటీవల హాంకాంగ్‌లో నిర్వహించిన వేలంలో 18వ శతాబ్దానికి చెందిన ఈ పింగాణీ గిన్నె రూ.200 కోట్లు పలికింది. అదేవిధంగా, చైనా కళాకారుడు జాంగ్ డకియాన్ గీసిన 1973 నాటి 'లోటసెస్ ఆన్ గోల్డ్ స్క్రీన్' పెయింటింగ్ ఏకంగా రూ.262 కోట్లకు అమ్ముడైంది.

దేశవ్యాప్త కోవిడ్ మాక్‌డ్రిల్

ఆస్పత్రుల సన్నద్ధతపై ఉన్నతస్థాయి సమీక్ష



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా కేసుల్లో పెరుగుదల నమోదు చేసుకుంటున్న నేపథ్యంలో సోమవారం కోవిడ్ మాక్‌డ్రిల్ జరిగింది. పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోవిడ్ సన్నద్ధతను పరిశీలించారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సందర్శించారు. వివిధ విభాగాధిపతులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. 'రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాక్‌డ్రిల్‌కు భారీ స్పందన లభించింది. ఆరోగ్య శాఖల మంత్రులు ఆస్పత్రుల్లో సన్నద్ధత, సౌకర్యాలపై సమీక్షలు జరిపారు' అని ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది.

35 వేలు దాటిన యాక్టివ్ కేసులు

దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 5,880 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్రం సోమవారం తెలిపింది. యాక్టివ్ కేసులు 35,199కు చేరాయని పేర్కొంది. అదేసమయంలో, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీల్లో నలుగురు చొప్పున, గుజరాత్, జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లలో కలిపి మరో 14 మంది మరణించడంతో మొత్తం కోవిడ్ మరణాలు 5,30,979కు పెరిగాయని తెలిపింది. రోజువారీ పాజిటివిటీ రేటు 6.91% కాగా, మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 0.08%గా ఉన్నట్లు వివరించింది.

త్వరలో అందుబాటులోకి కోవోవ్యాక్స్

సీరమ్ ఇన్‌స్టిట్యూట్ తయారీ కోవిడ్ టీకా కోవోవ్యాక్స్‌ను కోవిన్ పోర్టల్‌లో చేర్చేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆమోదం తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కోవోవ్యాక్స్ ధర రూ. 225గా ఉంటుందని పేర్కొన్నాయి. కోవిషీల్డ్, కోవాగ్జిన్ వేయించుకున్న పెద్దలు కోవోవ్యాక్స్‌ను బూస్టర్ డోస్‌గా తీసుకోవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. కోవోవ్యాక్స్‌ను ఇప్పటికే డీసీజీఐ, డబ్ల్యూహెచ్‌ఓ, యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం లభించిందని గుర్తు చేశాయి.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 11 | ఏప్రిల్ | 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడె, తలనీలాల మొక్కులు చెల్లించుకున్నారు.



మాయం చేశారా?

జగిత్యాల జిల్లా నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఉక్కపోతగా ఉండి, వేడి తీవ్రత పెరుగుతుంది.

తల్లి పాదాల కింద స్వర్గం ఉంది.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6:34	బుధ 4:36

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

12న విద్యుత్ సమ్మె సన్నాహక సమావేశం



విద్యానగర్/కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఈనెల 17న తలపెట్టిన విద్యుత్ సమ్మెపై బుధవారం కరీంనగర్‌లోని శుభం గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు కరీంనగర్ జేఏసీ నాయకులు భాస్కర్, అంజయ్య తెలిపారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావుకు వినతి పత్రాలు సమర్పించామని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంపత్‌కుమార్, శ్రీనివాస్, స్వామి, జనార్దన్, రజనీకాంత్, సుధీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం క్వింటాల్‌కు రూ.7,900 పలుకగా, సోమవారం రూ.100 పెరిగి గరిష్ట ధర రూ.8,000 పలికింది. మార్కెట్‌కు 66 వాహనాల్లో 1,027 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,900, కనిష్ట ధర రూ.7,000 చెల్లించారు. గన్నీ సంచుల్లో ఐదుగురు రైతులు 5 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,300, మోడల్ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6,000 పలికింది. మార్కెట్‌లో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

కరోనా కేసులు పెరిగినా.. చికిత్సకు సిద్ధం


డాక్టర్ రత్నమాల

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. కేసులు పెరుగుతున్న దృష్ట్యా జిల్లా ఆసుపత్రిలో కోవిడ్ చికిత్స కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు కోవిడ్ నియంత్రణ కోసం నిర్ధారణ పరీక్షలు, ఇన్‌పేషెంట్లకు అత్యాధునిక చికిత్స, కావాల్సిన మందులు అన్ని సమకూర్చుకున్నట్లు వివరించారు. గతంలో జరిపిన చికిత్సలు, టెస్టులకు సంబంధించి ఆన్‌లైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు మాస్కులు ధరించి శానిటైజర్ విధిగా వాడాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో పెద్దగా కేసులు నమోదు కానప్పటికీ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకొని వైరస్ విస్తృతిని అరికట్టాలని కోరారు.

విదేశాల్లో ప్లేస్‌మెంట్స్

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ ఓవర్సీస్ మానవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీస్కిల్డ్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. టామ్‌కామ్ గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, హంగేరి, రొమేనియా, కెనడా, జర్మనీ, జపాన్, యూకె తదితర దేశాల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రిజిస్టర్డ్ ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు టామ్‌కామ్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95028 94238, 99518 84095, 99088 30438 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షల వింతలు.. 'పది'ంతలు!



సీనియర్లకు ఇన్విజిలేషన్, జూనియర్లకు సీఎస్‌డీవో బాధ్యతలు

- ఇంటికి సమీపంలోనే సెంటర్ వేయించుకున్న పలువురు టీచర్లు
- గత పరీక్షల సమయంలో సస్పెండ్ అయిన వారికి విధులు!
- అవేమీ లేవంటున్న జిల్లా విద్యాశాఖ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పదో తరగతి వరుస లీకులు రాష్ట్ర రాజకీయాలను కుదిపివేస్తోన్న క్రమంలో జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు స్వయంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. తెలుగు, హిందీ పేపర్లు సోషల్ మీడియాలో బయటికి వచ్చిన విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తోంది. కానీ, కరీంనగర్ జిల్లాలో మాత్రం పరీక్షల నిర్వహణలో అనేక లోపాలు, అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాల్సిన విద్యాశాఖ అధికారులు పైరవీల కారణంగా పలువురు టీచర్లకు నిబంధనలకు నీళ్లొదిలి వారికి నచ్చినచోట విధులు కేటాయిస్తున్నారన్న ఆరోపణలు పెరిగిపోయాయి.

జూనియర్లకు నిర్వహణ బాధ్యతలా?

పదో తరగతి పరీక్షలు నేటితో ముగియనున్నాయి. కానీ, ఈ పరీక్షల నిర్వహణ మిగిలిన అన్ని జిల్లాల్లో పారదర్శకంగా జరుగుతుండగా.. కరీంనగర్ జిల్లాలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి.

- జూనియర్లకు పరీక్షా కేంద్రం నిర్వహణ చూసేందుకు సెంటర్ సూపరింటెండెంట్ (సీఎస్), ప్రశ్నాపత్రాలు, సమాధానపత్రాలను పోలీసుస్టేషన్‌కు తరలించే డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో) బాధ్యతలు అప్పగించారు. అదే సీనియర్లకు మాత్రం ఇన్విజిలేషన్ డ్యూటీలకు పరిమితం చేసింది. ఇది చాలామంది సీనియర్లను చిన్నబుచ్చుకునేలా చేసింది.
- ఇంటికి దగ్గరలో పలువురు టీచర్లకు డ్యూటీలు పడ్డాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వ టీచర్లకు ర్యాండమ్‌గా విధులు కేటాయించాలి. కానీ, కొందరు టీచర్లు తమ ఇంటికి సమీపంలో ఉన్న టెన్త్ పరీక్షా కేంద్రాల్లో విధులు వేయించుకోవడంపై మిగిలిన టీచర్లు మండిపడుతున్నారు.
- టీచర్లు తాము నివసించే 8.కి.మీ లోపు స్పాట్ (మూల్యాంకనం) వాల్యుయేషన్ సెంటర్లో విధులు వేస్తే.. ఎలాంటి రవాణాభత్యం (టీఏ) / దినభత్యం (డీఏ) చెల్లించరు. దీంతో ఏకంగా అనారోగ్య కారణాలు చూపి ఈ విధులు ఎగ్గొట్టేందుకు చాలామంది టీచర్లు ప్రణాళికలు వేసుకుంటున్నారు.
- వేసవిలో జరగబోయే ఓపెన్ టెన్త్ పరీక్షల విధులు నిర్వహిస్తే.. ఆర్జిత సెలవులు (ఈఎల్స్) వస్తాయి. ఈ పనులు చేసేందుకు ఇదే అనారోగ్యం కారణాలు చూపేందుకు సిద్ధమైన టీచర్లంతా విధినిర్వహణకు ఆసక్తి చూపిస్తుండటం గమనార్హం. తమ పేరు ఎలాగైనా విధుల జాబితాలో ఉండేలా డీఈవో కార్యాలయంలో పైరవీలు ప్రారంభించారు.
- గతంలో ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం, తప్పులు చేసి కొందరు ప్రభుత్వ టీచర్లు సస్పెండ్ అయ్యారు. నిబంధనల ప్రకారం వీరికి ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి విధులు ఇవ్వకూడదు. కానీ, ఈసారి అలాంటి వారికి విధులు కేటాయించడం గమనార్హం.
- పీజీ హెచ్‌ఎంలకు ఇవ్వాల్సిన సీఎస్– డీవోల డ్యూటీలను జూనియర్లకు అప్పగించడంపై తీవ్ర వ్యతిరేకత, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 98 పీజీ హెచ్‌ఎంలు ఉండగా.. కేవలం 33 మందికి మాత్రమే డ్యూటీలు వేయడం ఇందుకు నిదర్శనం అని మండిపడుతున్నారు. మిగిలిన వారికి పరీక్ష నిర్వహణ బాధ్యతలు ఏమీ అప్పగించలేదు. వీరిని కాదని స్కూల్ అసిస్టెంట్లకు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. మిగిలిన అన్ని జిల్లాల్లో పీజీ హెచ్‌ఎంలకు నిర్వహణ బాధ్యతలు ఇవ్వగా.. మన జిల్లాలో మాత్రం కేవలం స్కూల్ అసిస్టెంట్లకు ఎలా ఇస్తారు అని నిలదీస్తున్నారు.

వెసులుబాటు కోసమే..

సీనియర్లను కాదని జూనియర్లకు కొన్ని చోట్ల సీఎస్, డీవో బాధ్యతలు అప్పగించిన మాట వాస్తవమే. అయితే, సీనియర్లు సమర్థులు కాకపోవడం వల్లే కొన్నిచోట్ల వారిని కాదని జూనియర్లకు కేటాయించిన మాట వాస్తవమే. అంతే తప్ప మేమెక్కడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించ లేదు. పరీక్షల నిర్వహణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగానే సాగుతోంది. విధుల కేటాయింపు సైతం నిబంధనలకు లోబడే జరిగింది.
– జనార్దన్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి

- జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని ముగ్గురు విద్యాధికారులు ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా ఉన్నారని విమర్శలు వస్తున్నాయి. టీచర్ల పైరవీలకు లొంగి వీరు ఇష్టానుసారంగా విధులు కేటాయింపులో కీలకంగా వ్యవహరిస్తున్నారని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

లక్ష్యం చేరలే..!

- పన్ను వసూళ్లలో టార్గెట్ చేరుకోని హుజూరాబాద్, జమ్మికుంట బల్దియాలు
- హుజూరాబాద్‌లో 74శాతం, జమ్మికుంటలో 87 శాతం వసూళ్లు


హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం

హుజూరాబాద్: గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను వసూలు లక్ష్యం చేరుకోలేదు. హుజూరాబాద్ బల్దియాలో రూ.3.51 కోట్లు వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్న అధికారులు 74.89 శాతం మాత్రమే వసూలు చేశారు. మున్సిపల్ పన్నుల జాబితాలో ఆస్తి పన్ను, నాన్ టాక్సెస్‌కు సంబంధించిన మొత్తాలను వసూలు చేయాల్సి ఉంది. ఇక జమ్మికుంట మున్సిపల్‌లో రూ.3.35 కోట్లు టార్గెట్ పెట్టుకోగా 87.17శాతం పన్ను వసూలైంది.

స్పెషల్ డ్రైవ్ చేపట్టినా..

హుజూరాబాద్, జమ్మికుంట పురపాలికల పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులు మార్చిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా హుజూరాబాద్‌లో 11, జమ్మికుంటలో 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు రోజూ ఉదయం 8 గంటల నుంచే పన్నుల వసూళ్లు చేపట్టారు. హుజూరాబాద్ పరిధిలో మొత్తం రూ.3,51,64,000 బకాయిలు డిమాండ్ ఉండగా, నెల వ్యవధిలో రూ.2,63,37,000 వసూలైంది. జమ్మికుంటలో రూ.3,35,67,000 డిమాండ్ ఉండగా రూ.2,92,61,000 వసూలైంది. అయితే మార్చి 31 వరకు లక్ష్యం పూర్తి చేయాల్సి ఉండగా, అధికారులు ఈ నెల 9 వరకు గడువు పెంచి పన్ను వసూళ్లు చేపట్టినా లక్ష్యం పూర్తి కాలేదు.

పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి



హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో 74శాతం పన్ను వసూలు చేయడం జరిగింది. పాత బకాయి లేకుండా ఈ ఏడాదికి సంబంధించి పన్ను చెల్లించే వారికి 5 శాతం తగ్గింపు అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో బల్దియాకు పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. – సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చినా..

హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాల్టీల పరిధిలో ఆస్తి పన్ను రూ.10 వేలకు పైగా బకాయిలు ఉండి, సకాలంలో చెల్లించనివారికి అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. పన్ను చెల్లించాలని మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి ఒత్తిడి తెచ్చినా వసూలు లక్ష్యం చేరుకోలేదు.

మండలాల వారీగా జన సమీకరణ చేపట్టాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్: రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జన సమీకరణ ఏర్పాట్లపై నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల14న హైదరాబాదులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నియోజవర్గం నుంచి 300 మంది పాల్గొనేలా మండలాల వారీగా జన సమీకరణ చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గానికి ఆరు బస్సులు ఏర్పాటు చేసి ప్రతీ బస్సులో ఒక లైజన్ అధికారికి కార్యక్రమంలో పాల్గొని తిరిగి మండల కేంద్రాలకు చేరేవరకు బాధ్యతలు అప్పగించాలన్నారు. ఎంపీడీవో, ఎంపీఓ, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులను లైజన్ అధికారులుగా నియమించాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చే వారికి బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, వాటర్ బాటిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం కోసం తీసుకెళ్లే వాహనాలకు ఫ్లెక్సీలు అమర్చాలని, ఎస్కార్ట్ సిబ్బంది ఉండాలన్నారు. సమావేశంలో సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈఓ ప్రియాంక, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, డీఆర్‌డీఓ శ్రీలత, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి నాతనియల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర తెలంగాణకు గేట్ వేగా కరీంనగర్


తెలంగాణ చౌక్‌లో జంక్షన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్ తదితరులు

- పూర్తయిన అప్రోచ్ రోడ్డు పనులు
- తుదిదశకు డైనమిక్ లైటింగ్ సిస్టం
- ఈనెల 14న కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గంగుల

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కలల వారధి కేబుల్ బ్రిడ్జిని ఈ నెల 14న ప్రారంభిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. ఉత్తర తెలంగాణకు కరీంనగర్ గేట్ వేగా నిలవనుందన్నారు. సోమవారం కేబుల్ బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడుతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానేరు నదిపై రూ.224 కోట్లతో చేపట్టిన కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, అప్రోచ్ రోడ్డు పనులు డైనమిక్ లైటింగ్ సిస్టం పనులు తుదిదశకు చేరుకున్నాయని చెప్పారు. కేబుల్ బ్రిడ్జి ప్రారంభం తర్వాత ప్రతీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తామని వెల్లడించారు. కొద్ది రోజుల పాటు క్రాకర్ షోలు, లెజర్ షోలు, ఫుడ్ ఫెస్టివల్‌తోపాటు బ్రిడ్జికి ఇరువైపుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రూ.6.5 కోట్లతో డైనమిక్ లైటింగ్ పనులు పూర్తవుతున్నాయన్నారు. మానేరు రివర్ పనులు కూడా చురుకుగా సాగుతున్నాయని.. మరో ఆరు నెలల్లోనే పూర్తవుతాయని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు వేణు, రమణారావు, యాదయ్య, శ్రీనివాస్, ప్రశాంత్, రవివర్మ, నవీన్, సూర్యశేఖర్, వరప్రసాద్, వెంకట్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌక్ జంక్షన్‌కు నూతన హంగులు

కరీంనగర్‌లోని చౌరస్తాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మంత్రి గంగుల వెల్లడించారు. తెలంగాణ చౌక్‌లో ఐలాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్ణీత గడువులోగా ఐలాండ్ పనులు పూర్తి కావాలని అధికారులకు సూచించారు. జంక్షన్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాక ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తాయని అన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు ప్రకటనలో తెలిపారు. నగరంలోని గీతాభవన్ చౌరస్తా సమీపంలో గల పద్మనాయక కల్యాణమండపం ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఫార్మసి, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ చదివిన అభ్యర్థులు దాదాపు 5వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. విప్రో, జెన్ ప్యాక్, టాటా సర్వీసెస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ, ఇండిగో ఎయిర్ లైన్స్, గూగుల్ పే, రిలయన్స్ జియోలతో పాటు దాదాపు 120 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పేషెంట్‌ను ఇచ్చుకో.. కమీషన్ పుచ్చుకో..!

- ప్రైవేటు ఆసుపత్రుల వలలో జిల్లా ఆసుపత్రి సిబ్బంది
- రోగుల కోసం మార్కెటింగ్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న వైనం
- కమీషన్ల కోసం అడ్డదారులు

'నగరంలోని కశ్మీర్‌గడ్డకు చెందిన 65 ఏళ్ల మైసయ్య శనివారం రాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లి కాలుజారి పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రికి రాగానే అక్కడ ఉన్న సిబ్బంది వైద్యులెవరూ అందుబాటులో లేరని, ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లమని సలహా ఇచ్చారు. కాగా డబ్బులకంటే ప్రాణం ముఖ్యమని భావించిన సదరు పేషెంట్ కుటుంబ సభ్యులు సిబ్బంది మాటలు నమ్మి ఉచిత వైద్యాన్ని కాదని ప్రైవేటుకు వెళ్లారు. ఇలా రోజూ పేదలైన రోగులను కమీషన్ల కోసం ప్రైవేటుకు పంపుతూ అందినకాడికి దండుకుంటున్నారు.'


జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి

కరీంనగర్‌టౌన్: కంచె చేను మేసిన చందంగా తయారైంది జిల్లా ఆసుపత్రి పరిస్థితి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చికిత్స కోసం వచ్చే పేషెంట్లను ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. కమీషన్ల కోసం రోగులు ఆస్తులు అమ్ముకునేలా చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రులు ఎక్కువ కావడంతో పోటీ పెరిగింది. వచ్చిన పేషెంట్లను వచ్చినట్లు తరలించుకుపోయేందుకు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పన్నాగం వేశాయి. ఒకడుగు ముందుకు వేసి ఏకంగా జిల్లా ఆసుపత్రి సిబ్బందినే మార్కెటింగ్ ఏజెంట్లుగా నియమించుకొని దందా కొనసాగిస్తున్నాయి. మరికొంత మందికి కమీషన్లు ఇస్తూ పేషెంట్లను ప్రైవేటు ఆసుపత్రులకు పంపించేలా మభ్యపెడుతున్నాయి.

అడిగినంత వేతనం, కమీషన్..

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు మార్కెటింగ్ ఏజెంట్లుగా నియమించిన వారికి అడిగినంత వేతనం ఇవ్వడంతో పాటు పేషెంట్లను పంపించినప్పుడు బిల్లుల నుంచి కమీషన్లు ఇస్తున్నారు. దీంతో జిల్లా ఆసుపత్రి సిబ్బంది పేషెంట్లను పంపించడం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లను భయపెట్టి, ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. కమీషన్లు దండుకోవడం కోసం నిరుపేదలను ఆర్థిక దోపిడీ చేస్తున్నారు.

కింది స్థాయి సిబ్బందే టార్గెట్..

జిల్లా ఆసుపత్రిలో పనిచేసే కిందిస్థాయి సిబ్బందే లక్ష్యంగా ప్రైవేటు ఆసుపత్రులు పేషెంట్ల కోసం చక్రం తిప్పుతున్నాయి. సిబ్బందికి డబ్బులు ఎరవేసి వారి దారికి తెచ్చుకుంటున్నాయి. మార్కెటింగ్ ఏజెంట్లుగా నియమితులైన సిబ్బంది పేషెంట్లను మభ్యపెట్టి లేదా భయపెట్టి ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తున్నారు. అందుబాటులో అంబులెన్స్‌లను సైతం ఉంచుతున్నారు. కొద్ది రోజులు పేషెంట్లను పంపిన తర్వాత సదరు సిబ్బందే స్వతహాగా అంబులెన్స్ కొనుగోలు చేసి పేషెంట్లను తరలించడం సర్వ సాధారణంగా మారింది. ఇలా ఆసుపత్రిలో పనిచేసే ఐదారుగురు సిబ్బందికి సొంత అంబులెన్స్‌లు ఉన్నట్లు సమాచారం.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

కిందిస్థాయి సిబ్బంది పేషెంట్లను ప్రైవేటు ఆసుపత్రులకు పంపించే విషయంపై బాధితులు ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, మందులు, అన్ని సౌకర్యాలు ఉన్నాయి. పేషెంట్లు ఇతరుల మాటలు నమ్మి మోసపోవద్దు. – డాక్టర్ రత్నమాల, జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన దీక్ష


నిరసన దీక్షలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కరీంనగర్: ప్రభుత్వ పెన్షన్‌దారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. దామెర మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లపై సవతి తల్లి ప్రేమ చూపడం విచారకరమన్నారు. ప్రతినెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, పెన్షనర్లందరికీ నగదు రహిత మెడికల్ ట్రీట్‌మెంట్‌ను అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కల్పించాలని కోరారు. వేతన సవరణ కమిటీ (పీఆర్‌సీ) 2023ను ఆమలు చేసేందుకు వేతన కమిషన్‌ను నియమించాలన్నారు. వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, ఈ-కుబేర్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్లు శ్రీహరిరెడ్డి, శంకర్‌రెడ్డి, తాళ్లపల్లి అంజయ్య, రాయమల్లు, నరేందర్, రామచంద్రారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పది' విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



కరీంనగర్: జిల్లాలో పదోతరగతి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్ఖానాగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడుతో కలిసి సోమవారం పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు ప్రశాంతంగా రాయాలని, ఎటువంటి ఇబ్బందులున్నా ఇన్విజిలేటర్లకు తెలియజేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటిని అందుబాటులో ఉంచాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను, సెల్‌ఫోన్లను విద్యార్థులు, సిబ్బంది, మరెవరూ తీసుకురాకుండా చూడాలన్నారు.

రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు 'ఉమ్మడి' రెజ్లర్లు



కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో మంగళవారం జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ -17 కేడెట్ బాలబాలికల రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపిక పోటీలను సోమవారం ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు హాజరవగా ఉత్తమంగా రాణించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జాబితాను అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రమేశ్ రెడ్డి, మహమ్మద్ కరీంలు ప్రకటించారు. బాలుర గ్రీకో రోమన్, ఫ్రీ స్టైల్ విభాగంలో ఎ.హరీశ్, మహమ్మద్ షహెజాన్, ఎం.ప్రణయ్, ఈ.మహీధర్, రాజేశ్, సాయితేజ, సీహెచ్.విశ్వనాథ్, సీహెచ్.రాహుల్, బాలికల విభాగంలో ప్రణవి, సౌజన్యలు ఎంపికైనట్లు తెలిపారు.

అయిదో రోజు 26 మంది గైర్హాజరు

కరీంనగర్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సామాన్య శాస్త్ర పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 12,145 మందికి గాను 12,124 మంది హాజరుకాగా 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. ప్రైవేట్ విద్యార్థులు 26 మందికి గాను 21 మంది హాజరవగా ఐదుగురు గైరాజరైనట్లు పేర్కొన్నారు. అయిదు ప్రత్యేక తనిఖీ బృందాలు 27 పరీక్షా కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్ ఒక పరీక్షా కేంద్రాన్ని, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం అయిదు కేంద్రాలను, ఈడీవో నాలుగు కేంద్రాలను మొత్తం 37 పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు చెప్పారు.

మాయం చేశారా?

- మాయమయ్యాయా?
- మిస్సయిన స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు!
- ఐదు గంటలపాటు అధికారుల అవస్థలు

జగిత్యాల: జిల్లాలోని మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఉందని కొందరు, సాంకేతిక కారణాలు అయి ఉండొచ్చని అధికారులు, కావాలనే ఇలా చేస్తున్నారని బాధితుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరస్పర ఆరోపణలకు దిగడం ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. అయితే, తాళపు చెవులు కావాలనే మార్చారా? లేక మాయం చేశారా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరించారా? లేక మరోదైనా కారణం ఉందా? అనే దానిపై జిల్లావ్యాప్తంగా చర్చ జోరందుకుంది.

వివాదాస్పదమైన స్వల్ప ఆధిక్యం..

జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌ను మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై టీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్వల్ప ఆధిక్యం(441ఓట్ల మెజారిటీ)తో గెలుపొందారు. అయితే, కౌంటింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు అవసరమైన డాక్యుమెంట్లను హైకోర్టుకు మంగళవారం సమర్పించాల్సి ఉంది.

స్ట్రాంగ్‌రూముల్లో ఏముంది?

- మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్‌కాలేజీ(మూతపడ్డది)లోని మూడు గదుల్లో ఎన్నికల సామగ్రి భద్రపర్చారు.
- మొదటి గదిలో 001 నుంచి 107వ నంబరు వరకు, రెండోగదిలో 108 నుంచి 269వ నంబరు వరకు ఈవీఎంలు భద్రపర్చారు.
- మూడోగదిలో సీసీ కెమెరాలు, సీసీ ఫుటేజీలు, వీవీప్యాట్లు, పలు డాక్యుమెంట్లు, ఇతర ఎన్నికల సామగ్రి ఉంచారు.
- సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో మొదటి, రెండో గది తాళాలు తీయగా, అందులోని ఈవీఎంలు కనిపించాయ.
- ఆ తర్వాత మూడోగది తాళం తీసేందుకు యత్నించగా అది మొరాయించింది.
- ఇక్కడే అసలు సమస్య మొదలైంది. మూడో గది తాళపు చెవి పనిచేయలేదా?లేక దానిస్థానంలో మరోటి తీసుకొచ్చారా? కావాలనే ఎవరైనా ఇలా చేశారా? లేక సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.





స్ట్రాంగ్‌రూమ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, స్ట్రాంగ్‌రూమ్ తాళం తెరిచేందుకు ప్రయత్నిస్తున్న అధికారి

అధికారుల అవస్థలు..

కోర్టు అడిగిన 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్ల కోసం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, అప్పటి ఎన్నికల అధికారి భిక్షపతి సోమవారం నూకపల్లి వెళ్లారు. అక్కడి మొదటి స్ట్రాంగ్‌రూమ్ తాళాన్ని 786006 నంబరు 'కీ'తో తెరిచారు. రెండోగది తాళాన్ని కూడా 786402 నంబరు 'కీ'తో తెరిచారు. కానీ, 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్లు భద్రపర్చిన గది తాళాన్ని 786051 నంబరు 'కీ'తో తెరిచేందుకు యత్నించినా అది ఎంతకూ ఓపెన్ కాలేదు. దాదాపు ఐదు గంటలపాటు అధికారులు నానాతంటాలు పడినా తాళం తెరుచుకోలేదు. దీనిపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతినెలా 3వ తేదీన తనిఖీ

స్ట్రాంగ్‌రూమ్ గదులను ప్రతినెలా మూడోతేదీన కలెక్టర్ నేతృత్వంలో అధికారులు తనిఖీ చేస్తున్నారు. తొలుత 2018లో అప్పటి కలెక్టర్ శరత్ ప్రతినెలా మూడోతేదీన స్ట్రాంగ్‌రూములు తనిఖీ చేశారు. ఆ తర్వాత గుగులోతు రవి, ప్రస్తుతం షేక్ యాస్మిన్‌బాషా కూడా తరచూ గదులు తనిఖీ చేస్తున్నారు. కానీ, ఎవరూ తాళాలు తెరిచిచూడలేదు. కలెక్టర్లు బదిలీపై వెళ్లిన ప్రతీసారి ఇక్కడకు వచ్చే కలెక్టర్‌కు స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు అప్పగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒకగది తాళపు చెవి పనిచేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'అడ్లూరి' ఆందోళన..

మూడుగది(స్ట్రాంగ్‌రూమ్) తాళం తెరుచుకోకపోవడంపై కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తాళం పగులగొడతామని ఉన్నతాధికారులు చెప్పడంతో అడ్లూరి అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులపై ఆయన తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాక తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. దీంతో ఐదుగంటలపాటు అధికారులు నిరీక్షించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ, తాళంచెవి ఉన్నా.. తాళం రావడంలేదని, ఈవిషయాన్నే హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్ తరఫున డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వీరి సమక్షంలోనే తాళాలు తెరిచే ప్రక్రియ చేపట్టారు.

తేనెటీగల దాడి..

వీఆర్‌కే కళాశాల వద్ద ఉన్న అధికారులు, పాత్రికేయులపై తేనెటీగలు దాడిచేశాయి. దీంతో అధికారులు బయటకు పరుగులు తీశారు. కొందరు కార్ల డోర్లు తెరిచి లోనికి వెళ్లగా, మరికొందరు దూరంగా పరుగులు తీశారు. చాలారోజులుగా కాలేజీ మూసిఉండడంతో భవనం చుట్టూ తేనెతెట్టులు ఏర్పాటు చేసుకున్నాయి. జనం రద్దీ అధికం కావడంతో తేనెటీగలు దాడిచేసినట్లు భావిస్తున్నారు.

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాజిదా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 3, 9, 14, 19, 20, 21, 25, 29, 34, 48, 50, 58వ డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలోని 18, 25వ వార్డుల్లో, మండలంలోని మందాడిపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాల్లో, జమ్మికుంట పట్టణంలోని 12వ వార్డు, మండలంలోని బిజిగిరి షరీఫ్, మడిపల్లిల్లో, వీణవంక మండలంలోని గన్ముక్కుల, దేశాయిపల్లి, హిమ్మత్‌నగర్‌లలో, చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఓగులాపూర్‌లలో, చొప్పదండి 14వ వార్డు, మండలంలోని సాంబయ్యపల్లి, రాగంపేటల్లో, ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లెలో, గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, రంగారావుపల్లిల్లో, రామడుగు మండలంలోని వెలిచాల, రంగసాయిపల్లి గ్రామాల్లో, కొత్తపల్లి మండలంలోని బొమ్మకల్, మల్కాపూర్, బద్దిపల్లిల్లో, కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి, నగునూర్‌లలో, మానకొండూరు మండలంలోని అన్నారం, కొండపల్కల, పోచంపల్లిల్లో, సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో, కేశపట్నం మండలంలోని ఆర్కండ్ల, మొలంగూర్, ఆముదాలపల్లిల్లో, తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, పర్లపల్లిల్లో, గన్నేరువరం మండలంలోని కాసింపేటలో కంటి వెలుగు బృందాలు పని చేస్తాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సమస్యలపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో 180 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులతో వచ్చే అర్జీదారుల ద్వారా వారి సమస్యను తెలుసుకుంటూ తగిత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈఓ ప్రియాంక, ఆర్డీఓలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంస్కృత జేఎల్, డీఎల్ పోస్టులు మంజూరు చేయాలి

సంస్కృత భాష జేఎల్, డీఎల్ పోస్టుల మంజూరుకు గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాటిని అమలు చేసేలా ప్రభుత్వానికి నివేదించాలని ఉమ్మడి కరీంనగర్ సంస్కృత భాషా సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

మట్టి తరలింపును ఆపండి

కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో పురెన్ గుట్ట మట్టిని అక్రమంగా తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు బండి మల్లయ్యతో పాటు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా లారీల ద్వారా మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే తనపైనే అక్రమంగా కేసు నమోదు చేశారని వాపోయాడు. కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని తనను అక్రమ కేసు నుంచి తప్పించాలని కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

ముందస్తు అడ్మిషన్లపై చర్య తీసుకోవాలి

విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ఎలాంటి అనుమతి లేకుండా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ మాట్లాడుతూ.. రేకుర్తిలోని డ్రీమ్ జూనియర్ కాలేజ్ అకాడమీ పేరుతో కళాశాలను నడిపిస్తూ విద్యార్థులను, అధికారులను మోసం చేస్తోందని ఆరోపించారు. బొమ్మకల్‌లో డ్రీమ్ కాలేజీకి అనుమతి మీద రేకుర్తిలో ఎలాంటి షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండా కాలేజీ నడిపిస్తున్నారని తెలిపారు. నారాయణ, రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు ఎలాంటి అనుమతుతి లేకుండా కలర్ ఫుల్ హోర్డింగ్‌లు పెట్టి , ఐటీ, జేఈఈ అడ్వాన్స్ కోచింగ్ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆయా కళాశాలల యాజమాన్యాలపై, పర్యవేక్షణను నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు పవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 16 అట్రాసిటీ కేసులు నమోదవగా వాటిలో 3 తప్పుడు కేసులని, మిగతావి దర్యాప్తు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్నారని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతోపాటు వారికి టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లు చేయాలని, ఎండ తీవ్రతతో ఇబ్బంది పడకుండా మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ తుల శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.పవన్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నతానియేల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్‌ఫర్మేషన్ ఇంజినీర్ కొండయ్య, జమ్మికుంట తహసీల్దార్ బి.రాజేశ్వరి, జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు మేడి మహేశ్, ఎలుక ఆంజనేయులు, కులదీప్ వర్మ, తడగొండ నర్సింబాబు, లకావత్ రవి పాల్గొన్నారు.

'ధరణి'లో ఫీజు దోపిడీ

- గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు రెట్టింపు
- 2 శాతానికి బదులు 4 శాతం స్టాంప్ డ్యూటీ
- అంతా ఆన్‌లైన్ అంటున్న అధికారులు

తిమ్మాపూర్(మానకొండూర్): ధరణి రిజిస్ట్రేషన్‌లో దోపిడీ జరుగుతోంది. ఓ వ్యక్తి తన తండ్రి నుంచి భూమిని గిఫ్టుగా తీసుకుంటూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రెట్టింపు ఫీజు ధరణి పోర్టల్‌లో చెల్లించాల్సి వచ్చింది. ఇదేమిటని సదరు రైతు ప్రశ్నించగా అటు అధికారులకు ఇటు మీసేవ నిర్వాహకులకు విషయం అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

ఎక్కువ భూమికి తక్కువ.. తక్కువ భూమికి ఎక్కువ ఫీజు

తిమ్మాపూర్ మండలంలోని పొరండ్లకు చెందిన ఎల్లాల బాల్‌రెడ్డి–బుచ్చమ్మ దంపతులకు సదానందం, రమేశ్ కుమారులు. వీరికున్న భూమిని తమ ఇద్దరు కుమారుల పేరిట గిఫ్ట్ డీడ్ చేయడానికి ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేశారు. రమేశ్‌కు రెండు శాతం స్టాంప్ డ్యూటీ ఫీజు రాగా.. సదానందంకు నాలుగు శాతం ఫీజు వచ్చింది. చేసేదేమీ లేక రిజిస్ట్రేషన్ కోసం మొత్తాన్ని చెల్లించుకోవాల్సి వచ్చింది. మార్కెట్ విలువ సమానం ఉన్నా, ఎక్కువ భూమికి తక్కువ ఫీజు, తక్కువ భూమికి ఎక్కువ ఫీజు వచ్చిన విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తాము ఏమీ చేయలేమని, అంతా ఆన్‌లైన్‌లోనే చూపిస్తోందని తహసీల్దార్ తెలిపారు.

గిఫ్ట్ డీడ్‌కు 2 శాతం స్టాంపు డ్యూటీ..

ధరణి రిజిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం.. గిఫ్ట్ రూపంలో రిజిస్ట్రేషన్ చేస్తే 2 శాతం స్టాంప్ డ్యూటీ తీసుకోవాలి. కానీ ఒకరికి మాత్రం 4 శాతం స్టాంప్ డ్యూటీ ఆన్‌లైన్‌లో చూపించడం విస్మయానికి కలిగిస్తోంది. ధరణిలో ఇంత మోసం ఉంటుందా అంటూ తల్లిదండ్రులు, కుమారులు వాపోతున్నారు. ధరణిలో దోపిడీపై బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఆలోచించి రెండు శాతం డబ్బులు వాపసు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.



సదానందంకు వచ్చిన 4 శాతం చలాన్

రూ.19 వేల నష్టం



మా నాన్న దుబాయ్ పోతుండు. అందుకే తొందరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్లాట్ బుక్ చేసుకున్నాం. కానీ నాకు రూ.19 వేల నష్టం జరిగింది. నా డబ్బులు నాకు వాపసు రావాలని కోరుతున్నా. అధికారులు చొరవ చూపి, న్యాయం చేయాలి.

– ఎల్లాల సదానందం, బాధితుడు, పొరండ్ల

కార్మికులకు శుద్ధజలం అందించాలి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలోని సింగరేణి కుటుంబాలకు శుద్ధజలం అందించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆర్జీ–2 పరిధి యైటింక్లయిన్‌కాలనీలోని ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించి, మాట్లాడారు. వారం రోజులుగా కాలనీ కార్మిక కుటుంబాలకు సరఫరా చేస్తున్న తాగునీరు పసుపు పచ్చ రంగులో వస్తోందన్నారు. ఫలితంగా వారు వాంతులు, విరోచనాలు, జాండిస్, శరీరంపై దుద్దుర్లు వంటి సమస్యలతో బాధ పడుతున్నారని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా విషయంలో సింగరేణి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలోనూ ఇదే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, శుద్ధమైన తాగునీరు అందించాలని కోరారు. లేకపోతే కార్మిక కుటుంబాలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగరేణి సివిల్ అధికారులు రాజు, రాధాకృష్ణ, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి



గోదావరిఖని(రామగుండం): పోటీ పరీక్షలు వాయిదా పడిన నేపథ్యంలో యువత ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 22 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు. అప్పు చేసి, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. పేపర్ల లీక్ ఘటన వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అందించి, ఆదుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, నర్సింహారెడ్డి, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్, రాజేందర్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల జాబితాను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు ప్రకటించారు. ఆదివారం అంబేడ్కర్ స్టేడియంలో అండర్ -20 బాలబాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15న ఉదయం 7 గంటలకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

జిల్లా జట్లు...

ఎంపికైన బాలురు.. విష్ణువర్ధన్, సీహెచ్.నాగరాజు, ఎం.వినయ్, మలుపతి, ఎం.విక్రమ్ కుమార్, ఎ.సంతోష్, ఎ.వివేకానంద, సీహెచ్.మధు, జె.రంజిత్, ఎన్.ప్రణయ్.

ఎంపికైన బాలికలు.. ఎం.సుదీక్ష, సీహెచ్.ఐశ్వర్య.

లాంగ్ స్టాండింగ్ అధికారులను బదిలీ చేయాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో ఒకే ప్రాంతంలో ఎక్కువ ఏళ్లు పని చేస్తున్న లాంగ్ స్టాండింగ్ అధికారులను వెంటనే బదిలీ చేయాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లపాటు ఒకే పోస్టింగ్‌లో అధికారులు పని చేయడం వల్ల అజమాయిషీ పెరిగి, అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. రాజకీయ నాయకులు, యూనియన్ నేతల అండదండలతో అధికార దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సంస్థ నిబంధనల ప్రకారం మూడు లేదా ఐదేళ్ల కన్నా ఎక్కువ సమయం ఒకేచోట పనిచేసే అధికారులను గుర్తించి, బదిలీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇ.నరేశ్, నాయకులు ఎం.కొమురయ్య, బాబు, యూసుఫ్, కె.మొగిలి, ఎ.చంద్రయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు .

12న టీడీపీ శంఖారావ సభ

విద్యానగర్(కరీంనగర్): ఈ నెల 12న కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో టీడీపీ శంఖారావ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు వంచ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతోపాటు నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపేందుకే సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, విశిష్ట అతిథులుగా పార్టీ రాష్ట్ర పరిశీలకుడు కంభంపాటి రామ్మోహన్‌రావు, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధులు నన్నూరి నర్సిరెడ్డి, తిరునగరి జ్యోత్స్న తదితరులు హాజరవుతారని తెలిపారు. 12న ఉదయం 11 గంటలకు మానేరు బ్రిడ్జి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం నుంచి సభాస్థలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు కల్యాడపు ఆగయ్య, దామెర సత్యం, జంగం అంజయ్య, ఎడ్ల వెంకటయ్య, బత్తుల శ్రీనివాస్, పర్లపల్లి రవీందర్, రొడ్డ శ్రీధర్, సందబోయిన రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీలు వేసవిలోనే చేపట్టాలి

కరీంనగర్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు వేసవి సెలవుల్లోనే ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రాజేశ్వర్, గన్నమనేని రంగారావులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ క్లియర్ చేయాలని, వేతనాలు మొదటి తేదీన వచ్చేలా చొరవ చూపాలని కోరారు. పీఆర్‌సీ ఏర్పాటు చేయడంతోపాటు జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, హెల్త్ కార్డులు అన్ని ఆసుపత్రుల్లో పనిచేసేలా ప్రభుత్వానికి నివేదించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు తిరుపతిరావు, వినయధర్‌రాజు, అచ్యుత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణరావు, శ్రీనివాస్, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని బాలాజీపురకు చెందిన ఎల్లుటపు నరేష్‌కు విద్యుత్ చౌర్యం కేసులో జైలుశిక్ష, జరిమానా పడినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2017లో నరేష్ తన ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వాడుతూ అధికారులకు పట్టుబడ్డాడు. మొదటి తప్పుగా భావించి, వారు రూ.2 వేల జరిమానా విధించి, వదిలేశారు. మళ్లీ 2018లో విద్యుత్‌ను అక్రమంగా వాడుతూ పట్టుబడగా విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేసి, అతన్ని జగిత్యాల జిల్లా కోర్టులో ప్రవేశపెట్టారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి వీరయ్య కేసు పూర్వాపరాలు పరిశీలించి, నిందితుడు అక్రమంగా విద్యుత్ వినియోగించినట్లు నిర్ధారించారు. అతనికి రూ.33,552 జరిమానా, ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కరీంనగర్ విజిలెన్స్ ఎస్సైలు నిరంజన్ రెడ్డి, నరేష్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

జిల్లా గ్రంథాలయం సందర్శన



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న రవిశంకర్

కరీంనగర్‌కల్చరల్‌: కరీంనగర్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ సోమవారం సందర్శించారు. ఉద్యోగాలు సాధించేందుకు సంసిద్ధమవుతున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్‌ పొన్నం అనిల్‌ కుమార్‌గౌడ్‌, తెలంగాణ రాష్ట్ర మెడికల్‌ కౌన్సిల్‌ మెంబర్‌ డాక్టర్‌ అమిత్‌కుమార్‌, కార్యదర్శి సరిత, పాచరేల బందారపు అజయ్‌, దూలం సంపత్‌ తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహం పరిశీలన



విగ్రహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): కరీంనగర్‌లోని విద్యానగర్‌ వాటర్‌ట్యాంకు వద్ద ఉన్న దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి పక్కకు పెట్టగా.. సోమవారం తెలంగాణ బీసీ కుల సంఘాల నాయకులు జీఎస్‌ ఆనంద్‌ పడిపోయిన విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహాన్ని కూలగొట్టిన వారిపై కఠిన చర్య తీసుకోవాలని, జిల్లాలో దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠాపించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిసెల రమేశ్‌, కడారి ఐలయ్య, సాగరం వెంకటేష్‌, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌ సమస్యలు పరిష్కరించాలి

విద్యానగర్‌(కరీంనగర్‌): ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలు, ఎస్సీ, ఎస్టీ రైతుల దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్‌ వెన్న రాజమల్లయ్య సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ రైతుల దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండడం వల్ల రైతుబంధు, రైతుబీమా, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వీలు లేకుండా పోయిందని పేర్కొన్నారు. వెంటనే ధరణి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడికి సన్మానం



రఘునందన్‌రావును సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఎన్నికైన రఘునందన్‌రావును సోమవారం ఈస్ట్‌ జోన్‌ బీజేపీ కార్యాలయంలో జోన్‌ అధ్యక్షుడు అవుదుర్తి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ల రమేశ్‌, దిండిగాల మధు, చింతల కిషన్‌, పోరెడ్డి శ్రీధర్‌, తోట సాగర్‌, ఉమామహేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం మరమ్మతు పనులు చేయాలి

రామడుగు: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో సోమవారం జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, బీఎస్‌ఎన్‌ఎల్‌ టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యురాలు మామిడిపల్లి చైతన్య ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం మోతె గ్రామ శివారులో భారీ వర్షాలతో తెగిన చెక్‌డ్యాంను పరిశీలించి ప్రభుత్వం త్వరగా మరమ్మతు పనులు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు మహేందర్‌రెడ్డి, నర్సింగరావు, తిరుపతి, శ్రీనివాస్‌, రాజు, పర్శరాములు, మధు, ఉపసర్పంచ్‌ మహేష్‌ పలువురు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఎన్నికలు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌ గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఒంటెల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అల్లెపు శ్రీనివాస్‌ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రమణారెడ్డి, అజయ్‌రెడ్డి, కోశాధికారిగా నర్సింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ముష్కె వెంకట్‌ రెడ్డి, అప్పిడి శ్యాంసుందర్‌ రెడ్డిలు నియామకమయ్యారు.

లైసెన్స్‌ ఇక కాగితరహితం

- ఆన్‌లైన్‌లో వ్యవసాయ దుకాణాలు



కరీంనగర్‌ అర్బన్‌: వ్యవసాయ దుకాణాలు ఇక ఆన్‌లైన్‌లో చేరనున్నాయి. ఇప్పటికే సదరు ప్రక్రియ పూర్తవగా త్వరలో అందుబాటులోకి రానుంది. లైసెన్స్‌ల జారీ కాగిత రహితంగా సాగనుంది. సాగు రంగానికి విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలే కీలకం. వారిచ్చే వాటితోనే అన్నదాతలు ఆయా పంటలు సాగు చేస్తుంటారు. ఈక్రమంలో అధిక ఉత్పత్తి సాధించాలంటే సరైన విత్తనాలు, పురుగు మందుల వినియోగమనేది కీలకం. అయితే అన్నదాతలు నాసిరకం విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసి దిగుబడి రాక గతంలో ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలున్నాయి. సదరు అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పక్కా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా నాణ్యమైన వాటినే అన్నదాతలకు అమ్మేలా సదరు దుకాణాదారులకు లైసెన్స్‌లను జారీ చేసి అమ్మకాలు జరిపేలా నిరంతరం నిఘా వేయనుంది.

గతానికి చెక్‌.. నూతనం సులువు

విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల లైసెన్స్‌లను నిర్ణీత కాలవ్యవధిలో రెన్యువల్‌ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో దుకాణ వివరాలు, సామర్థ్యం, అర్హత, ధ్రువపత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ఏవో నుంచి జిల్లా వ్యవసాయ అధికారి వరకు వాటిని పరిశీలించి జారీ చేసేవారు. కాగా పలువురు అధికారులు అమ్యామ్యాలకు అలవాటుపడగా కావాలని కొర్రీలు పెట్టేవారు. డిమాండ్‌ మేర ముడితేనే కాగితం కదిలించేవారు. దీంతో లైసెన్స్‌లు తీసుకోవడం, పునరుద్ధరణ వంటి ప్రక్రియలో డీలర్లు చాలా ఇబ్బందులు పడేవారు. ఆయా లైసెన్స్‌ల కోసం మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌ లైసెన్స్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత కాపీలతో వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లేవారు. ఈ పద్ధతి రోజులతో కూడుకోవడంతో పాటు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడేది. అయితే దీనిని సులభతరం చేసేందుకు కొన్ని మార్పులు చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ దుకాణదారుడి ఫోన్‌నంబర్‌తో నేరుగా ఆ శాఖకు చెందిన ఫర్టిలైజర్‌ లైసెన్స్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌ అనే అంతర్జాల పేజీలో లాగిన్‌ కావాలి. అక్కడే నూతనంగా, పునరుద్ధరణకు సంబంధించిన దరఖాస్తులను పూర్తి చేసి చలాను, ఇతర పత్రాలను అప్‌లోడ్‌ చేయగా పరిశీలన కోసం సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు వెళ్తుంది. దరఖాస్తు పరిస్థితిని ఎప్పటికప్పుడు అంతర్జాలంలో లాగిన్‌ ద్వారా పరిశీలించుకోవచ్చు. పరిశీలన పూర్తయిన తర్వాత దుకాణాదారుడికి నేరుగా అతడి ఫోన్‌నంబర్‌కు పీడీఎఫ్‌ రూపంలో లైసెన్స్‌ వస్తుంది. ప్రస్తుతం విత్తనాలు, ఎరువులు లైసెన్స్‌లు మాత్రమే అందుబాటులో ఉండగా మరికొన్ని రోజుల్లో పురుగుమందుల లైసెన్స్‌ కూడా ఈ విధంగానే అమలు చేయనున్నారు.

వ్యవసాయ డివిజన్ల వారీగా డీలర్ల సంఖ్య

డివిజన్‌	విత్తన డీలర్లు
కరీంనగర్‌	102
హుజూరాబాద్‌	147
మానకొండూరు	121
చొప్పదండి	95

మండలాల వారీగా విత్తన, ఎరువుల దుకాణాలు

కరీంనగర్‌ అర్బన్‌	65	గన్నేరువరం	25
కరీంనగర్‌ రూరల్‌	19	తిమ్మాపూర్‌	22
కొత్తపల్లి	18	చిగురుమామిడి	39
చొప్పదండి	24	హుజూరాబాద్‌	23
రామడుగు	35	జమ్మికుంట	53
గంగాధర	36	వీణవంక	27
మానకొండూరు	19	ఇల్లందకుంట	23
శంకరపట్నం	16	సైదాపూర్‌	21

రద్దీ వేళ.. యథేచ్ఛగా..



నగరంలోకి రద్దీ వేళల్లో భారీ వాహనాలకు అనుమతి లేకున్నా యథేచ్ఛగా వచ్చేస్తున్నాయి. సోమవారం రాజస్తాన్‌కు చెందిన భారీ కంటైనర్‌ నగరంలోని తెలంగాణ చౌక్‌కు చేరుకుంది. జంక్షన్‌ చిన్నదిగా ఉండటంతో ఈ భారీ వాహనం మూలమలుపు తిప్పే సమయంలో ట్రాఫిక్‌ జామ్‌తో ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ వేళల్లో నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వొద్దని నగరవాసులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్‌, కరీంనగర్‌

పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించండి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌

కరీంనగర్‌: కృషి, దీక్ష, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏది లేదని, నాలుగు నెలలు కఠోర దీక్షతో చదివి పరీక్షలు రాస్తే ఉద్యోగం వచ్చాక 40ఏళ్ల పాటు చీకుచింత లేకుండా ఉండవచ్చని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ అన్నారు. సోమవారం గురుకుల ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుపేద అభ్యర్థులకు షైన్‌ తెలంగాణ ఐఏఎస్‌ అకాడమీ డైరెక్టర్‌ కరీం రాజు ఆధ్వర్యంలో 'యువత కోసం వినోదన్న భరోసా' పేరిట 1,000 మందికి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాజు సేవలను కొనియాడారు. సోషల్‌ మీడియా, మీడియా ద్వారా ప్రచారం చేసి అందరికీ ఉపయోగపడేలా ఉచిత శిక్షణ రూపొందించాలని అకాడమీ యాజమాన్యానికి సూచించారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని గురుకుల ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ పేరిట సంస్థ ద్వారా ఇంత గొప్ప ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ పొన్నం అనిల్‌ కుమార్‌ గౌడ్‌, రాష్ట్ర మెడికల్‌ కౌన్సిల్‌ మెంబర్‌ డాక్టర్‌ అమిత్‌కుమార్‌, కార్పొరేటర్‌ వాల రమణారావు, బీఆర్‌ఎస్‌ యూత్‌ నాయకులు కులదీప్‌ ధీకొండ, బందారపు అజయ్‌ కుమార్‌ గౌడ్‌, దూలం సంపత్‌ గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగిస్తే లైసెన్సులు రద్దు

- మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మధు



మాట్లాడుతున్న రెడ్డవేని మధు

కరీంనగర్‌: రైతులకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా వ్యాపారులు కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని, మామిడి రైతులకు ఇబ్బంది కలిగిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రెడ్డవేని మధు అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ కార్యాలయంలో లైసెన్సుడు వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మార్కెట్‌ కమిటీ పాలకవర్గం వ్యాపారులకు మామిడి కొనుగోలు కోసం యార్డులో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించిందని తెలిపారు. ప్రస్తుతం రద్దీ ఎక్కువగా ఉన్నందున ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సవ్యంగా మార్కెట్‌ను ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. నిషేధిత రసాయనాలను మామిడికాయల ప్యాకింగ్‌లో వినియోగించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న పిల్లలతో మామిడి కాయల లోడింగ్‌, అన్‌ లోడింగ్‌, ప్యాకింగ్‌ వంటి పనులను చేయించవద్దన్నారు. వ్యాపారులు మార్కెట్‌కు చెల్లించాల్సిన ఫీజు, బకాయిలను తక్షణమే చెల్లించాలని తెలిపారు. పోలీసులు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తారని అన్నారు. ఈ సమావేశంలో వైస్‌ చైర్మన్‌ ఉప్పు రాజశేఖర్‌, మార్కెట్‌ కమిటీ కార్యదర్శి పురుషోత్తం, త్రీటౌన్‌ సీఐ దామోదర్‌రెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

కొత్తపల్లి: ఇండియన్‌ టాలెంట్‌ ఒలింపియాడ్‌, ముంబై ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గణితం, సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ సంజయ్‌ భట్టాచార్య తెలిపారు. గణిత ఒలింపియాడ్‌లో 6వ తరగతికి చెందిన వి.హర్షిణి రాష్ట్రస్థాయిలో 4వ స్థానం, 7వ తరగతికి చెందిన అర్హాన్‌ లతీఫ్‌ రాష్ట్రస్థాయిలో 6వ స్థానం, 8వ తరగతికి చెందిన కె.శ్రేయాన్స్‌ రాష్ట్రస్థాయిలో 16వ స్థానం, సైన్స్‌ ఒలింపియాడ్‌లో 7వ తరగతికి చెందిన పి.రిధి రాష్ట్రస్థాయిలో 16వ స్థానం, 6వ తరగతికి చెందిన జి.సంతోష్‌ రాష్ట్రస్థాయిలో 17వ స్థానం, 8వ తరగతికి చెందిన ఆర్‌.హాసిని రాష్ట్రస్థాయిలో 18వ స్థానం పొందినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి మొదటి 20 స్థానాల్లో ఆరు స్థానాలు పారమిత విద్యార్థులు కైవసం చేసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన విద్యార్థులను పారమిత పాఠశాలల చైర్మన్‌ ఇ.ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్‌, వినోద్‌రావు, ప్రసాద్‌, ప్రోగ్రాంహెడ్‌ గోపీకృష్ణ, సమన్వయకర్తలు లక్ష్మీదీప్తి, రబీంద్ర పాత్రో, హరిప్రియ, ప్రదీప్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి పెంచాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలి పెంచాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్‌ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి కార్పొరేట్‌ సంస్థలకు కొమ్ముకాస్తూ ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసిందని అన్నారు. ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేసి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందని తెలిపారు. గ్రామాల్లో యువతకు ఉపాధి లేకుండా పోయిందని, విద్యావంతులైన యువతీ యువకులు ఉపాధి హామీ పనులకు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉపాధి కూలి పెంచి వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, పెన్షన్లు, నూతన రేషన్‌ కార్డులు అందజేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దరిపెల్లి అంకుస్‌, జిల్లా కోశాధికారి విలాసారం ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు పెంచల భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనం.137లోని ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ జరిపించాలని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, ఇకనైనా విచారణ చేపట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌ నల్ల వెంకట్‌రెడ్డికి సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కమాన్‌పూర్‌ శివారులో ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకొని ఉన్న సర్వేనం.137లో పట్టాదారులకు 1964లో 17 గుంటల భూమి ఉండగా, ప్రస్తుతం రహదారి విస్తరణలో భాగంగా 8 గుంటల భూమి పోగా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా సదరు పట్టాదారు తీసుకున్నట్లు తెలిపారు. అయితే 2000–21 సంవత్సరం రికార్డులో 27 గుంటల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారని, దీనిని ఆధారంగా చేసుకొని రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు పట్టాదారుల నుంచి భూమి కొనుగోలు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. పట్టాదారు భూమి పక్కనున్న 116 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కలుపుకొని కబ్జాకు పాల్పడ్డారని తెలిపారు. ఈ ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బోనాల మునీందర్‌, ఆరె అనిల్‌, బోనాల తిరుమల్‌, ఆకుల శంకరయ్య, బోనాల రాజేశం, రుద్ర రాజుకుమార్‌, బోనాల సంపత్‌, అరిగెల మల్లేశం తదితరులు విజ్ఞప్తి చేశారు.

కొత్తపల్లిలో 'బలగం' ప్రదర్శన



బలగం సినిమా వీక్షిస్తున్న ప్రజలు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని 3, 5, 6, 11, 12 వార్డుల్లో 'బలగం' చిత్ర ప్రదర్శన చేపట్టారు. ఆయా వార్డుల ప్రజలు, కౌన్సిలర్లు పాల్గొని చిత్ర ప్రదర్శనను తిలకించారు. సోమవారం రాత్రి ఆరో వార్డు పరిధిలోని సంఘం చౌరస్తాలో ప్రదర్శించిన ఈ చిత్రాన్ని మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజుతో పాటు పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు, ప్రజలు వీక్షించారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరాహార దీక్ష

గన్నేరువరం: గన్నేరువరం మండలం మైలారం మైసమ్మ గుట్ట నుంచి కరీంగనర్‌ శ్మశానవాటిక వరకు లోయర్‌ మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మించాలని బ్రిడ్జి నిర్మాణ పోరాట సాధన సమితి చైర్మన్‌ సంపతి ఉదయ్‌ కోరారు. తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, యువజన నాయకులు మద్దతూ తెలిపారు. గత పార్లమెంట్‌ ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాలుగేళ్లు గడిచినా ఎలాంటి స్పందన లేదన్నారు. కరీంనగర్‌కు వెళ్లాలంటే 40 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే గన్నేరువరం మండలంతో పాటు సిద్దిపేట, రాజన్న సిరిసిల్లా జిల్లాలోని బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు ఎంతో అనువుగా ఉంటుందని తెలిపారు. విద్య, ఇతరాత్ర పనులకు మండలాల్లోని ప్రజలు వెళ్లాలంటే దూరం తగ్గడంతో పాటు ఈ మండలాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని, అలాగే పర్యాటక కేంద్రంగా గుర్తింపు వస్తోందన్నారు. అనంతరం సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ తహసీల్దార్‌ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రిడ్జి పోరాట సాధన సమితి సభ్యులు పుల్లెల రాములు, పుల్లెల జగన్‌, కయ్యం సంపత్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, పుల్లెల రాములు, పుల్లెల జగన్‌, కయ్యం సంపత్‌, రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బామండ్ల రవీందర్‌, వెంకటేశం, అటికం రామచంద్రం, నాగరాజు, మహేష్‌, లక్ష్మణ్‌, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకే 'దళితబంధు'

వీణవంక: దళితులు ఆర్థికంగా ఎదిగేందుకే సీఎం కేసీఆర్‌ దళితబంధు పథకం ప్రవేశపెట్టారని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి పథకం కింద మంజూరైన యూనిట్‌ వ్యవసాయ డ్రోన్‌ను సోమవారం ప్రాంభించారు. వీణవంక నుంచి లస్మక్కపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయ పొలాల్లో డ్రోన్‌ పనితీరును పరిశీలించారు. దళితబంధు వంటి పథకం దేశానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, వైస్‌ ఎంపీపీ రాయిశెట్టి లత, సర్పంచ్‌ నీల కుమారస్వామి, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ కట్కూరి మధుసుదన్‌రెడ్డి, యాసిన్‌ తదితరులు ఉన్నారు.

'తిమ్మాపూర్‌'ను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఎంపీపీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

తిమ్మాపూర్‌: ఇటీవల జాతీయ పంచాయతీ అవార్డులకు తిమ్మాపూర్‌ మండలం ఎంపిక కావడం హర్షనీయమని ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలగిరి దివ్యదర్శన్‌రావు అన్నారు. మండలాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో జిల్లాలోని ప్రతి మండలానికి ఏదో ఒక స్థాయిలో అవార్డు తీసుకురావడానికి ఎంపీడీవోలు కృషి చేయాలన్నారు. అనంతరం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌, తిమ్మాపూర్‌ ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డిని మండల పరిషత్‌ అభివృద్ధి సంఘం తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. తిమ్మాపూర్‌ ఎంపీపీ, ఎంపీడీవోలు ఈనెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈడ బోయిన శ్రీనివాస్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

డ్రైనేజీ పనులు ప్రారంభం



రామడుగు: మండలంలోని కోరటపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులను సోమవారం ఎంపీపీ కలిగేటి కవిత ప్రారంభించారు. సర్పంచ్‌ మన్నే దర్శన్‌రావు, ఏఈ సచిన్‌, కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

మానకొండూర్‌/మానకొండూర్‌రూరల్‌: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి సాజిదా అతహరి అన్నారు. నార్మల్‌ డెలివరీ లాభాలను గర్భిణులకు వివరించాలన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. హాస్పిటల్‌లో సిబ్బంది పనితీరుని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్‌ బియాబని, సిబ్బంది ఇజాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో బీరప్ప ఉత్సవాలు ప్రారంభం



బీరప్ప చరిత్ర వివరిస్తున్న ఒగ్గు కళాకారులు

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్‌ గ్రామంలో బీరప్పస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయం ముందు ఒగ్గు కళాకారులు పెద్దపట్నం వేశారు. నాలుగు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో మొదటి రోజు స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. బుధవారం నాగవెల్లి ఉంటుందని, వివిధ వేషధారణలతో బీరప్పస్వామి ప్రాశస్త్యాన్ని ఒగ్గు కళాకారులు వివరించారు. కాగా ఆలయాన్ని నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పెద్దపల్లి భవానిఅరుణ్‌కుమార్‌, బీరప్ప కురుమ సంఘం సభ్యులు చిగుర్ల కుమార్‌, పోచయ్య, గుంటి ఒదయ్య, రాయికంటి రాజయ్య, శ్రీనివాస్‌, ప్రసాద్‌, గోవింద, సది, మహేశ్‌, రవీందర్‌ పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రెవెన్యూశాఖకు దిక్సూచి భూమి మేనిఫెస్టో

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి
- భూదాన్ పోచంపల్లిలో భూమి కారవాన్ పాదయాత్ర–2 ప్రారంభం



పాదయాత్రను నిర్వహిస్తున్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి: లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ (లీఫ్స్) సంస్థ 2014లో రూపొందించిన భూమి మేనిఫెస్టో రెవెన్యూ శాఖకు దిక్సూచి లాంటిదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి అన్నారు. సోమ వారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వినోబాభావే మందిరం వద్ద నుంచి లీఫ్స్ ఆధ్వర్యంలో భూమి కారవాన్ పాదయాత్ర–2ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరూప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిదిద్దక ముందే డిజిటలైజ్ చేయడం వల్ల రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్, ఎండోమెంట్, ఇనాం, వక్ఫ్ భూములను అమ్ముకుంటోందని దుయ్యబట్టారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా గాంధీజీ ఆధ్వర్యంలో నాడు బిహార్‌లోని చంపారణ్‌లో మొదలైన రైతుల ఉద్యమం తరహాలో తెలంగాణలోనూ ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

జూన్ 2న ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం: లీఫ్స్ అధ్యక్షుడు సునీల్

రెవెన్యూ చట్టాలు, విధానాల్లో చేయాల్సిన మార్పులపై సమగ్ర ప్రణాళిక రూపొందించి జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రభుత్వానికి నివేదిస్తామని లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, రెవెన్యూ చట్టాల నిపుణుడు ప్రొఫెసర్ సునీల్‌కుమార్ చెప్పారు. అంతకు ముందు ఆచార్య వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. వినోబాభావే నడియాడిన జువ్వి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం దోతిగూడెంలో రైతులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.

చట్టాలకు రామోజీ అతీతుడా..!

▶ మొదటి పేజీ తరువాయి

ఫైనాన్షియర్స్ వ్యవహారంలో... ఆ కంపెనీ ద్వారా తాము చేసినవన్నీ చట్ట విరుద్ధమైన పనులే అని తేలటంతో... తప్పును కప్పిపుచ్చుకోవటానికి ఏకంగా ఆ సంస్థనే మూసేశారు. ఇపుడు ఆ సంస్థే లేదు కదా? అని వాదిస్తున్నారు. ఒక బ్యాంకు తన వద్దకు వచ్చిన డిపాజిట్లను ఇష్టం వచ్చినట్లు సొంత అవసరాల కోసం వాడేయొచ్చా? సొంత కంపెనీల్లోకి మళ్లించొచ్చా? అలా మళ్లిస్తే బ్యాంకు కుప్పకూలిపోదా? కృషి, చార్మినార్, ప్రుడెన్షియల్ బ్యాంకుల నుంచి బిచాణా ఎత్తేసిన బ్యాంకులన్నీ ఇలా చేసినవే కదా?

మార్గదర్శి చిట్స్‌లో ప్రస్తుతం వేలకోట్ల రూపాయల మనీ లాండరింగ్, అక్రమ నిధుల మళ్లింపు జరుగుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరుపుతోంది. నిజాలు బయటికొస్తున్నాయి. కానీ దీన్ని ఈ నిజాలు వెలుగుచూడకుండా 86 ఏళ్ల రామోజీరావు కొత్త నాటకానికి తెరతీశారు. 'ఈనాడు' పత్రికను అడ్డంపెట్టుకుని, తటస్థుల ముసుగులో తన వాళ్లను తెరపైకి తెస్తున్నారు. అడ్డగోలు బుకాయింపులకు దిగుతున్నారు. మార్గదర్శిపై ఏ ఒక్క ఫిర్యాదూ రాలేదు కదా? అలాంటపుడు సీఐడీ విచారణ ఎందుకంటున్నారు. 'ఈనాడు' పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తున్నందుకే ప్రభుత్వం కక్ష గట్టి ఇలా చేస్తోందని... తన వాళ్లచేత కేంద్రానికి లేఖలు కూడా రాయిస్తున్నారు.

ఇక్కడ మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారు, డిపాజిటర్లు గమనించాల్సింది ఒక్కటే. యావత్తు దేశాన్ని కుదిపేసి దివాలా తీసిన శారదా చిట్‌ఫండ్స్‌గానీ, వేల మందిని ముంచేసిన సుదర్శన్ చిట్స్ గానీ కూలిపోవటానికి ముందు చాలా బలంగా కనిపించినవే కదా? కూలిపోయేదాకా వాటిపై ఎవ్వరూ ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదే!!. ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోబట్టే... చట్టాలు ఉల్లంఘిస్తున్నా అక్కడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం వల్లే అవి కుప్పకూలాయి. వేల మంది దాచుకున్న కష్టార్జితాన్ని స్వాహా చేసేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్గదర్శి చిట్స్‌ను... చట్టప్రకారం నడుచుకోవాలని కోరటం తప్పా? చట్టాలను అనుసరించాలని అడగటం నేరమా? ఇదెక్కడి తీరు!!.

అయినా డిపాజిట్లు సేకరించకూడదన్న ఆర్‌బీఐ నిబంధనల్ని ఉల్లంఘించినందుకు ఎన్ని ఎన్‌బీఎఫ్‌సీలు మూతపడలేదు? కనీసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎన్‌బీఎఫ్‌సీ కూడా కాదు. ఒక 50 మంది చిట్ సభ్యులుంటే... ప్రతినెలా ప్రతి ఒక్కరి దగ్గరా సొమ్ములు వసూలు చేసి.. వాటిని చిట్ పాడుకున్న ఎవరో ఒక్కరికి ఆ నెల్లోనే ఇవ్వటం దాని పని. మరి ప్రతినెలా అలా ఎవరి చిట్ల డబ్బులు వాళ్లకు ఇచ్చేస్తున్నపుడు వేల కోట్ల రూపాయల మిగులు మొత్తాలు దానిదగ్గర ఎలా ఉంటాయి? వాటిని తన సొంత సంస్థల్లోకి మళ్లించే అధికారం ఎవరిచ్చారు? వాటిని స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌చేసే అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? ఇవన్నీ ఉల్లంఘనలు కావా?

పత్రికాధిపతి... వ్యాపారవేత్త అనే రెండు టోపీల్ని రామోజీరావు ధరిస్తుంటారని... వ్యాపారాల్లో అక్రమాలేవైనా బయటపడినపుడు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోబో యినపుడల్లా... అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ ఎదురుదాడికి దిగుతారని సాక్షాత్తూ ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానమే గతంలో చెప్పింది. గతమంతా రామోజీ చేసింది ఇదే. కాకపోతే ఇపుడలా మాటలు పనిచేయటం లేదు. నమ్మేవారెవరూ లేరు. దీంతో ఆ మాటలు తాను చెప్పకుండా... తటస్థుల ముసుగులో తనకు కొమ్ముకాసే కొందరితో చెప్పిస్తున్నారు. అయినా అక్రమాలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై చర్యలు తీసుకుంటుంటే మధ్యలో ఈ తటస్థులెవరు? వీళ్లేమైనా మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారా? వీళ్లకేం సంబంధం? వీళ్లకసలు అక్రమాలకు పాల్పడుతున్న రామోజీని రక్షించే బాధ్యతను ఎవరిచ్చారు? రామోజీరావా... చంద్రబాబు నాయుడా?

ఈ చట్టాలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాదే?

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982, రాష్ట్ర డిపాజిట్ దారుల హక్కుల పరిరక్షణ చట్టం–1999లను ఉల్లంఘించి నిధులు మళ్లించినట్టు, అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో ఆధారాలతో సహా వెల్లడైంది. చందాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆ శాఖ అధికారుల ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని వక్రీకరిస్తూ రామోజీరావు మీడియా, చంద్రబాబు పార్టీ గగ్గోలు పెడుతున్నాయి. నిజానికి ఈ రెండు చట్టాలూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినవేమీ కావు. చిట్‌ఫండ్ చట్టాన్ని కేంద్రం 1982లో రూపొందించింది. ఇక ఏపీ డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ చట్టాన్ని తెచ్చింది 1999లో చంద్రబాబు ప్రభుత్వమే. వాటిని అమలు చేస్తుంటే... దాన్ని రామోజీరావుపై వేధింపులుగా వక్రీకరిస్తున్నారు.

చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ తరవాత దివాలాయే!!

చిట్‌ఫండ్ చట్టాన్ని, డిపాజిటర్ల చట్టాన్ని ఉల్లంఘిస్తే ఏమవుతుందన్నట్లుగా రామోజీరావు, ఆయన మనుషులు, టీడీపీ ప్రజల్ని తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. సామాన్యుల డబ్బు భద్రంగా ఉండటం కోసం చేసిన ఆ చట్టాలను ఉల్లంఘిస్తే ఏమవుతుందో... దేశంలో బట్టబయలైన ఎన్నో చిట్‌ఫండ్ కుంభకోణాలు, ప్రైవేట్ బ్యాంకుల ఆర్థిక దోపిడీలు నిరూపించాయి కూడా...

శారదా చిట్‌ఫండ్.. 4.90 లక్షల కోట్ల భారీ దోపిడీ

2013లో బట్టబయలైన శారదా చిట్‌ఫండ్ కుంభకోణం దేశంలోనే సంచలనం సృష్టించింది. పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపురలలో డిపాజిట్‌దారుల నుంచి ఏకంగా 4.90 లక్షల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించింది. అధికవడ్డీల ఆశ చూపించి పోంజీ తరహా మోసానికి పాల్పడింది. 2013లో శారదా చిట్‌ఫండ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఏకంగా 17 లక్షల మంది ఆ సంస్థ ఖాతాదారులు నిండా మోసపోయారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కూడా పోంజీ తరహా మోసానికే పాల్పడుతోందని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో వెల్లడి కావడం గమనార్హం.

రూ. 6,380 కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో వెలుగుచూసిన మరో ఆర్థిక మోసం అగ్రిగోల్డ్. గొలుసుకట్టు తరహాలో 8 రాష్ట్రాల్లో ఏకంగా రూ.6,380 కోట్ల డిపాజిట్లు సేకరించింది. అందులో రూ.3,996 కోట్ల డిపాజిట్లు ఆంధ్రప్రదేశ్‌లో సేకరించినవే. ఇష్టం వచ్చినట్టుగా నిధుల్ని మళ్లించి సంస్థ బోర్డు తిప్పేసింది. ఫలితం... కష్టార్జితాన్ని దాచుకున్న 32 లక్షల మంది డిపాజిట్‌దారులు రోడ్డునపడ్డారు. వారిలో అత్యధికంగా 19.50 లక్షలమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. అగ్రిగోల్డ్ సంస్థ అక్రమాలకు పాల్పడుతోందని గుర్తించినా నాటి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ సంస్థకు చెందిన హాయ్‌లాండ్‌తోపాటు అమరావతిలో భూములను కొల్లగొట్టేందుకే చంద్రబాబు, లోకేశ్ ప్రాధాన్యమిచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాక దశలవారీగా డిపాజిటర్లకు చెల్లింపులు చేస్తూ వస్తోంది.

పాతికేళ్ల కిందటే... 'కృషి' బ్యాంకు

చంద్రబాబు సీఎంగా ఉండగా 2001లో కృషి బ్యాంకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖాతాదారులను బురిడీ కొట్టించింది. అత్యధిక వడ్డీల ఆశ చూపించిన ఈ బ్యాంకు చైర్మన్ కొనరాజు వెంకటేశ్వరరావు... రూ.35 కోట్ల డిపాజిట్లను కొల్లగొట్టారు. అనధికారిక లెక్కల ప్రకారం ఈ డిపాజిట్లు రూ.100 కోట్లకుపైనే ఉంటాయని సమాచారం. కొనరాజు ఆ నిధులను ఇతర సంస్థల్లోకి అక్రమంగా మళ్లించి చివరికి 2001లో చేతులెత్తేసి విదేశాలకు పారిపోయాడు.

ప్రుడెన్షియల్... పాపులర్.. ఏదైనా అంతే..

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే 2003లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో వెలుగు చూసిన మరో భారీ ఆర్థిక మోసం... ప్రుడెన్షియల్ బ్యాంకు. ఏకంగా రూ.550 కోట్ల మేర డిపాజిట్‌దారులను మోసం చేసింది ఆ సంస్థ. ఇక కేరళ కేంద్రంగా డిపాజిట్లు సేకరించిన పాపులర్ ఫైనాన్స్ సంస్థ ఏకంగా రూ.2వేల కోట్లమేర డిపాజిటర్లను మోసం చేసింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 274 బ్రాంచ్‌లతో కార్యకలాపాలు సాగించిన ఈ సంస్థ 2022లో బోర్డు తిప్పేసి డిపాజిటర్లను ముంచేసింది.

వీటన్నింటినీ మించిపోయిన మార్గదర్శి...

పైన పేర్కొన్న సంస్థలను తలదన్నే రీతిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతోందని ఆధారాలతో సహా వెల్లడైంది. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లలో మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. అనంతరం సీఐడీ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సోదాల్లోనూ ఈ అక్రమాలు ధ్రువపడ్డాయి.

■ **రశీదు ముసుగులో అక్రమ డిపాజిట్లు:** చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 నుంచి 5 శాతం వరకు వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తోంది. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడం నేరం. మార్గదర్శి చిట్స్ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరిస్తోంది. ఈ అక్రమ డిపాజిట్లు ఎన్ని వేల కోట్లు అన్నది లెక్కతేలాల్సి ఉంది.

■ **గతంలో రూ.15వేల కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ:** మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు సేకరించిన నేర చరిత్ర మార్గదర్శి గ్రూపునకు ఉంది. గతంలో అక్రమంగా సేకరించిన రూ.15వేల కోట్ల డిపాజిట్లపై ఆదాయపన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ నోటీసులు కూడా ఇచ్చింది. దాంతో హడావుడిగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసేశారు. కేసు దర్యాప్తులో ఉండగా సంస్థను మూసివేయడం అంటే ఆధారా లను ధ్వంసం చేయడమే. అది క్రిమినల్ నేరం.

■ **చందాదారుల సొమ్ము సొంత పెట్టుబడిగా...:** మార్గదర్శి చిట్స్‌కు మూడు అనుబంధ కంపెనీలున్నట్టుగా బ్యాలెన్స్ షీట్లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్– హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించడానికే ఈ కథ. ఒక్క ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాకోసం పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది. అంటే రామోజీరావు కుటుంబం రూపాయి పెట్టకుండా...చందాదారుల సొమ్ముతోనే సొంత వ్యాపారాలు చేస్తున్నారు. అసలు చిట్‌ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం–1982కు విరుద్ధం.

■ మార్గదర్శి చిట్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెడుతోంది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.

■ **రికార్డుల కనికట్టు...:** చట్ట విరుద్ధంగా చేస్తున్న ఈ మోసాన్ని కప్పిపుచ్చేందుకు మార్గదర్శి చిట్స్ రికార్డుల్లో భారీ అవకతవకలకు పాల్పడుతోంది. చందాదారుల సొమ్ము చెక్కుల రూపంలో తమ వద్ద ఉన్నట్టుగా బ్యాలెన్స్‌షీట్‌లో చూపిస్తోంది. ఏటా మార్చి 31న వందల కోట్ల రూపాయలు చెక్కులు వచ్చినట్టు చూపిస్తోంది. కానీ ఆ చెక్కులు ఎన్నిరోజులైనా క్యాష్ కావు. అంటే... అవి బోగస్ చెక్కులన్నమాట. అప్పటికే ఆ సొమ్మును మనీ లాండరింగ్ చేసేశారన్నది స్పష్టంగా తెలియకమానదు.

■ **ఏపీ ప్రజల సొమ్ము... పెత్తనం పక్క రాష్ట్రంలో:** రాష్ట్రంలో మార్గదర్శి చిట్స్‌కున్న 37 బ్రాంచ్‌ల్లో ఏడు బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదు. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేస్తున్నారు. రాష్ట్రంలోని మార్గదర్శి ఫోర్‌మెన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలూ లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఎండీ శైలజతో పాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ఇక్కడి చందాదారుల సొమ్ము భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే... తెలంగాణలో ఉంది కనక అది ఏపీ అధికారుల పరిధిలోకి రాదని చెబుతున్నారు. మరీ ఏపీ చందాదారుల సొమ్ముకు బాధ్యులెవరని అడిగితే... సమాధానం లేదు.

■ **ఒక్క బ్యాంకు ఖాతా చాలట...:** చిట్‌ఫండ్ సంస్థలు తాము నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. అన్ని చిట్లకూ ఒకే బ్యాంకు ఖాతా. ఏపీకి సంబంధించి ప్రత్యేక ఖాతా కూడా లేదు.

■ **ఇదో పోంజీ తరహా స్కామ్:** మార్గదర్శి చిట్స్ పోంజీ స్కీమ్‌కు తక్కువేమీ కాదు. చిట్టీల్లో 30 – 40% టికెట్లు (సభ్యత్వాలు) యాజమాన్యానివే. వాటికి తన తరఫున చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. కొత్త చిట్లు, ఇతర చిట్ల నుంచి వచ్చిన సొమ్మును తాము చెల్లించినట్టుగా రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. అంటే... ఏ రోజైనా కొత్తగా వచ్చే చందాదారులు తగ్గినా, కొత్త చిట్లు ఆగినా మార్గదర్శి తన తరఫున చెల్లించాల్సిన చందాను చెల్లించే పరిస్థితి ఉండదు. అప్పుడు చిట్ పాడుకున్నవారికి సొమ్ము చెల్లించే అవకాశమూ ఉండదు. అదేరోజున దివాలా తీసే ప్రమాదం ఉంటుంది.

ఒక్క రూపాయి చెల్లించకుండా...తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్ణీత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. వాటికోసం మార్గదర్శి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది.

నిధులు మళ్లించామని అంగీకరించిన రామోజీ

సీఐడీ దర్యాప్తులో... తాము మార్గదర్శి చిట్స్ నిధులను ఇతర సంస్థలకు మళ్లించామని రామోజీరావే అంగీకరించారు. ఆధారాలతోసహా సీఐడీ అధికారులు ప్రశ్నించేసరికి ఆయన నోటమాట రాలేదు. దాంతో నిధులు మళ్లించింది వాస్తవమేనని అంగీకరిస్తూనే అది తమ ఆర్థిక ప్రణాళిక అన్నట్టుగా బుకాయించేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావే అక్రమాలు నిజమేనని సమ్మతించిన తరువాత ... మళ్లీ వక్రీకరిస్తూ వితండవాదనలెందుకు?

చట్టాలు తమకు వర్తించవన్న శైలజ...

మామ కంటే రెండు ఆకులు ఎక్కువ చదివానన్నట్టుగా ఏ–2 చెరుకూరి శైలజ వ్యవహరించారు. అసలు చిట్‌ఫండ్ చట్టం తమకు వర్తించదని...తాము పట్టించుకోమని ఆమె సీఐడీ అధికారుల వద్దే వ్యాఖ్యానించడం తీవ్రమైన అంశమని నిపుణులు చెబుతున్నారు. కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామన్న ఆమె... పోనీ ఆ చట్ట ప్రకారమైనా అనుబంధ కంపెనీలకు నిధులు మళ్లించడం నేరమే కదా అని అంటే మాత్రం సమాధానమివ్వలేదు.

భూమి కబ్జా చేస్తున్నారని రైతు ఆత్మహత్యాయత్నం



ఎస్సై వాహనం ఎదుట ఆందోళన



ఆత్మహత్యకు యత్నించిన రైతు పెద్దనర్సయ్య

- కబ్జాదారులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ
- బాధిత రైతును ఆస్పత్రికి తరలించిన బంధువులు
- పోలీసుల తీరుపై ఆందోళన

ఖానాపూర్: పోలీసుల వేధిస్తున్నారని నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల మస్కాపూర్ గ్రామానికి చెందిన రైతు పురుగుల మందు తాగాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించిన బంధువులు తమ తండ్రి ఆత్మహత్యాయత్నానికి పోలీసుల వేధింపులే కారణమని ఆందోళన చేశారు. ఈ ఘటన సోమవారం జరిగింది. మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన రైతు అయినవేణి పెద్దనర్సయ్యకు సర్వే నంబర్ 341/ఆలో 2.24 ఎకరాల భూమి ఉంది. అందులో నుంచి 2.04 ఎకరాలను గంతోనే ఓ రియల్టర్‌కు విక్రయించాడు. మిగిలిన 20 గుంటలలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. అయితే ఆ భూమిని కూడా రియల్టర్ ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారే రైతు పెద్దనర్సయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రైతును తరచూ ఠాణాకు పిలిపించి వేధించడంతో పెద్దనర్సయ్య భూమి వద్దకు వెళ్లి ఎస్సై తన భూమిని లాక్కునేవారికి మద్దతు ఇస్తున్నాడని, తనక అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. దగ్గరుండి హద్దు రాళ్లు కూడా పాతించారని తెలిపాడు.

పురుగుల మందు తాగిన రైతు..

ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన పెద్దనర్సయ్య పొలం వద్దనే పురుగుల మందు తాగాడు. స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి నుంచి 108లో నిర్మల్‌కు తరలించారు. ఈ సమాచారం తెలుసుకుని ఆసుపత్రికి వచ్చిన ఎస్సై శంకర్ వాహనాన్ని పెద్దనర్సయ్య కుటుంబీకులు అడ్డుకుని నిలదీశారు. దీంతో ఎస్సై అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వాహనం ముందు గంటపాటు ఆందోళన చేశారు. పెద్దనర్సయ్యకు ఏం జరిగినా అందుకు పోలీసులే బాధ్యులని కుటుంబీకులు నడ్పినర్సయ్య, నరేందర్, నరేశ్, అపర్ణ, మాధవి, సుమలత, మమతలు హెచ్చరించారు. ఈ విషయమై ఎస్సై శంకర్‌ని వివరణ కోరగా, రైతు భూమి వద్ద ఇరువర్గాలు గొడవ పడుతున్నట్లు ఫిర్యాదు అందడంతో తాను అక్కడికి వెళ్లి ఇరువురికి సర్దిచెప్పే ప్రయత్నం చేశానన్నారు. ఈ క్రమంలో పెద్దనర్సయ్య పురుగుల మందు తాగాడని తెలిపారు.

ఉపాధి లక్ష్యంగా ఆలయ ఫౌండేషన్ ముందుకు..

- ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి
- బసంత్‌నగర్‌లో కంటి విజన్ సెంటర్ ప్రారంభం



సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మురళీధర్‌రావు, ఎమ్మెల్యేలు చందర్, రఘునందర్‌రావు

పాలకుర్తి: విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఆలయ ఫౌండేషన్ స్థాపించామని, అనతికాలంలోనే దానిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఎంతోమందికి సేవలు అందిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఐఅండ్‌పీఆర్ కమిషనర్ పరికిపండ్ల నరహరి అన్నారు. బసంత్‌నగర్‌లో తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం నిర్మించిన శంకర్ విజన్ కేంద్రాన్ని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధర్‌రావు, రామగుండం, దుబ్బాక ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, రఘునందన్‌రావు చేతులమీదుగా సోమవారం ప్రారంభించారు. ముందుగా సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తన తండ్రి సత్యనారాయణ దర్జీ పనిచేసి కుటుంబాన్ని పోషించారని, తాను ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుకుని ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. సమాజ సేవ చేయాలనే సంకల్పంతో చిన్ననాటి మిత్రులతో కలిసి ఆలయ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. శంకర్ విజన్‌లో టెలీ మెడిసిన్ సిస్టం ద్వారా కంటి పరీక్షలు చేసి హైదరాబాద్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. అంతకుముందు సినీ హీరో ఆలీ మాట్లాడుతూ తన తండ్రి కూడా దర్జీయేనని, తండ్రి ఆశయసాధన కోసం కృషిచేస్తున్న నరహరి అభినందనీయుడన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ఆలయ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. మిమిక్రీతో రమేశ్ అలరించారు. జానపద కళాకారులు గడ్డం రమేశ్, శిరీష, లక్ష్మి, కాసర్ల శ్యాం, మంగ్లీ పాటలతో ఉర్రూతలూగించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాకున్నా.. తన సందేశాన్ని పంపించారు. మెగాస్టార్ చిరంజీవి వస్తున్నారనే ప్రచారంతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే ఆయన రాకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. కార్యక్రమంలో భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్, జాతీయ కార్యదర్శి అరవింద్‌మీణన్, ఏబీవీపీ నాయకులు గుంతా లక్ష్మణ్‌జీ, వై.సత్యకుమార్, ఎక్కా చంద్రశేఖర్, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, కౌశిక హరి, ఆకుల విజయ, మూల విజయారెడ్డి, జెడ్పీటీసీలు సంధ్యారాణి, బొడ్డుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అందించాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న

- అఖిల భారత పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలోని పెన్షనర్లందరికీ కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత(క్యాష్ లేస్) వైద్యం అందించాలని ఇన్ పేషంట్లకు, అవుట్ పేషంట్లకు ఎలాంటి ఆర్థిక పరిమితులు విధించొద్దని అఖిల భారత పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న కోరారు. అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల ఫెడరేషన్, తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు నిర్మల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారానికి నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. తమ డిమాండ్లను కలెక్టర్ల ద్వారా ప్రధాన మంత్రి , రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపుతున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ రిలీఫ్ కేంద్రం ప్రకటించినట్లుగా మంజూరు చేయాలన్నారు. బకాయిలు విడుదల చేసి, వేతన సవరణ కమిటీ 2023ను అమలుకు వేతన కమిషన్ నియమించాలన్నారు. 65 ఏళ్లు దాటిన పెన్షనర్లకు ఎడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న కమ్యూటేషన్ వాల్యూ ఆఫ్ పెన్షన్‌ను 15 ఏళ్లకు బదులు 12 ఏళ్లకు కుదించాలని పేర్కొన్నారు. ఏటా డిసెంబర్ 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. గ్రాంట్–ఇన్–ఎడ్ సంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని కోరారు.

రాష్ట్రపతి భవన్‌లో రుతుమిత్ర కిట్‌పై ప్రదర్శన



కిట్ పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రపతి భవన్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించే ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఇంటర్నేషనల్ షిప్(ఫైన్) కార్యక్రమంలో సోమవారం మంచిర్యాలకు చెందిన సాయి శ్రీవల్లి తన ప్రాజెక్టును ప్రదర్శించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్త్రీల రుతుక్రమ ప్రక్రియలో ఏర్పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో రూపొందించిన రుతుక్రమ కిట్‌పై రాష్ట్రపతికి శ్రీవల్లి వివరించింది. జాతీయ ఇన్‌స్పైర్ పోటీల్లో విజేతలైన 60 మంది ప్రదర్శనలతోపాటు వివిధ స్థాయిలో నూతన ఆవిష్కర్తలు 120 మందికి పైగా పాల్గొన్నారు. మంచిర్యాల నుంచి సాయి శ్రీవల్లి తన తండ్రి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి హాజరైంది. రాష్ట్రపతితో ముచ్చటించే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీవల్లి తెలిపింది.

సిరిసిల్లలో కోఆప్షన్ మెంబర్‌పై మహిళల దాడి

- యువకుడితో ఫోన్‌లో తిట్లదండకం
- ఆగ్రహంతో దాడిచేసిన మహిళలు
- మజీద్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో ఘటన



కోఆప్షన్ సభ్యుడిపై దాడి చేస్తున్న ముస్లిం మహిళలు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడి తిట్ల పురాణంపై సిరిసిల్ల ముస్లిం మహిళలు తిరగబడ్డారు. సోమవారం ఆయన దుకాణంలోకి వెళ్లి బూతులు తిట్టడాన్ని ప్రశ్నించి చేయిచేసుకున్న సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సంచలనం రేకెత్తించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా ఎండీ సలీం కొనసాగుతున్నారు. ఫిరోజ్ అనే యువకుడికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులు, ఇంట్లో మహిళలను బూతులు తిట్టాడు. ఆగ్రహించిన ఫిరోజ్ కుటుంబ సభ్యులు, స్థానిక ముస్లింలు గాంధీచౌక్‌లోని సలీం రికార్డింగ్ షాపునకు వచ్చి దాడి చేశారు. కాగా మజీద్ కమిటీ ఎన్నికల్లో ముస్తాఫా ఎస్సెస్సీ ఫేక్ సర్టిఫికెట్ విషయాన్ని తాను వ్యతిరేకించడంతోనే అతని అనుచరులు దాడి చేశారని సలీం పేర్కొన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ముదిరిన వర్గపోరు

ఇటీవల సిరిసిల్ల పట్టణ మజీద్ కమిటీ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా వేరే గ్రూపునకు చెందిన ముస్తాఫా ఎన్నికయ్యారు. నామినేషన్ల సందర్భంలో ముస్తాఫా ఎస్సెస్సీ ఫేక్ సర్టిఫికెట్ అందించారని మరో వర్గం సలీం అనుచరులు ఎన్నికల అధికారికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారి ముస్తాఫాను అనర్హుడిగా ప్రకటించి సలీంను అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈక్రమంలో పలుసార్లు ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. చివరికి ఇరువర్గాల గొడవలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. కాగా రెండు రోజుల క్రితం ఎండీ సలీం, ఫిరోజ్ అనే యువకుడికి ఫోన్‌లో జరిగిన సంభాషణలో బూతులు తిట్టే ఆడియో రికార్డులు, సలీంపై జరిగిన దాడి వీడియోలు సోమవారం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే సలీంపై పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు సోమవారం ఆయన దుకాణం వద్ద గొడవ చేసిన ముస్లిం మహిళలు వివరించారు.

కార్మిక వాడలకు స్వచ్ఛమైన నీరివ్వండి



మురికి నీటిని పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని(రామగుండం): మురికి నీటితో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సోమవారం గంగానగర్‌లోని ఫిల్టర్ బెడ్ ప్రాంతానికి వెళ్లి, కార్మికుల ఇళ్లకు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. సింగరేణి యాజమాన్యం కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గోదావరి నది నుంచి వస్తున్న నీటిని ఫిల్టర్ చేయకుండానే కార్మిక వాడలకు అందిస్తున్నారని మండిపడ్డారు. మురికి నీరు తాగడం వల్ల స్థానికులు డయేరియా బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వేసవికాలంలో నీటి వినియోగం ఎక్కువ ఉంటుందని, స్వచ్ఛమైన నీరందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మెండె శ్రీనివాస్, గజేంద్ర, వేణుగోపాల్‌రెడ్డి, ఆసరి మహేశ్, ఆరెపల్లి రాజమౌళి పాల్గొన్నారు.

చదువు, ఉద్యోగం మాత్రమే కాదు ఇష్టమైన కళను సాధన చేస్తూ, దాని ద్వారా ప్రశంసలు పొందడం ఎప్పుడూ నలుగురిలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. చదువుకుంటూ, ఉద్యోగాలు చేసుకుంటూ సంగీతంతో తమ ప్రతిభను వేదికల మీద నిరూపించుకుంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు యుతి, లాస్యప్రియ, మానస, సౌజన్య. కలలను సాధించుకోవాలంటే భయాలను అధిగమించాలని సమయాన్ని సరిగ్గా వినియోగించుకోవాలని అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్న ఈ యువతరం ఇటీవల హైదరాబాద్‌లోని ఓ సంగీత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ పాటలాసక్తిని మాటలుగా మన ముందుంచారు.



నచ్చిన కళలో ఇష్టంగా...

సౌజన్య బీటెక్ పూర్తి చేసింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసింది. సంగీతంలోనూ తనదైన ముద్ర వేస్తోంది.

బ్యాలెన్స్ చేసుకోవాలి

లాస్యప్రియది తెలంగాణలోని సిద్దిపేట. బీటెక్ పూర్తయ్యాక డేటా సైన్స్ జాబ్ చేస్తోంది. గాయనిగానూ రాణిస్తోంది.

‘స్కూల్ రోజుల్లోనే టీవీ షోలలో పాడే అవకాశాలు వచ్చాయి. ముందు సీరియస్‌గా అనుకోలేదు. కానీ, నాకు ప్రతీ మాట పాటలా వచ్చేది. అలా, సంగీతానికి దగ్గరయ్యాను. అలాగని, చదువును దూరం పెట్టలేదు. చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తున్నాను. ఆరుగురం స్నేహితులం కలిసి మ్యూజిక్ బ్యాండ్ ఏర్పాటు చేశాం. మా బ్యాండ్‌తో వారాంతాల్లో ప్రదర్శనలు ఇస్తుంటాం. నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి నిరంతర సాధన ఉంటుంది. ఉద్యోగం, ఇష్టమైన గాత్ర సాధనకు, మ్యూజిక్ బ్యాండ్, ప్రదర్శనలకి టైమ్ బ్యాలెన్స్ చేసుకుంటున్నాను.

- లాస్య ప్రియ



ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి

‘ముందు చదువుకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చాను. తర్వాత శాస్త్రీయ సంగీతం, నృత్యం అమ్మానాన్నల ద్వారా పరిచయం అయ్యింది. మా ఫ్యామిలీ ఈవెంట్స్ నుంచి బయట కూడా ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. ఐదేళ్ల నుంచి టీవీ షోలలో పాల్గొంటున్నాను. కళలను సాధన చేసే క్రమంలో చదువు వెనకబడుతుంది అంటుంటారు కానీ, ఆర్ట్‌లో ఉంటే చదువులో మరింత బాగా రాణించవచ్చు. మొదట స్టేజ్ అంటే చాలా భయమేసేది. పాటలు, నృత్యం వల్ల ఆ భయం పోయింది. బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్‌లో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నాను. అన్నింటిలోనూ చాలాసార్లు భయపడిన సందర్భాలు ఉన్నాయి. కానీ, వాటిని అంతే ఛాలెంజింగ్‌గా ఎదుర్కోవడం అలవాటైపోయింది. దీంతో చదువు, ఉద్యోగం, సంగీతం, నృత్యం, క్రీడలు అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వెళుతున్నాను.

- మానస సాయిశేషు



మానస సాయి శేషుది కాకినాడ. హైదరాబాద్ బిట్స్ పిలానీలో ఎమ్‌టెక్ చదువుతూనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నృత్యంలోనే కాదు క్రీడాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుతోంది.

మనల్ని మనమే నిరూపించుకోవాలి

‘మా చిన్నతనంలో తాతగారి ఊళ్లో ఉన్నప్పుడు పద్యాలతో అంత్యాక్షరి చేసేవాళ్లం. అలా నాకు పాటలు, సంగీతంపై ఇష్టం కలిగింది. దీంతో చదువుతోపాటు సంగీతాన్ని కూడా సాధన చేశాను. సినిమాలకు చిన్న చిన్న ట్రాక్స్ పాడాను. అలాంటి సమయంలోనే అర్జున్ రెడ్డి సినిమాలో పాట పాడే అవకాశం కూడా లభించింది. ఆన్‌లైన్-ఆఫ్‌లైన్‌లలో మ్యూజిక్ క్లాసులు తీసుకుంటుంటాను. డిజిటల్ మీడియాలో నా సాంగ్ ట్రాక్స్ అప్‌లోడ్ చేస్తుంటాను. టీవీ మాధ్యమాల ద్వారా ఏ చిన్న అవకాశం వచ్చినా వదులుకోకుండా నన్ను నేను ప్రూవ్ చేసుకుంటున్నాను.

- సౌజన్య భాగవతుల

సాంత్వన కలిగించాలి

బెంగళూరులో ఉంటున్న యుతి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. స్కూల్ ఏజ్ నుంచే సంగీతం సాధన చేస్తుంది. సాంగ్‌రైటర్‌గా తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తోంది.

‘పన్నెండేళ్లుగా శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటున్నాను. వెస్టర్న్ మ్యూజిక్‌తో కంటెంపరరీ సాంగ్స్ క్రియేట్ చేయడం ఇష్టం. తమిళ మూవీస్‌కి కొన్ని ట్రాక్స్ పాడాను. అవి వచ్చే నెలలో రిలీజ్ అవుతాయి. అవకాశాలు మన కోసం రావు. వాటికోసం ప్రయత్నమూ చేయాలి. నేను చదువుతున్నది సైకాలజీ సబ్జెక్ట్. సంగీతంతో మనసులకు సాంత్వన కలిగించవచ్చు అనే ఆలోచనతోనే నా చదువుకు పాటను జతగా చేర్చుతున్నాను. హిందీ సాంగ్ రైటర్‌గా రాణించాలని కృషి చేస్తున్నాను. ఈవెంట్స్‌లో పాడుతుంటాను. టీవీ షోలలోనూ పాల్గొన్నాను. అన్నివేళలా నన్ను నేను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తుంటాను.

- యుతి హర్షవర్ధన్



– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కిచెన్ టిప్స్

కూర మాడినప్పుడు ఆ మాడిన గ్రేవీలో టీ స్పూన్ పీనట్ బటర్ వేస్తే మాడిన వాసన చిటికెలో మాయం అవుతుంది. ఒకవేళ పీనట్ బటర్ అందుబాటులో లేకపోతే మాడిన గిన్నెను స్టవ్ మీదినుంచి దించి నీళ్లు ఉన్న ఒక వెడల్పాటి పాత్రలో కాసేపు ఉంచితే సరి.



డీప్‌ఫ్రై చేసిన ఆయిల్‌లో మడ్డి పేరుకుని మరోసారి వాడడానికి వీలుపడదు. ఇలాంటప్పుడు నూనెను వడగట్టే గరాటులో పలుచటి వస్త్రం వేసి నూనెను వడగట్టాలి. ఇలా చేస్తే మడ్డి అంతా వస్త్రానికి అతుక్కుని స్వచ్ఛమైన నూనె కిందకు దిగుతుంది.



యాలకుల తొక్కలను పంచదార డబ్బాలో వేసి నిల్వ చేస్తే పంచదార యాలకుల సువాసనలు వెదజల్లుతుంది. ఆ పంచదారను కాఫీలో మినహా టీలో లేదా మరి ఏ ఇతర వంటకంలో వేసినా దాని రుచి మరింత పెరుగుతుంది.



కాదేదీ బిజినెస్‌కు అనర్హం



● రెంజిని థామస్

‘కుక్కపిల్ల అగ్గిపుల్ల సబ్బు బిళ్ల... కావేదీ కవితకనర్హం అన్నారు శ్రీశ్రీ
కుక్కపిల్ల, అగ్గిపుల్లల సంగతేమిటోగానీ వృథాగా పడి ఉన్న ఖాళీ సీసాలు మాత్రం తమ విలువ తెలుసుకోమన్నాయ్! మరి రెంజిని కళాహృదయం ఊరుకుంటుందా!
ఎన్నెన్నో కళాకృతులను సృష్టించి పాత వస్తువులకు కొత్త శోభను తీసుకువచ్చింది. తన అభిరుచిని వ్యాపారంగా మలిచి విజయం సాధించింది 35 సంవత్సరాల రెంజిని థామస్....

దుబాయ్‌లో ఎం.బి.ఎ. ఫైనాన్స్ చదువుకున్న రెంజిని ఆ రంగంలో కాకుండా మీడియా ఫీల్డ్‌లో పనిచేసింది. 2015లో స్వరాష్ట్రం కేరళకు వచ్చిన రెంజినికి వివాహం అయింది. ‘9 టు 5’ షెడ్యూల్ బోర్ కొట్టడం వల్ల మళ్లీ ఉద్యోగం చేయాలనిపించలేదు. ఖాళీ సమయాన్ని తన ఇష్టమైన పెయింటింగ్‌తో గడిపేది. స్వస్థలం కొచ్చిలో తన పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఆర్ట్ లవర్స్‌తో ఒక కమ్యూనిటీని ఏర్పాటు చేసింది. భర్త కూడా ఆర్టిస్ట్ కావడం వల్ల ఇంటినిండా ఆర్ట్ ముచ్చట్లే!

బయటకు వెళ్లినప్పుడు రెంజినికి ఎక్కడ పడితే అక్కడ వృథాగా పడి ఉన్న గాజు సీసాలు కనిపించేవి. భర్త నిర్వహించే ‘సౌండ్ స్టూడియో’కు పాత సంగీత పరికరాలను కొనుగోలు చేయడానికి పాత వస్తువులు అమ్మే ఒక దుకాణానికి వెళ్లింది. అక్కడ వృథాగా పడి ఉన్న ఖాళీ సీసాలు కనిపించాయి. ఆ సమయంలో తనలోని కళాహృదయం నిద్రలేచింది! సీసాలతో పాటు పాత టైర్ రిమ్స్, బకెట్లు, గ్లాసులు.. మొదలైనవి సేకరించడం ప్రారంభించింది రెంజిని.

ఒక ఫైన్ మార్నింగ్ వాటితో ఆర్ట్ మొదలు పెట్టింది. వృథా వస్తువులతో కొన్ని హోమ్‌డేకర్ ఐటమ్స్ తయారుచేసి ఫ్రెండ్స్‌కు బహుమతిగా ఇచ్చింది.‘అద్భుతం’ అనడమేకాదు ‘వీటితో వ్యాపారం చేస్తే బాగుంటుంది’ అని సలహా ఇచ్చారు. వారి సలహాతో ఆన్-డిమాండ్ ఆర్డర్స్ కోసం డెకరేషన్ ఐటమ్స్ తయారీ మొదలుపెట్టింది. వివిధ రూపాల్లో ఆర్ట్ కోసం ఖర్చుపెట్టడం తప్ప ఆర్ట్ ద్వారా డబ్బు సంపాదించడం తనకు ఇదే తొలిసారి! పర్యావరణం కోసం పనిచేస్తున్న ‘క్లైమెట్ కలెక్టివ్’ అనే స్వచ్ఛందసంస్థ మహిళా వ్యాపారుల కోసం ‘క్లైమెట్ ఛేంజింగ్ కాంపిటీషన్’ నిర్వహించింది. రెంజిని తయారుచేసిన కళాకృతులను చూసి ‘క్లైమెట్ కలెక్టివ్’ నిర్వాహకులు ప్రశంసించారు. మరిన్ని కళాకృతులు తయారు చేయాల్సిందిగా కోరారు. రెంజిని ఈ పోటీలో సెమీ-ఫైనల్స్ వరకు వెళ్లింది.



ఐఐఎం-బెంగళూరు స్టార్టప్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన రెంజిని అక్కడ ఎన్నో విషయాలు తెలుసుకుంది. అప్ సైకిల్డ్ ప్రొడక్ట్స్‌కు మంచి డిమాండ్ ఉన్న విషయం తనకు అర్థమైంది. ఈ ఉత్సాహంతో ‘వాపసీ’ పేరుతో ఆన్‌లైన్‌లో డెకరేషన్ స్టోర్ ప్రారంభించింది. ఇందులో గ్లాస్ బాటిల్స్, కొబ్బరి చిప్పలు, రకరకాల పాతవస్తువులతో తయారు చేసిన 21,000 హోమ్‌డెకరేషన్ ఐటమ్స్ కనువిందు చేస్తాయి. గ్లాస్ వర్క్ అనేది కత్తి మీద సాములాంటిది. బోలెడు ఓపిక ఉండాలి. చిన్న తప్పు దొర్లినా గ్లాస్ పాడై పోతుంది. తాను చేసిన తప్పులతోనే ఎన్నో పాఠాలు నేర్చుకుంది రెంజిని.

‘మొదట్లో నా వర్క్స్‌పై నాకు అంతగా ఆత్మవిశ్వాసం ఉండేది కాదు. అయితే ఐఐఎం-బెంగళూరు పాఠాలతో నాపై నాకు ఆత్మవిశ్వాసం ఏర్పడింది’ అంటున్న రెంజిని థామస్ భవిష్యత్‌లో మరిన్ని పర్యావరణ హిత కళాకృతులను తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

సాగుబడి

రేవతి కార్తె: ఏప్రిల్ 13 వరకు
అశ్విని కార్తె : 14 నుంచి

అగ్ని నిరోధక పత్తి!

● సరికొత్త పత్తి వంగడాలను ఆవిష్కరించిన అమెరికా శాస్త్రవేత్తలు
● జన్యుమార్పిడి లేదు.. సెలక్టివ్ బ్రీడింగ్ పద్ధతిలోనే రూపుకల్పన



సాధారణంగా దూది గానీ, నూలు వస్త్రం గానీ మంట తగిలితే చాలు చప్పున నిప్పంటుకుంటుంది. మంటలను వ్యాపింపజేయకుండా ఆర్పివేసుకునే స్వభావం కలిగిన సరికొత్త తెల్ల పత్తి రకాలను అమెరికా శాస్త్రవేత్తలు రూపొందించారు. జన్యుమార్పిడి అవసరం లేకుండా సంప్రదాయ సెలక్టివ్ బ్రీడింగ్ పద్ధతిలోనే శాస్త్రవేత్తలు ఈ సరికొత్త ఆవిష్కరణను వెలువరించటం విశేషం.

పత్తి పంట ద్వారా పండించిన దూది ద్వారా వస్త్రాలు, పరుపులు, కర్టెన్లు, సోఫాలు, కుర్చీలలో వాడే మెత్తలు, కార్పెట్లు తయారు చేస్తుంటాం. ఈ క్రమంలో వినియోగదారుల భద్రత రీత్యా మంటల వ్యాప్తిని నెమ్మదింపజేసే రసాయనాలను వాడుతున్నారు. అయితే, ఈ రసాయనాల ప్రతికూల ప్రభావం వల్ల మనుషులకు చాలా తీవ్రమైన జబ్బులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యవసాయ శాఖకు చెందిన వ్యవసాయ పరిశోధనా సంస్థ అగ్ని నిరోధక పత్తి రకాలపై ఐదేళ్లుగా చేస్తున్న పరిశోధనలు ఇటీవల ఫలించాయి. డా. గ్రెగరీ ఎస్. థైస్సెన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం మంటలు అంటుకున్నా వ్యాపింపజేయకుండా ఆర్పుకునే స్వభావం ఉన్న అనేక రకాల పత్తి మొక్కల్ని పక్కపక్కనే సాగు చేసి.. సంప్రదాయ సెలక్టివ్ బ్రీడింగ్ పద్ధతిలో పది పత్తి రకాలను రూపొందించారు. వాటితో పండించిన దూదితో వస్త్రాలు నేసి, వాటికి వేర్వేరుగా నిప్పంటించి పరీక్షించారు. అందులో నాలుగు రకాల పత్తితో తయారు చేసిన వస్త్రాలు మంటలను నిరోధించాయి. నిప్పంటుకున్న తర్వాత కూడా మంటలను పెద్దగా వ్యాపించనీయ లేదు. మిగతా 6 రకాల వస్త్రాలు మాత్రం కొన్ని సెకన్లలోనే పూర్తిగా దగ్ధమయ్యాయి.



● దగ్ధమవుతున్న సాధారణ దూది
● దగ్ధం కాని కొత్త రకం దూది

సాధారణ పత్తి రకాలను సంకరం చేయడంతో ఆయా రకాల్లోని అనేక జన్యువుల సమ్మేళనం వల్ల మంటలను వ్యాపించకుండా తట్టుకునే గట్టి గుణం కొన్ని పత్తి రకాలకు సమకూరిందని, ఏ ఒక్క జన్యువు వల్లా ఇది జరగలేదని అమెరికా వ్యవసాయ శాఖకు అనుబంధంగా న్యూ ఆర్లియన్స్‌లో ఉన్న పత్తి రసాయనిక-వినియోగ కేంద్రం మాజీ అధిపతి బ్రెయిన్ కాండోన్ చెప్పారు. నిప్పు భయం లేని నూలు వస్త్రాల ఉత్పత్తికి వీలుగా అగ్నినిరోధక పత్తి వంగడాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయన్న మాట!

16, 17లలో డా.ఖాదర్ సభలు

పద్మశ్రీ పురస్కార గ్రహీత, స్వతంత్ర శాస్త్రవేత్త డా. ఖాదర్ వలి ఈ నెల 16, 17 తేదీల్లో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, హన్మకొండల్లో జరిగే సభల్లో ప్రసంగిస్తారు. 16న ఉ. 10 గం.కు హైదరాబాద్ నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని ఎఫ్.టి.సి.సి.ఐ. ఆడిటోరియం హాల్‌లో.. సా. 4 గం.కు సికింద్రాబాద్ కార్ఖానాలోని వాసవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో, 17న ఉ. 10 గం.కు ఈసిఐఎల్ క్రాస్‌రోడ్స్‌లోని కుషాయిగూడ ఫంక్షన్ హాల్‌లో, సా. 5 గం.కు హన్మకొండలోని నక్కలగుట్టలో గల హరిత కాకతీయ హోటల్‌లో జరిగే సభల్లో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. వివరాలకు.. 70939 73999

24 లోగా సేంద్రియ పాలిటెక్నిక్ ప్రవేశాలు

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జింగుర్తిలో నెలకొల్పిన ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏప్రిల్ 24 లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉంది. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎస్సెస్సీ పాసైన అభ్యర్థులను టిఎస్ పాలీసెట్ ద్వారా ఎంపిక చేస్తారు. తెలంగాణలో తొలి సేంద్రియ సేద్య పాలిటెక్నిక్ ఇది. సేంద్రియ వ్యవసాయం, పండ్ల తోటలు, కూరగాయల సాగు, పశు పోషణ మెళకువలపై ఉత్తమ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. సురేందర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి సేంద్రియ ఉత్పత్తుల పరిశ్రమల్లో, విత్తనాలు/ఎరువుల పరిశ్రమల్లో, ఫామ్ మేనేజర్లుగా లేదా విత్తన దుకాణాల ఏర్పాటు వంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. వివరాలకు.. 95151 37015, 81427 45440



● అర్క నీలాచల్ కేసరి పండ్లు



● భువనేశ్వర్‌లోని ‘చెస్’ ఆవరణలో అధిక సాంద్ర పద్ధతి (హెక్టారుకు 833 చెట్లు)లో సాగవుతున్న పదేళ్ల అర్క నీలాచల్ కేసరి మామిడి చెట్లు

ముందస్తు మామిడి!

ప్రధాన మామిడి రకాల కన్నా నెలన్నర ముందుగానే పరిపక్వ పండ్లను ఇచ్చే రకం

● ముందస్తు మామిడి రకం అర్క నీలాచల్ కేసరిని అభివృద్ధి చేసిన భువనేశ్వర్‌లోని కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం శాస్త్రవేత్తలు
● నవంబర్-డిసెంబర్‌లో పూత వస్తోంది.. మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు పరిపక్వ పండ్లను ఇస్తోంది
● ఇతర రాష్ట్రాల్లో స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి పూత, కాపు ఎంత ముందొస్తుందన్నది తెలియాల్సి ఉందంటున్న శాస్త్రవేత్తలు
● మామిడి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తుందని ఆకాంక్ష

సాధారణంగా ముందస్తు కాపు వచ్చే తోటల్లో పచ్చి మామిడికాయలు తెలుగునాట ఉగాది పచ్చడి చేసుకునే నాటికి అందుబాటులోకి వస్తూ ఉంటాయి. పూర్తిగా పక్వానికి వచ్చి సహజ రుచితో నోరూరించే మధుర ఫలం మన చేతికి రావాలంటే ఇప్పుడు మే నెల వరకు ఆగాల్సివస్తోంది. అయితే, ఇక నుంచి మామిడి ప్రేమికులు మామిడి రుచులు ఆస్వాదించడానికి అంత ఎక్కువ కాలం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. మార్చి మొదటి, రెండో వారం నుంచే పూర్తిగా పక్వానికి వచ్చిన తియ్యటి మామిడి పండ్లను అందించే చక్కని సరికొత్త వంగడాన్ని భువనేశ్వర్ (ఒడిషా) లోని కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం (సి.హెచ్.ఇ.ఎస్.-చెస్) శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులోకి తెచ్చారు. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ(ఐఐహెచ్‌ఆర్)కు అనుబంధంగా ‘చెస్’ పనిచేస్తోంది. ఈ సరికొత్త మామిడి వంగడం పేరు ‘అర్క నీలాచల్ కేసరి’.

ఎర్లీ ఫ్రూట్ రకాలైన హిమసాగర్ లేదా సింధూరి కన్నా 5-6 వారాలు ముందుగానే ఈ మామిడి వంగడం పండ్లను ఇస్తున్నదని వారు వెల్లడించారు. బంగినపల్లి, రసాలు వంటి ప్రధాన మామిడి రకాల కన్నా చాలా ముందుగానే.. మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు పరిపక్వ పండ్లనిచ్చే ఈ రకం ముందస్తు అమ్మకాల ద్వారా రైతులకు కాసుల వర్షం కురిపిస్తుందని ‘చెస్’ అధిపతి డా. పి.శ్రీనివాస్ ‘సాక్షి సాగుబడి’తో చెప్పారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న కేసరి రకంతో దీనికి సారూప్యత లేదన్నారు. కోత అనంతర జాగ్రత్తలు పాటించి విక్రయిస్తే మామిడి రైతుల ఆదాయం రెట్టింపవుతుందన్నారు. అయితే, తాము ‘అర్క నీలాచల్ కేసరి’ వంగడాన్ని తీర ప్రాంత రాష్ట్రమైన ఒడిషా ఉష్ణమండల తేమతో కూడిన వాతావరణంలో అభివృద్ధి చేశామని, ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో ఎంత ముందుగా పూతకు, కాపునకు వస్తుందో సాగు చేసి చూస్తేనే తెలుస్తుందన్నారు. మామిడి పూత, కాపుపై స్థానిక వాతావరణ పరిస్థితులు తీవ్రప్రభావాన్ని చూపుతుంటాయన్నారు.

ప్రధాన శాస్త్రవేత్త డా. వి. పాండే సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసిన ‘అర్క నీలాచల్ కేసరి’ వంగడానికి కేంద్రీయ వంగడాల విడుదల కమిటీ (సీవీఆర్‌సీ) గత ఏడాదే ఆమోదం తెలిపింది. కోసుకొని తినే కండ గల పండు ఇది. పండు బరువు 200-220 గ్రాముల వరకు ఉంటుంది. ఆకర్షణీయమైన రంగు, మంచి తియ్యదనం (బ్రిక్స్ 17) తోపాటు కమ్మటి వాసన వెదజల్లుతుంటుంది. ఇతర రకాల కన్నా కనీసం నెలన్నర ముందుగా మార్కెట్‌లోకి ఈ పండ్లు వస్తాయి కాబట్టి ఒడిషాలో రైతులకు ఆమ్రపాలి వంటి రకాలతో పోల్చినప్పుడు 3-4 రెట్లు ధర వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పండు ఈగ సమస్యతో పాటు కోత అనంతర తెగుళ్ల సమస్యల నివారణకు వేడి నీళ్ల ఉపచర్య (హాట్ వాటర్ ట్రీట్‌మెంట్) ఇవ్వటం ద్వారా నాణ్యమైన మామిడి పండ్లను మార్కెట్‌కు అందించి మంచి ఆదాయం పొందవచ్చని ‘చెస్’ అధిపతి డా. శ్రీనివాస్ తెలిపారు. భువనేశ్వర్ నగరంలోనే ఉన్న తమ పరిశోధనా కేంద్రంలోని ‘అర్క నీలాచల్ కేసరి’ తోటలో మరో వారం రోజుల వరకు చెట్లకు పండ్లు ఉంటాయని.. తోటను, కోత అనంతర శుద్ధి కేంద్రాన్ని స్వయంగా సందర్శించవచ్చని డా. శ్రీనివాస్ అన్నారు. గ్రాఫ్టింగ్ చేసిన నాణ్యమైన ‘అర్క నీలాచల్ కేసరి’ ఏడాది మొక్కల (ధర రూ. 50)ను ‘చెస్’లో అందుబాటులో ఉన్నాయి.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



● అర్క నీలాచల్ కేసరి పండ్లు

ఇతర రాష్ట్రాల్లో సాగు చేసి చూడాలి



ఒడిషాలో ‘అర్క నీలాచల్ కేసరి’ మామిడి పండ్లు సహజంగా పరిపక్వత చెంది మార్చి 15 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 15 వరకు కోతకు వస్తాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించిన నేపథ్యంలో నవంబర్-డిసెంబర్‌లలో పూత వచ్చింది. మార్చి మొదటి వారంలో మహిళా దినోత్సవం నాటికే సహజంగా పక్వానికి వచ్చిన పండ్లు కోతకు వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో ఒడిషాలో మాదిరిగా మరీ ముందుగా పూత, కాపు వస్తుందా లేదా అన్నది ఆయా రాష్ట్రాల్లో సాగు చేసి చూస్తేనే తెలుస్తుంది. సాధారణంగా ఈ రకం చెట్లు ఒడిషాలో నవంబర్, డిసెంబర్ నాటికి పూతకు వస్తాయి. దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లే కొద్దీ వాతావరణంలో వేడిని బట్టి పూత ఆలస్యం అవుతూ ఉంటుంది. నాటిన మూడో సంవత్సరం నుంచి పూత, కాపు ప్రారంభమవుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల రైతులు కొందరు ఇప్పటికే ఈ రకం మొక్కలను తీసుకెళ్లి ప్రయోగాత్మకంగా నాటుకున్నారు. ఒకటి, రెండేళ్లు గడిస్తే ఆయా రాష్ట్రాల్లో ఎన్ని రోజులు ముందుగా పూత, కాతకు వస్తున్నదీ తెలుస్తుంది. కాబట్టి ఇతర రాష్ట్రాల రైతులు ముందు కొద్ది మొక్కలు నాటుకొని ఫలితం ఎలా ఉందో చూసుకోవాలి. ప్రధాన రకాలైన బంగినపల్లి, రసాల కన్నా చాలా ముందుగానే సహజంగా పరిపక్వత చెందిన పండ్లను అందించే ఈ రకాన్ని పెంచుకుంటే మంచి ధర పలుకుతుంది కాబట్టి రైతులకు అధికాదాయం వస్తుంది. నాణ్యమైన ‘అర్క నీలాచల్ కేసరి’ మొక్కలను ‘చెస్’ ద్వారా సరఫరా చేస్తున్నాం.

- డా. పి. శ్రీనివాస్ (90406 24745), అధిపతి, కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం (సి.హెచ్.ఇ.ఎస్.- చెస్), భువనేశ్వర్, ఒడిషా chesb.iihr@icar.gov.in

హెక్టారుకు 10 టన్నుల దిగుబడి



‘అర్క నీలాచల్ కేసరి’ మొక్కలు మధ్యస్థంగా హెక్టారుకు 400 మొక్కలు (5 మీ. × 5 మీ.) నాటుకుంటే మంచిది. మూడో ఏడాది నుంచి కాపు మొదలవుతుంది. 4వ ఏడాదిలో హెక్టారుకు 6-7 టన్నులు, 6వ ఏడాది నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. మామిడి సాగులో అనుభవం ఉండి, మెళకువలు పాటించగలిగే రైతులు అధిక సాంద్రతలో కూడా నాటుకోవచ్చు. హెక్టారుకు 3 మీ. × 4 మీ. దూరంలో 833 మొక్కలు, 2 మీ. × 3 మీ. దూరంలో 1,666 మొక్కలు నాటుకోవచ్చు. అయితే, కొత్తగా ఈ వంగడాన్ని అరెకరం లేదా ఎకరంలో నాటుకొని పూత, కాపు తమ ప్రాంతంలో ఎలా వస్తున్నదో రైతులు పోల్చి చూసుకోవటం మంచిది. ‘అర్క నీలాచల్ కేసరి’ మామిడి పండ్ల ధర ఒడిషాలో ప్రస్తుతం రైతులు కిలో రూ. 70-80కి అమ్ముతున్నారు. మార్కెట్ ధర రూ. 120 వరకు ఉంది.

- డా. కుందన్ కిషోర్ (8763217726), ప్రధాన శాస్త్రవేత్త, కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం, (సి.హెచ్.ఇ.ఎస్.- చెస్), భువనేశ్వర్, ఒడిషా

స్పోర్ట్స



బోపన్న జోడీ శుభారంభం

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. మొనాకోలో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 3–6, 6–3, 10–8తో రాఫెల్ మటోస్ (బ్రెజిల్)–డేవిడ్ వెగా హెర్నాండెజ్ (స్పెయిన్) జంటపై విజయం సాధించింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ఎనిమిది ఏస్‌లు సంధించారు. ప్రీక్వార్టర్ ఫైనల్లో కెవిన్ క్రావిట్జ్–టిమ్ పూయెట్జ్ (జర్మనీ)లతో బోపన్న, ఎబ్డెన్ తలపడతారు.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం

ఇండియన్ గ్రాండ్‌ప్రి మీట్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకం సాధించింది. బెంగళూరులో సోమవారం జరిగిన ఈ మీట్‌లో జ్యోతి మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా నిలిచింది. వైజాగ్‌కు చెందిన జ్యోతి అందరికంటే వేగంగా 13.44 సెకన్లలో గమ్యానికి చేరింది. తెలంగాణకు చెందిన అగసార నందిని కాంస్య పతకం గెలిచింది. నందిని 13.85 సెకన్లతో మూడో స్థానంలో నిలిచింది.



‘థ్రిల్లర్’లో లక్నో విన్నర్



బదోని

ఆట చివర్లో అలా...

పూరన్ అవుటైన సమయంలో లక్నో స్కోరు 189/6. మరో 18 బంతుల్లో 24 పరుగులు చేయాలి. కానీ తర్వాతి ఆట మొత్తం మలుపులతో సాగింది. 9 బంతుల్లో 7 పరుగులు చేయాల్సిన సురక్షిత స్థితిలో పార్నెల్ బౌలింగ్‌లో బదోని స్కూప్ షాట్‌తో బంతిని సిక్సర్‌గా మలచడంతో లక్నో సంబరపడింది. కానీ అతని బ్యాట్ స్టంప్స్‌కు తాకడంతో బదోని వెనుదిరగాల్సి వచ్చింది. చివరి ఓవర్లో 5 పరుగులు సునాయాసంగానే అనిపించినా హర్షల్ 5 బంతుల్లో 2 వికెట్లు తీశాడు. స్కోర్లు సమం కాగా, లక్నో విజయానికి చివరి బంతికి ఒక పరుగు కావాలి. అయితే బంతి వేయక ముందే బిష్ణోయ్ క్రీజు దాటి ముందుకు వెళ్లడంతో హర్షల్ ‘మన్కడింగ్’కు ప్రయత్నించాడు. కానీ బంతి స్టంప్స్‌ను తాకలేదు. దాంతో రనౌట్ కోసం త్రో చేశాడు. స్టంప్స్ ఎగిరినా, నిబంధనల ప్రకారం అలా రెండు సార్లు చేయడం కుదరదని అంపైర్ చెప్పేశాడు. దాంతో బిష్ణోయ్ నాటౌట్‌గా తేలాడు. చివరి బంతిని ఆవేశ్ ఆడలేకపోగా, కీపర్ దినేశ్ కార్తీక్ కూడా తడబడి దానిని నేరుగా అందుకోవడంలో విఫలమయ్యాడు. అతను త్రో చేసేలోగా బిష్ణోయ్ ఆ వైపు, ఆవేశ్ ఈ వైపునకు వచ్చేశారు! దాంతో లక్నో జట్టు ఆనందాన్ని ఆపడం ఎవరితరం కాలేదు.





డ్రామా... డ్రామా... హైడ్రామా... ఐపీఎల్‌లో వరుసగా రెండో రోజు అభిమానులను మునివేళ్లపై నిలబెట్టిన మ్యాచ్... చిన్నస్వామి మైదానంలో అనేక మలుపులు తిరుగుతూ, అనూహ్య ప్రదర్శనలు చూపించిన పోరు ఒక పెద్ద అద్భుతంగా ముగిసింది. కోహ్లి, డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు బాదడంతో సొంత మైదానంలో బెంగళూరు 212 పరుగులతో నిశ్చింతగా నిలిచింది... 23 పరుగులకే 3 లక్నో వికెట్లు తీసిన తర్వాత ఇక ఫలితం ఏకపక్షమే అనిపించింది. ఈ దశలో ముందుగా స్టొయినిస్ చెలరేగాడు... అయినా సరే 105/5 వద్ద బెంగళూరుదే పైచేయి. 53 బంతుల్లో 108 పరుగులు అసాధ్యంగా అనిపించింది! అయితే నికోలస్ పూరన్ ఒంటి చేత్తో అంతా మార్చేశాడు. తాను ఆడిన 19 బంతుల్లోనే మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. చివర్లో ఉత్కంఠ పెరిగినా సూపర్ జెయింట్స్ గెలుపు గీతను దాటి సంబరాలు చేసుకుంది.



పూరన్

- బెంగళూరు అనూహ్య ఓటమి
- వికెట్ తేడాతో నెగ్గిన సూపర్ జెయింట్స్
- గెలిపించిన స్టొయినిస్, పూరన్

బెంగళూరు: ఐపీఎల్‌లో హోరాహోరీగా సాగిన మరో పోరులో చివరి బంతికి ఫలితం వచ్చింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ వికెట్ తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ (46 బంతుల్లో 79 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (44 బంతుల్లో 61; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (29 బంతుల్లో 59; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. తొలి వికెట్‌కు కోహ్లితో 96 పరుగులు (69 బంతుల్లో) జోడించిన డుప్లెసిస్, రెండో వికెట్‌కు మ్యాక్స్‌వెల్‌తో 115 పరుగులు (50 బంతుల్లో) జత చేశాడు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 9 వికెట్లకు 213 పరుగులు సాధించి గెలిచింది. స్టొయినిస్ (30 బంతుల్లో 65; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ నికోలస్ పూరన్ (19 బంతుల్లో 62; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడగా, ఆయుష్ బదోని (24 బంతుల్లో 30; 4 ఫోర్లు) కీలక పరుగులు సాధించాడు.

ముగ్గురూ ముగ్గురే...

బెంగళూరుకు ఓపెనర్లు కోహ్లి, డుప్లెసిస్ ఘనమైన ఆరంభాన్ని అందించారు. ఈ భాగస్వామ్యంలో ముందుగా కోహ్లి చెలరేగిపోయాడు. అవేశ్ ఖాన్ తొలి రెండు ఓవర్లలో 3 ఫోర్లు, 1 సిక్స్ కొట్టిన కోహ్లి, వుడ్ ఓవర్లో వరుసగా 4, 6 బాదాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 56 పరుగులకు చేరగా, 35 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీ పూర్తయింది. ఈ క్రమంలో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి మిశ్రా బౌలింగ్‌లో కోహ్లి అవుట్ కావడంతో తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. ఆ తర్వాత వచ్చిన మ్యాక్స్‌వెల్ కూడా చాలా కాలం తర్వాత తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించగా, మరో ఎండ్‌లో డుప్లెసిస్ కూడా ధాటిని పెంచాడు. రవి బిష్ణోయ్ ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు కొట్టిన ఆర్‌సీబీ కెప్టెన్ 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అనంతరం జోరును కొనసాగిస్తూ ఉనాద్కట్ ఓవర్లో డుప్లెసిస్ 2 సిక్స్‌లు ఒక ఫోర్ కొట్టగా, ఈ ఓవర్లో మొత్తం 23 పరుగులు వచ్చాయి. ఆపై అవేశ్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లతో మ్యాక్స్‌వెల్ పండుగ చేసుకున్నాడు. 24 బంతుల్లోనే అతని అర్ధ సెంచరీ కూడా పూర్తయింది. బెంగళూరు చివరి 5 ఓవర్లలో 75 పరుగులు చేయగా...జట్టు ఇన్నింగ్స్‌లో మొత్తం 12 ఫోర్లు, 15 సిక్సర్లు ఉన్నాయి.

రాహుల్ విఫలం...

లక్నో ఛేదన పేలవంగా ప్రారంభించింది. తొలి ఓవర్లోనే మేయర్స్ (0)ను సిరాజ్ బౌల్డ్ చేయగా, పార్నెల్ ఒకే ఓవర్లో దీపక్ హుడా (9), కృనాల్ పాండ్యా (0)లను వెనక్కి పంపాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (20 బంతుల్లో 18; 1 ఫోర్) కూడా ప్రభావం చూపలేకపోయాడు. మరో ఎండ్‌లో స్టొయినిస్ మెరుపు బ్యాటింగ్ సూపర్ జెయింట్స్ శిబిరంలో కాస్త ఆశలు రేపింది. హర్షల్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 4 కొట్టిన స్టొయినిస్, కరణ్ శర్మ వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. ఆపై షహబాజ్ ఓవర్లోనూ రెండు భారీ సిక్సర్లు కొట్టి 25 బంతుల్లోనే స్టొయినిస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే స్టొయినిస్‌తో పాటు రాహుల్ నాలుగు బంతుల వ్యవధిలో అవుట్ కావడంతో లక్నో గెలుపు అవకాశాలు క్షీణించాయి.



స్టొయినిస్



డుప్లెసిస్

అయితే పూరన్ అద్భుత ప్రదర్శన జట్టును విజయానికి చేరువగా తెచ్చింది. కరణ్ ఓవర్లో 2 సిక్స్‌లు కొట్టిన పూరన్, హర్షల్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. పార్నెల్ ఓవర్లోనూ 2 ఫోర్లు, 6 బాదిన అతను 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. గెలుపు కోసం లక్నో 19 బంతుల్లో 24 పరుగులు చేయాల్సిన దశలో నిష్క్రమించడం చివర్లో తీవ్ర ఉత్కంఠకు కారణమైంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) స్టొయినిస్ (బి) అమిత్ మిశ్రా 61; డుప్లెసిస్ (నాటౌట్) 79; మ్యాక్స్‌వెల్ (బి) మార్క్ వుడ్ 59; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1–96, 2–211. బౌలింగ్: జైదేవ్ ఉనాద్కట్ 2–0–27–0, అవేశ్ ఖాన్ 4–0–53–0, కృనాల్ పాండ్యా 4–0–35–0, మార్క్ వుడ్ 4–1–32–1, రవి బిష్ణోయ్ 4–0–39–0, అమిత్ మిశ్రా 2–0–18–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (బి) సిరాజ్ 0; కేఎల్ రాహుల్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 18; దీపక్ హుడా (సి) కార్తీక్ (బి) పార్నెల్ 9; కృనాల్ పాండ్యా (సి) కార్తీక్ (బి) పార్నెల్ 0; స్టొయినిస్ (సి) షహబాజ్ (బి) కరణ్ శర్మ 65; పూరన్ (సి) షహబాజ్ (బి) సిరాజ్ 62; ఆయుష్ బదోని (హిట్ వికెట్) (బి) పార్నెల్ 30; ఉనాద్కట్ (సి) డుప్లెసిస్ (బి) హర్షల్ పటేల్ 9; వుడ్ (బి) హర్షల్ పటేల్ 1; రవి బిష్ణోయ్ (నాటౌట్) 3; అవేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 213. వికెట్ల పతనం: 1–1, 2–23, 3–23, 4–99, 5–105, 6–189, 7–206, 8–209, 9–212. బౌలింగ్: సిరాజ్ 4–0–22–3, విల్లీ 4–0–32–0, పార్నెల్ 4–0–41–3, హర్షల్ పటేల్ 4–0–48–2, కరణ్ శర్మ 3–0–48–1, షహబాజ్ 1–0–15–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
లక్నో	4	3	1	6	1.048
రాజస్తాన్	3	2	1	4	2.067
కోల్‌కతా	3	2	1	4	1.375
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	3	2	1	4	0.356
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	3	1	2	2	-0.800
హైదరాబాద్	3	1	2	2	-1.502
ముంబై	2	0	2	0	-1.394
ఢిల్లీ	3	0	3	0	-2.092

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వికాస్ ‘కంచు’ పట్టు

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ రెండో రోజు పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. 72 కేజీల విభాగంలో వికాస్ కాంస్య పతక బౌట్‌లో 8–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో జెయిన్ తాన్ (చైనా)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన సుమిత్ (60 కేజీలు), రోహిత్ దహియా (82 కేజీలు), నరీందర్ చీమా (97 కేజీలు) కూడా కాంస్య పతక బౌట్‌లలో పోటీపడ్డారు. కానీ ఈ ముగ్గురికీ నిరాశే ఎదురైంది. కాంస్య పతక బౌట్‌లలో సుమిత్ 6–14తో మైతా కవానా (జపాన్) చేతిలో... రోహిత్ 1–5తో అలీరెజా (ఇరాన్) చేతిలో... నరీందర్ 1–4తో ఒల్జాస్ (కజకిస్తాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.



రన్నరప్ ప్రియాంక

సాక్షి, హైదరాబాద్: జోయెల్ గ్రాటీన్ స్మారక మార్టినిక్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక రన్నరప్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. కరీబియన్ దీవుల్లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత క్రిస్టియన్ బాయెర్ (ఫ్రాన్స్), ప్రియాంక (భారత్), కార్తీక్ వెంకటరామన్ (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... బాయెర్‌కు టాప్ ర్యాంక్, ప్రియాంకకు రెండో ర్యాంక్, కార్తీక్‌కు మూడో ర్యాంక్ ఖరారయ్యాయి. ప్రియాంక ఏడు గేముల్లో గెలిచి, రెండు గేముల్లో ఓడిపోయింది. చివరి రెండు రౌండ్‌లలో ప్రియాంక ఫ్రాన్స్ జీఎం రొమైన్‌పై, తెలంగాణ జీఎం హర్ష భరతకోటిపై గెలుపొందింది. హర్ష 6.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన బొమ్మిని మౌనిక అక్షయ 6 పాయింట్లతో ఏడో ర్యాంక్‌ను దక్కించుకుంది. మహిళల కేటగిరీలో ప్రియాంక, అక్షయ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.



సినిమా

పారిజాత పర్వం

సునీల్, శ్రద్ధా దాస్, చైతన్య రావు, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. వనమాలి క్రియేషన్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్న ఈ మూవీకి ‘పారిజాత పర్వం’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ని ఖరారు చేశారు మేకర్స్. ఓ అమ్మాయికి ముసుగు వేసి కుర్చీలో బంధించినట్లు టైటిల్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ‘‘వైవిధ్యమైన కథతో రూపొందుతోన్న చిత్రం ‘పారిజాత పర్వం’. టైటిల్‌కి మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: అనంత సాయి, కెమెరా: బాల సరస్వతి, సంగీతం: రీ.



● శ్రద్ధాదాస్

పోలీసుల గొప్పతనం

అక్కినేని నాగచైతన్య హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం ‘కస్టడీ’. వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు–తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కృతీశెట్టి కథానాయికగా నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీ మే 12 విడుదలకానుంది. మేస్ట్రో ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘హెడ్ అప్ హై..’ అంటూ సాగే తొలి లిరికల్ వీడియోని రిలీజ్ చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను అరుణ్ కౌండిన్య, అసల్ కోలార్, యువన్ శంకర్ రాజా పాడారు. ‘‘హెడ్ అప్ హై..’ పాట పోలీసుల గొప్పతనాన్ని వర్ణిస్తుంది. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. నాగచైతన్య తన గ్రేస్‌ఫుల్ డ్యాన్స్‌తో పాటలోని ఎనర్జీని మ్యాచ్ చేశారు’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. అరవింద్ స్వామి, ప్రియమణి, శరత్ కుమార్, సంపత్ రాజ్, ‘వెన్నెల’ కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఖతీర్.



● నాగచైతన్య

అప్పుడు షాక్ అయ్యాను - సమంత

‘‘ఒకప్పుడు నా లైఫ్‌లో ఏ ప్రాబ్లమ్స్ లేవు. సో.. నేను చాలా సింపుల్‌గా, హ్యాపీగా ఉన్నాను. కానీ నా జీవితంలో నేను కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎవరైనా తమ జీవితాల్లో స్ట్రగుల్స్‌ను ఫేస్ చేసినప్పుడు వారు స్ట్రాంగ్‌గా మారిపోతుంటారు. నేనూ అంతే. నన్ను నేను ప్రత్యేకం అనుకోవడం లేదు. అయితే నా జీవితంలో నాకు కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు ఎదురయ్యాయి. ఇవి నా జీవితాన్ని నాశనం చేయకూడదని అనుకుని, ఇందుకు తగ్గట్లుగా జీవితంలో ముందుకెళుతున్నాను’’ అని సమంత అన్నారు. కాళిదాసు రచించిన ‘అభిజ్ఞాన శాకుంతలం’ ఆధారంగా గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ ఫిల్మ్ ‘శాకుంతలం’. ఈ చిత్రంలో శకుంతలగా సమంత, దుష్యంత్ మహారాజుగా దేవ్‌మోహన్ నటించారు. ‘దిల్’ రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సమంత మాట్లాడుతూ–‘‘శాకుంతలం’ పూర్తి కథ విన్నప్పుడు నేను సర్‌ప్రైజ్ అయ్యాను. భారతీయ సాహిత్యంలో ఎంతోమంది ప్రేమించే శకుంతల పాత్రను పోషించడం నాకు పెద్ద బాధ్యతగా అనిపించింది. ‘ది ఫ్యామిలీ మేన్ 2’ వెబ్‌సిరీస్‌లో రాజీవంటి క్యారెక్టర్ చేసిన నేను వెంటనే శకుంతల పాత్ర చేయడానికి తొలుత భయపడి నో చెప్పాను. కానీ శకుంతల అంటే కేవలం అందమైన అమ్మాయి మాత్రమే కాదు.. హుందాతనం, ఆత్మగౌరవం కలిగిన యువతి కూడా. ఏ తరం అమ్మాయిలకైనా శకుంతల పాత్ర కనెక్ట్ అవుతుందని మళ్లీ ఆలోచించి ఒప్పుకున్నాను. తొలి సారిగా 3డీలో ‘శాకుంతలం’ ట్రైలర్ చూసి షాక్ అయ్యాను. ఈ సినిమా కోసం గుణశేఖర్‌గారు మ్యాజికల్ వరల్డ్‌ను క్రియేట్ చేశారు. నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు షూటింగ్స్‌కి రమ్మని ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. ఈ విధంగా నాకు ఇండస్ట్రీ నుంచి సపోర్ట్ లభించింది’’ అన్నారు. ‘‘కథను నమ్మి ‘శాకుంతలం’ సినిమా తీశాం’’ అన్నారు గుణశేఖర్. ‘‘ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే గుణశేఖర్‌గారి ప్రయత్నంలో నేనూ భాగమవడం సంతోషంగా ఉంది’’ అన్నారు ‘దిల్’ రాజు.



● గుణశేఖర్, సమంత, ‘దిల్’ రాజు



● ఊర్వశీ రౌతేలా

అలాంటి చిత్రాలకు అవార్డు ఇవ్వాలి - విజయేంద్ర ప్రసాద్

‘‘కొన్నేళ్లుగా ఆగిపోయిన నంది అవార్డ్స్‌ని మళ్లీ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో రామకృష్ణ ఇవ్వనుండటం సంతోషం. తెలంగాణ సంస్కృతి, గొప్పదనాన్ని ప్రతిబింబించే సినిమాలకు ప్రత్యేకంగా నంది అవార్డు కేటాయిస్తే బాగుంటుంది’’ అని రచయిత, డైరెక్టర్, ఎంపీ వి.విజయేంద్ర ప్రసాద్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ‘తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ)’ ఆధ్వర్యంలో ‘టీఎఫ్‌సీసీ’ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023’ వేడుకలు త్వరలో దుబాయ్‌లో జరగనున్నాయి. ఈ వేడుక బ్రోచర్‌ని వి.విజయేంద్ర ప్రసాద్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ –‘‘తెలంగాణలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయి. ఇక్కడ 90 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకునే చిత్రాలకు నంది అవార్డ్స్‌తో పాటు నగదు ప్రోత్సాహాన్ని ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నా. ఫలితంగా టూరిజం అభివృద్ధి చెందుతుంది’’ అన్నారు. ‘‘2021, 2022 సంవత్సరాలకుగాను టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ ఇవ్వనున్నాం’’ అన్నారు టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ కార్యక్రమంలో ‘ఆర్‌ఆర్‌ఆర్’ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్‌ను సన్మానించారు. ‘తెలుగు ఫిలిం ఛాంబర్’ సెక్రటరీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.



● సెంథిల్ కుమార్, విజయేంద్ర ప్రసాద్, ప్రతాని రామకృష్ణ గౌడ్



● చైతన్య, దేవయాని, మహి వి.రాఘవ, అభినవ్

ఎవరి యుద్ధం వాళ్లది!

ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ, పావని, జోర్దార్ సుజాత, దేవయాని ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ ‘సేవ్ ద టైగర్స్’. ‘అంతరించిపోతున్న పులుల్ని, మొగుళ్లని కాపాడుకుందాం’ అనేది ఉపశీర్షిక. నటుడు తేజ కాకుమాను దర్శకత్వం వహించారు. ‘ఆనందో బ్రహ్మ, యాత్ర’ చిత్రాల దర్శకుడు మహి వి.రాఘవ, ప్రదీప్ అద్వైతం షో రన్నర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ఈ నెల 27 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. మహి వి. రాఘవ మాట్లాడుతూ–‘‘ప్రతి ఇంట్లోనూ ఒక కామెడీ స్టోరీ ఉంటుంది. భార్యా భర్తల మధ్య ఉండే జోక్స్ ఎప్పుడూ ఫెయిల్ కావు. ఎవరి యుద్ధం వాళ్లది. ‘సేవ్ ది టైగర్స్’ సిరీస్ కుటుంబమంతా ఇంట్లో కూర్చొని చూసేలా ఉంటుంది’’ అన్నారు. ‘‘సేవ్ ది టైగర్స్’ అన్ని వర్గాల వారిని అలరిస్తుంది’’ అన్నారు నటీనటులు జోర్దార్ సుజాత, దేవయాని, పావని, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ. ఈ సిరీస్‌కి కెమెరా: ఎస్‌వీ విశ్వేశ్వర్, సంగీతం: శ్రీరామ్ మద్దూరి.

ఏజెంట్‌తో స్టెప్పులు

‘ఏజెంట్’ తో ప్రత్యేక స్టెప్పులు వేయనున్నారట హీరోయిన్ ఊర్వశీ రౌతేలా. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ స్పై ఫిల్మ్ ‘ఏజెంట్’. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమాస్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశలో ఉంది. అయితే ఈ మూవీలోని ఓ ప్రత్యేక పాటలో ఊర్వశీ రౌతేలా డ్యాన్స్ చేయనున్నారని సమాచారం. అఖిల్, ఊర్వశీల మాస్ స్టెప్స్‌తో ఈ పాట అదిరిపోయే రేంజ్‌లో ఉంటుందట. ‘ఏజెంట్’ చిత్రం ఈ నెల 28న విడుదలకానుంది. కాగా ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన చిరంజీవి ‘వాల్తేరు వీరయ్య’లో ‘బాస్ పార్టీ..’ అనే స్పెషల్ సాంగ్‌లో తన డ్యాన్స్‌తో అలరించారు ఊర్వశి. అలాగే రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో కూడా ఆమె ఓ స్పెషల్ సాంగ్ చేశారని తెలిసింది. కాగా ఊర్వశీ రౌతేలా ప్రధాన పాత్రలో నటించిన ‘బ్లాక్ రోజ్’ సినిమా తెలుగులో విడుదల కావాల్సి ఉంది.

కంటెంట్ ఉన్న సినిమాలు రావాలి - వీవీ వినాయక్

‘‘అరంగేట్రం’ మూవీ ట్రైలర్ చాలా బాగుంది.. విజువల్స్ కూడా బాగున్నాయి. ఇటువంటి కంటెంట్ ఉన్న సినిమాలు ఇప్పుడు ఇండస్ట్రీకి రావాలి. ఈ చిత్రం విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ వీవీ వినాయక్ అన్నారు. రోషన్, శ్రీనివాస్ ప్రభన్, ముస్తఫా, అనిరుధ్, పూజ, లయ, కీర్తన, ఇందు ప్రధాన పాత్రల్లో ‘కవచం’ మూవీ ఫేమ్ శ్రీనివాస్ ప్రభన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘అరంగేట్రం’. మహీ మీడియా వర్క్స్ బ్యానర్‌లో కె.మహేశ్వరి నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదలకానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను వీవీ వినాయక్ విడుదల చేశారు. ‘‘నాట్యం నేపథ్యంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ ‘అరంగేట్రం’’ అన్నారు శ్రీనివాస్ ప్రభన్, కె.మహేశ్వరి. ఈ చిత్రానికి సంగీతం: గిడియన్ కట్టా, కెమెరా: బురాన్ షేక్ (సలీం), సహ నిర్మాత: ఎంజీబీ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పోలూరి బ్రదర్స్, లైన్ ప్రొడ్యూసర్: వంశీ కె.రెడ్డి.



● వంశీ కె.రెడ్డి, వీవీ వినాయక్, శ్రీనివాస్

యాక్షన్ డ్రామా

‘మసూద’ వంటి హిట్ చిత్రంతో ప్రేక్షకుల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రం ద్వారా జీజీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఏషియన్ ఫిల్మ్స్ నారాయణ దాస్ నారంగ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై వ్యాపారవేత్త రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. ‘‘పీరియడ్ యాక్షన్ డ్రామా జానర్ చిత్రమిది. గతంలో ఎప్పుడూ చూడని విభిన్నమైన కథాంశంతో ఈ సినిమా రూపొందనుంది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. టైటిల్, ఇతర వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం’’ అన్నారు రవి కుమార్ పనస.



● తిరువీర్

సాక్షి బిజినెస్
మంగళవారం
11-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 14	59,847
నిఫ్టీ ▲ 25	17,624

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,039	▽	49
డోజోన్స్	33,527	▲	42
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,742	▲	79
డాక్స్	15,598	▲	78
షాంఘై	3,315	▽	12
నికాయ్	27,634	▲	115

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	60,355
బంగారం (22 క్యారట్)	60,115
వెండి (కేజీ)	74,556

జీఆర్‌టీ జ్యువెలర్స్ అక్షయ తృతీయ ఆఫర్లు

ముంబై: ప్రముఖ జ్యువెలర్స్ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ అక్షయ తృతీయ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. బంగారు ఆభరణాల తరుగుపై 20% తగ్గింపు, వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10% తగ్గింపు, వెండి వస్తువుల తయారీ చార్జీలపై 25% తగ్గింపు, వెండి ఆభరణాల గరిష్ఠ ధరపై 10 శాతం తగ్గింపు అందిస్తుంది. బంగారం ధర హెచ్చుతగ్గుల నుంచి రక్షణ పొందేందుకు కస్టమర్లు ఆభరణాలను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ పండుగ రోజు ధర తగ్గితే.., వ్యత్యాసం తిరిగి ఇస్తారు. కస్టమర్లు అక్షయ తృతీయ వేడుకలను అత్యంత పవిత్రంగా, సుసంపన్నంగా జరుపుకునేందుకు అద్భుతమైన ఆఫర్లు ప్రకటించామని జీఆర్‌టీ కంపెనీ ఎండీ ఆనంద్ అనంతపద్మనాభన్ తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్సూరెన్స్‌దేఖో చేతికి వేరక్




న్యూఢిల్లీ: దేశీ బీమారంగ స్టార్టప్ ఇన్సూరెన్స్‌దేఖో తాజాగా ముంబై సంస్థ వేరక్‌ను కొనుగోలు చేసింది. ఎస్‌ఎంఈ ఇన్సూరెన్స్ పంపిణీ సంస్థ వేరక్‌ను సొంతం చేసుకున్నట్లు ఇన్సూరెన్స్‌దేఖో వ్యవస్థాపకుడు, సీఈవో అంకిత్ అగర్వాల్ వెల్లడించారు. వేరక్ ప్రారంభమైనప్పటినుంచి పటిష్టంగా ఎదుగుతున్నట్లు, కొత్త విభాగం మైక్రోబిజినెస్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో విస్తరించినట్లు అగర్వాల్ పేర్కొన్నారు. తద్వారా తొలిసారి చిన్న వర్తకులను బీమా పరిధిలోకి తీసుకువస్తున్నట్లు తెలియజేశారు. ప్రతీ నెలా ప్రీమియంలో 30 శాతం నెలవారీ వృద్ధిని సాధిస్తున్నట్లు వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
10-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
వరంగల్	357-00
రిటైల్ ధర	4.15

స్టార్టప్స్‌కు తగ్గిన నిధులు

• క్యూ1లో 75 శాతం క్షీణత • 58 శాతం పడిపోయిన డీల్స్
• ఇంక్42 ఇండియన్ టెక్ స్టార్టప్ ఫండింగ్ నివేదికలో వెల్లడి



• భారతీయ స్టార్టప్స్ 2022 క్యూ1లో 12 బిలియన్ డాలర్ల నిధులను అందుకున్నాయి. 2023 జనవరి-మార్చిలో ఇది 3 బిలియన్ డాలర్లకు పడిపోవడం ఆందోళన కలిగించే అంశం.

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూనికార్న్ కంపెనీల జాబితాలో 2023 జనవరి–మార్చిలో కొత్తగా ఏ కంపెనీ చోటు సంపాదించలేదు. 2022 క్యూ1తో పోలిస్తే నిధులు 75 శాతం పడిపోయాయి. డీల్స్ సంఖ్య 58 శాతం తగ్గింది. 100 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ చేసే డీల్స్ 77 శాతం క్షీణించాయి. ఇదీ 2023 మార్చి త్రైమాసికంలో భారత స్టార్టప్స్ స్టోరీ. ఇంక్42 రూపొందించిన ఇండియన్ టెక్ స్టార్టప్ ఫండింగ్ నివేదికలో ఈ విషయాలు వెల్లడి అయ్యాయి.

కారణం ఏమంటే..

కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, రూపాయి విలువ పడిపోవడం, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ పతనం, ఆర్థిక అనిశ్చితి వంటి ఇతర విషయాల కారణంగా పెట్టుబడిదారులు భయపడుతున్నారు. అంతే కాకుండా భారతీయ స్టార్టప్‌ల ఆదాయాలు క్షీణించడం, వాటి పెరుగుతున్న నష్టాలు, వ్యాపారాలను తదుపరి స్థాయికి తీసుకు వెళ్లేందుకు వ్యవస్థాపకులు వ్యూహాలను కనుగొనడంలో విఫలం కావడం పెట్టుబడి సెంటిమెంట్‌ను స్పష్టంగా దెబ్బతీసింది. 2021 బుల్ రన్ తర్వాత నిధుల రాక తీరు చూస్తుంటే మహమ్మారి ముందస్తు స్థాయికి పడిపోయినట్టు అవగతమవుతోంది. ఈ సంవత్సరం వృద్ధి దశలో మూలధనాన్ని సేకరించడం సవాలుగా ఉంటుందని 84% పెట్టుబడిదారులు అభిప్రాయపడ్డారు.

ఇవీ గణాంకాలు..

సిరీస్ సి–రౌండ్స్‌లో గరిష్ఠ కరెక్షన్‌తో ఈ ఏడాది జనవరి–మార్చిలో మెగా డీల్స్ 77 శాతం పడిపోయి ఏడుకు వచ్చి చేరాయి. 2022 క్యూ1లో ఈ సంఖ్య 30గా ఉంది. మెగా డీల్స్ సంఖ్య తగ్గడం 2023 క్యూ1లో భారతీయ స్టార్టప్‌లు సేకరించిన మొత్తం నిధులపై ప్రభావం చూపింది. ఫండింగ్ పరంగా ఈ ఏడాది క్యూ1లో టాప్–3లో నిలిచిన ఫోన్‌పే 650 మిలియన్ డాలర్లు, లెన్స్‌కార్ట్ 500 మిలియన్ డాలర్లు, ఇన్సూరెన్స్‌దేఖో 150 మిలియన్ డాలర్లు అందుకున్నాయి. గతేడాది జనవరి–మార్చిలో మొత్తం 506 డీల్స్ నమోదయ్యాయి. 2023 మార్చి క్వార్టర్‌లో ఈ సంఖ్య 213కు పరిమితమైంది. 2020 క్యూ1లో 3.4 బిలియన్ డాలర్ల విలువ చేసే 212 డీల్స్ నమోదయ్యాయి. 2023 మార్చి త్రైమాసికంలో లేట్ స్టేజ్ ఫండింగ్ 77 శాతం పడిపోయి 1.8 బిలియన్ డాలర్లకు వచ్చి చేరింది. గ్రోత్ స్టేజ్ ఫండింగ్ 76% క్షీణించి 700 మిలియన్ డాలర్లకు వచ్చి చేరింది. సిరీస్–ఏ డీల్స్ 58 నుంచి 30కి, సిరీస్–బీ డీల్స్ 28 నుంచి 4కు పడిపోయాయి.

ఫిన్‌టెక్ ముందంజలో..

మార్చి త్రైమాసికంలో అందుకున్న నిధుల విషయంలో ఫిన్‌టెక్ కంపెనీల వాటా ఏకంగా 44.9 శాతం ఉంది. ఈ–కామర్స్ 22.1 శాతం, ఎంటర్‌ప్రైస్‌టెక్ 6.8, కన్స్యూమర్ సర్వీసెస్ 6.5, డీప్‌టెక్ 5.1, ఎడ్‌టెక్ 3.5, మీడియా, వినోదం 2.7, ఇతర కంపెనీలు 8.4 శాతం కైవసం చేసుకున్నాయి. డీల్స్ సంఖ్య పరంగా ఎంటర్‌ప్రైస్‌టెక్ 41, ఈ–కామర్స్ 40, ఫిన్‌టెక్ 25, డీప్‌టెక్ 21, ఎడ్‌టెక్ 17, మీడియా, వినోదం 16, హెల్త్‌కేర్ 13, ఇతర రంగాల కంపెనీలు 40 చేజిక్కించుకున్నాయి. విలీనాలు, కొనుగోళ్లు 2022 క్యూ1లో ఆల్‌టైమ్ హై రికార్డులతో 100 నమోదైతే, ఈ ఏడాది ఇదే కాలంలో 35కు వచ్చి చేరాయి. 2022 సెప్టెంబర్‌లో టాటా 1 ఎంజీ తర్వాత యూనికార్న్ కంపెనీల జాబితాలో కొత్త కంపెనీ చేరకపోవడం గమనార్హం.

పడిన సీడ్ ఫండింగ్..

మందగమనం ఉన్నప్పటికీ భారత్ స్టార్టప్స్‌కు అత్యధిక సీడ్ ఫండింగ్ 2022లో సమకూరింది. గత ఎనిమిదేళ్లలో ఇదే అత్యధికం. 2014 నుంచి 2022 మధ్య సేకరించిన 5 బిలియన్ డాలర్ల సీడ్ ఫండ్‌లో 2 బిలియన్ డాలర్లు 2022లో నమోదు కావడం విశేషం. సీడ్ ఫండింగ్ గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 2023 మార్చి త్రైమాసికంలో 81% క్షీణించి 180 మిలియన్ డాలర్లుగా ఉంది. స్టార్టప్ వ్యవస్థలో భారీ నిధుల దిద్దుబాటును ఇది సూచిస్తోంది. మార్కెట్లు పుంజుకున్న తర్వాత మంచి వాల్యుయేషన్‌తో నిధులను సేకరించాలని వ్యవస్థాపకులు యోచిస్తున్నారు. వర్కింగ్ క్యాపిటల్‌కు చివరి దశలో రుణ నిధుల సాధనాల వైపు పరిశ్రమ మళ్లాల్సి వస్తోంది.



స్వల్ప లాభాలతో సరి..

• సెన్సెక్స్ లాభం 14 పాయింట్లు
• ఆరోరోజూ కొనసాగిన ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ సూచీలకు సోమవారం స్వల్ప లాభాలొచ్చాయి. ఐటీ, ఆటో, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఆరో రోజూ ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ ఉదయం 26 పాయింట్ల లాభంతో 59,859 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 276 పాయింట్లు బలపడి 60 వేల స్థాయిని అధిగమించి 60,109 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. చివరికి 14 పాయింట్ల స్వల్ప లాభంతో 59,847 వద్ద ముగిసింది. నిఫ్టీ 36 పాయింట్ల లాభంతో 17,635 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 17,598 వద్ద కనిష్టాన్ని 17,694 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 25 పాయింట్లు పెరిగి 17,624 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడం, వరుస అయిదు రోజుల ర్యాలీ నేపథ్యంలో గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ వంటి పరిణామాలు సూచీలను తక్కువ లాభాలకు పరిమితం చేశాయి. అదానీ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి.

మా పెట్టుబడులు పారదర్శకం: అదానీ గ్రూప్



న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ 2019 నుండి గ్రూప్ సంస్థలలో 2.87 బిలియన్ డాలర్ల వాటా విక్రయాల వివరాల జాబితా విడుదల చేసింది. అలాగే 2.55 బిలియన్ డాలర్లు గ్రూప్ కంపెనీల వ్యాపారాల్లోకి ఎలా వచ్చాయన్న విషయాలనూ వివరించింది. 'షెల్ కంపెనీల' ద్వారా గ్రూప్ కంపెనీలకు రూ. 20,000 కోట్లు వచ్చాయని కొంతమంది చేస్తున్న ఆరోపణలకు సమాధానంగా అదానీ గ్రూప్ సోమవారం ఈ ప్రకటన చేసింది. కాగా, గ్రూప్‌లో ఎఫ్‌డీఐ ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించిన ఒక నివేదికను అదానీ గ్రూప్ తిరస్కరించింది, ఇది గ్రూప్ ప్రతిష్టను దెబ్బతీసే ''ఉద్దేశపూర్వక' ప్రయత్నమని పేర్కొంది.

ఫ్యూచర్ రిటైల్‌కు భలే డిమాండ్

రేసులో రిలయన్స్, అదానీ గ్రూప్‌లు



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో ఉన్న ఫ్యూ చర్ రిటైల్‌ను సొంతం చేసుకునేందుకు తీవ్ర పోటీ నెలకొంది. రేసులో రిలయన్స్, అదానీ, జిందాల్ తదితర పలు గ్రూప్‌లు, సంస్థలు పోటీపడుతున్నాయి. వెరసి కంపెనీ ఆస్తుల కొనుగోలుకి ఆసక్తిని వ్యక్తం చేస్తూ(ఈవోఐ) 49 బిడ్స్ దాఖలయ్యాయి. ప్రస్తుతం దివాలా పరిష్కార ప్రక్రియలో భాగమైన ఫ్యూచర్ రిటైల్ ఆస్తులను ఐదు క్లస్టర్స్‌గా విడదీశాక రుణదాతలు ఈవోఐ బిడ్స్‌కు ఆహ్వానం పలికిన సంగతి తెలిసిందే.

మణిపాల్ హెల్త్‌పై టెమాసెక్‌కు పట్టు

అదనంగా 41% వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: ఆరోగ్య పరి రక్షణ రంగ సంస్థ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్‌లో సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ టెమాసెక్ అదనంగా 41% వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు 2 బిలియన్ డాలర్లు(రూ. 16,300 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలుస్తోంది. వెరసి మణిపాల్ హాస్పిటల్స్ బ్రాండుతో దేశవ్యాప్తంగా ఆసుపత్రుల చైన్‌ను కలిగిన కంపెనీలో వాటాను 59 శాతానికి పెంచుకోనుంది. ఈ లావాదేవీ దేశీయంగా హెల్త్‌కేర్ రంగంలో అతిపెద్ద డీల్‌గా నిలవనుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ గురుకులాల్లో 134 ఆర్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఎస్‌ఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన ఆర్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 134
» పోస్టుల వివరాలు: ఆర్ట్ టీచర్–132, డ్రాయింగ్ టీచర్ (డీఈపీడీఎస్సీ అండ్ టీపీ)–02.
» సొసైటీల వారీగా ఖాళీలు(ఆర్ట్ టీచర్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు–16, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు–06, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు–72, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకులాలు–38.
» వేతనం: నెలకు ఆర్ట్ టీచర్‌కు రూ.31,040 నుంచి రూ.92,050, డ్రాయింగ్ టీచర్‌కు రూ.33,750 నుంచి రూ.99,310 చెల్లిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.05.2023.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 124 మ్యూజిక్ టీచర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఎస్‌ఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం గురుకుల విద్యా సంస్థలు, తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన మ్యూజిక్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 124
» సొసైటీల వారీగా ఖాళీలు: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు–46, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు–20, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు–55, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ–02, డీఈపీడీఎస్సీ అండ్ టీపీ–01.
» వేతనం: నెలకు ఆర్ట్ టీచర్‌కు రూ.31,040 నుంచి రూ.92,050, డ్రాయింగ్ టీచర్‌కు రూ.33,750 నుంచి రూ.99,310 చెల్లిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.05.2023.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 92 క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఎస్‌ఆర్‌బీ)..తెలంగాణ గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 92
» పోస్టుల వివరాలు: క్రాఫ్ట్ టీచర్–88, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్(డీఈపీడీఎస్సీ అండ్ టీపీ)–04.
» సొసైటీల వారీగా ఖాళీలు(క్రాఫ్ట్ టీచర్): తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు –24, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు–60, తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థలు–08.
» వేతనం: నెలకు ఆర్ట్ టీచర్‌కు రూ.31,040 నుంచి రూ.92,050, డీఈపీడీఎస్సీ అండ్ టీపీ విభాగంలో క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ. 33,750 నుంచి రూ.99,310 ఉంటుంది.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.05.2023.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 434 లైబ్రేరియన్(స్కూల్స్) పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఎస్‌ఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం ,మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన లైబ్రేరియన్(స్కూల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 434
» సొసైటీల వారీగా ఖాళీలు: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు–54, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు–180, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకులాలు–200.
» వేతనం: నెలకు రూ.38,890 నుంచి రూ.1,12,510 చెల్లిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.05.2023.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.treirb.telangana.gov.in

కెరీర్.. ఇలా సెట్!

» ఏపీ లాసెట్ నోటిఫికేషన్ విడుదల
» ఎల్‌ఎల్‌బీ, బీఏఎల్‌ఎల్‌బీల్లో అడ్మిషన్
» పీజీ లాసెట్‌తో ఎల్‌ఎల్‌ఎంలో ప్రవేశం
» లా పట్టభద్రులకు విస్తృత కెరీర్ అవకాశాలు

ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులా.. మీలో వాక్పటిమ, సునిశిత పరిశీలన, తులనాత్మక విశ్లేషణ నైపుణ్యాలు ఉన్నాయా..! అయితే మీకు సరైన కోర్సు.. లా!! ప్రస్తుతం లా డిగ్రీ పట్టా చేతిలో ఉంటే.. ఇటు న్యాయవాద వృత్తితోపాటు.. అటు కార్పొరేట్ రంగంలోనూ కొలువులు సొంతం చేసుకోవచ్చు! తాజాగా.. ఏపీ లాసెట్ 2023 నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్ష తేదీలు కూడా వెల్లడయ్యాయి. ఈ నేపథ్యంలో.. ఏపీ లాసెట్ పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, బెస్ట్ ర్యాంకుకు ప్రిపరేషన్ గైడెన్స్..



ఏపీ లాసెట్ 2023

'న్యాయ శాస్త్రం(లా) చదివితే.. కోర్టుల్లో లాయర్లుగానే అవకాశాలు ఉంటాయనేది ఒకప్పటి మాట. ఇటీవల కాలంలో లా గ్రాడ్యుయేట్లకు సంప్రదాయ న్యాయవాద వృత్తితో పాటు కార్పొరేట్ కొలువులూ లభిస్తున్నాయి. కాబట్టి ఈ రంగంపై ఆసక్తి ఉన్న వారు ఎలాంటి సందేహం లేకుండా ఎల్‌ఎల్‌బీ కోర్సులో అడుగు పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు.

మూడు, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ

న్యాయ శాస్త్రంలో నైపుణ్యాలను అందించే ఎల్‌ఎల్‌బీలో ప్రవేశానికి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఏపీ లాసెట్ నిర్వహిస్తోంది. ఈ పరీక్ష ద్వారా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో, ఇంటర్మీడియెట్ అర్హతతో అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సులో అడుగు పెట్టొచ్చు. ఆ తర్వాత న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ రంగంలో లీగల్ ఎక్స్‌పర్ట్స్, లీగల్ ఆఫీసర్స్, అడ్వైజర్స్‌గా కొలువులు సొంతం చేసుకోవచ్చు.

అర్హతలు

• మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 45 శాతం మార్కులతో 10+2+3 విధానంలో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఓబీసీలకు కనీసం 42 శాతం, ఎస్సీ,ఎస్టీలకు కనీసం 40 శాతం మార్కులు రావాలి.
• అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ: ఇంటర్మీడియెట్(10+2 విధానం) తత్సమాన కోర్సులో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీలకు 42 శాతం, ఎస్సీ,ఎస్టీలకు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాలి.
• ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు విభాగాలు-120 మార్కులు

• లాసెట్‌ను మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర.
• పార్ట్–ఎలో జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు–30 మార్కులు; పార్ట్–బిలో కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు–30 మార్కులకు; పార్ట్–సిలో ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా 60 ప్రశ్నలు–60 మార్కులకు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

క్లిష్టత స్థాయి

మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్‌లో సిలబస్ అంశాలు ఒకే మాదిరిగా ఉంటాయి. కాని ప్రశ్నల క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో.. అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియెట్ స్థాయిలో ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది.

పీజీ లాసెట్ కూడా

ఏపీ ఉన్నత విద్యా మండలి పీజీ లాసెట్‌ను కూడా నిర్వహిస్తోంది. మూడేళ్ల లేదా అయిదేళ్ల వ్యవధిలోని ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. పీజీ లాసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎల్‌ఎల్‌ఎం కోర్సులో అడ్మిషన్ లభిస్తుంది.

ప్రిపరేషన్ పక్కాగా

జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ

అభ్యర్థులకున్న సామాజిక అవగాహనను పరీక్షించే విభాగం ఇది. ఇందులో విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ముఖ్యంగా చరిత్ర, వార్తల్లోని వ్యక్తులు, ముఖ్యమైన ప్రదేశాలు, సదస్సులు, చారిత్రక కట్టడాలు, స్వాతంత్ర్యం అనంతర కాలంలో జరిగిన ముఖ్యమైన ఘటనల గురించి తెలుసుకోవాలి. ప్రధానంగా జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. అదే విధంగా మెంటల్ ఎబిలిటీలో.. వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్లడ్ రిలేషన్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, కోడింగ్, డీ–కోడింగ్, గ్రాఫ్స్, ఫ్లోచార్ట్స్ విశ్లేషణ వంటి అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

కరెంట్ అఫైర్స్

ఇందులో రాణించేందుకు సమకాలీన పరిణామాలపై పట్టు సాధించాలి. ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న జాతీయ అంశాలు, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాంతీయ పరిణామాలపై దృష్టి పెట్టాలి. అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి తెలుసుకోవాలి. ప్రామాణిక జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతోపాటు, ప్రతిరోజు దిన పత్రికలను చదివి.. సమకాలీన ప్రాధాన్యం ఉన్న అంశాలపై అవగాహన పొందాలి.

అప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా

అభ్యర్థులకు న్యాయ శాస్త్రం పట్ల ఉన్న ఆసక్తి, పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ఈ విభాగంలో ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అభ్యర్థి న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవాలి. కీలక తీర్పులు, వాటి పరిణామాలు –ప్రభావం వంటి అంశాలపైనా దృష్టి పెట్టాలి.

అదే విధంగా భారత రాజ్యాంగం, అధికరణలు, ప్రకరణలు, సవరణలు, వాటి ఉద్దేశం, ప్రభావం వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

లాతో కెరీర్ స్కోప్

ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయ శాస్త్రం అభ్యసించిన వారికి కెరీర్ అవకాశాలకు కొదవలేదు. వీరికి న్యాయవాద వృతితోపాటు కార్పొరేట్ కొలువులు కూడా లభిస్తున్నాయి. ప్రస్తుతం అన్ని రంగాల్లోని కార్పొరేట్ కంపెనీలు ప్రత్యేక న్యాయ విభాగాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. వాటి ద్వారా కార్పొరేట్ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించి, వ్యాపార వ్యవహారాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలని భావిస్తున్నాయి. సదరు న్యాయ విభాగాల్లో లా కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు, ఆర్ అండ్ డీ సంస్థలు, బ్యాంకులు వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

పీజీతో ఎంఎన్‌సీ జాబ్స్

పీజీ స్థాయిలో కార్పొరేట్ లా, సైబర్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా,ఇంటర్నేషనల్ లా వంటి స్పెషలైజేషన్స్ పూర్తి చేసుకుంటే..ఎంఎన్‌సీల్లో జాబ్స్ సొంతం చేసుకోవచ్చు.అదే విధంగా విదేశీ అవకాశాలు కూడా దక్కించుకోవచ్చు. ఆయా దేశాల్లోని నియంత్రణ సంస్థలు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా విదేశాల్లోనూ న్యాయ నిపుణులుగా అడుగుపెట్టే అవకాశం ఉంది.

రెండు విభాగాలు

పీజీ లాసెట్‌ను రెండు విభాగాలుగా 120 మార్కులకు నిర్వహిస్తారు. వివరాలు.. పార్ట్ ఎ 40 మార్కులకు, పార్ట్ బి 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పార్ట్–ఎలో జ్యూరిస్పుడెన్స్ లా 20 ప్రశ్నలు –20 మార్కులు; కాన్‌స్టిట్యూషనల్ లా 20 ప్రశ్నలు –20 మార్కులకు; అలాగే పార్ట్ బిలో పబ్లిక్ ఇంటర్నేషనల్ లా 16 ప్రశ్నలు–16 మార్కులకు; మర్కెంటైల్ లా 16 ప్రశ్నలు–16 మార్కులకు; లేబర్ లా 16 ప్రశ్నలు–16 మార్కులకు; క్రైమ్స్ అండ్ టార్ట్స్ 16 ప్రశ్నలు–16 మార్కులకు; ఐపీఆర్ అండ్ అదర్ లా 16 ప్రశ్నలు–16 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇలా రెండు విభాగాలు కలిపి 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

• దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
• ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 22, 2023
• రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 29 వరకు; రూ.1000 ఆలస్య రుసుముతో మే 5 వరకు, రూ.2,000 ఆలస్య రుసుముతో మే 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
• దరఖాస్తు సవరణ అవకాశం: మే10–11 తేదీల్లో
• హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: మే 15 నుంచి
• ఏపీ లాసెట్, ఏపీపీజీ లాసెట్ పరీక్ష తేదీ: మే 20
• వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

క్లుప్తంగా...

'పాన్-ఆధార్ లింక్' మెసేజ్‌లతో భద్రం

సాక్షి, హైదరాబాద్: పాన్‌కార్డుతో ఆధార్ నంబర్ లింక్ చేయాలన్న ప్రభుత్వ సూచనలను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మీ ఆధార్‌ని పాన్ కార్డుతో లింక్ చెయ్యండంటూ మెసేజ్‌లు పంపుతున్నారు. అందులో నకిలీ వెబ్‌సైట్‌ల లింకులు పెట్టి సైబర్ మోసం చేస్తున్నారు. ఇంకొందరు ఏకంగా ఫోన్‌కాల్స్ చేసి మరీ మీ ఆధార్, పాన్‌కార్డును లింక్ చేయాలి, వివరాలు ఇవ్వండని అడుగుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. బ్యాంకులు, ఇతర ప్రభుత్వ సంస్థలు అలాంటి కాల్స్, మెసేజ్‌లు పంపవని, అలాంటి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ వస్తే నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు. www.incometax.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే మీ ఆధార్ కార్డుని పాన్‌కార్డుతో లింక్ చేయడానికి ప్రభుత్వం వీలు కల్పించిందని చెబుతున్నారు. సోషల్ మీడియాలో, ఫార్వర్డ్ మెసేజ్‌ల్లోని నకిలీ వెబ్‌సైట్ లింక్‌లను నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రేపట్నుంచి 1-9 తరగతుల పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థుల పరీక్షలు ఈ నెల 12వ తేదీన మొదలుకానున్నాయి. విద్యార్థులు చదివే స్కూళ్లలోనే వీటిని నిర్వహిస్తారు. పరీక్షలు ఈ నెల 20తో ముగుస్తాయి. 23వ తేదీకల్లా విద్యార్థుల ఫైనల్ ఫలితాలు వెల్లడిస్తారు. 24వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినం. ఆ మర్నాడు నుంచి వేసవి సెలవులుంటాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపింది.

9 అలయన్స్ ఎయిర్‌లైన్స్ విమానాలు రద్దు

శంషాబాద్: అంతర్గతంగా ఉద్యోగుల కార్యాచరణలో సమస్యలు తలెత్తడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే తొమ్మిది విమానాలను అలయన్స్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. అయితే ముందస్తు సమాచారం లేకపోవంతో ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు హైదరాబాద్ నుంచి బెంగళూరు తిరుపతి, వైజాగ్, మైసూర్ బయలుదేరాల్సిన విమానాలతోపాటు చెన్నై, తిరుపతి, బెంగుళూరు, మైసూర్, గోవా నుంచి రావాల్సిన విమానాలు కూడా రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి. వివిధ డిమాండ్ల కారణంగా ఉద్యోగులు గైర్హాజరు కావడంతో విమానాలు రద్దు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం కూడా అలయన్స్ ఎయిర్‌లైన్స్ విమానాల రాకపోకల్లో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. రద్దు చేసిన విమానాలకు సంబంధించిన ప్రయాణికులకు టికెట్ డబ్బులను ఎయిర్‌లైన్స్ తిరిగి చెల్లిస్తోంది.

ఐదు నగరాల్లో ఉచిత ఈబీ-5 కన్సల్టేషన్స్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ భవిష్యత్‌ను నిర్దేశించే వ్యాపారాలు, విద్య, కెరీర్‌లో పెట్టుబడులకు, అమెరికాలో నివాసానికి అవకాశాలను కల్పించేందుకు యూఎస్ ఇమిగ్రేషన్ ఫండ్ (యూఎస్ఐఎఫ్) ఉచిత ఈబీ-5 కన్సల్టేషన్స్(అమెరికా వీసాలను కల్పించే ప్రత్యేక కార్యక్రమం)ను నిర్వహించబోతోంది. ఏప్రిల్ 13 నుంచి ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో ఈ కన్సల్టేషన్స్‌ను నిర్వహించనుంది. ముంబైలో ఏప్రిల్ 13 నుంచి 16, ఢిల్లీలో 17 నుంచి 18, హైదరాబాద్‌లో 19 నుంచి 20, చెన్నైలో 23న, బెంగళూరులో ఏప్రిల్ 24 నుంచి 25 తేదీల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాలను https://visaeb-5.com/about-eb-5/eb-5-consultation/ షెడ్యూల్ చేసుకోవచ్చని తెలిపారు.

జూడాల సమ్మె వాయిదా

సాక్షి, హైదరాబాద్: జూడాలు సమ్మె వాయిదా వేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల సమ్మె నోటీసు ఇచ్చిన జూనియర్ డాక్టర్లు ప్రభుత్వానికి ఒక అవకాశం కల్పిస్తూ.. వచ్చే నెల 2వ తేదీ వరకు గడువిచ్చారు. అప్పటికీ సమస్యలను పరిష్కరించకుంటే 3వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

ముందంజలో తెలంగాణ, ఏపీ

స్టేట్ ఎనర్జీ ఎఫీషియెన్సీ ఇండెక్స్ 2021-22 విడుదల

సాక్షి, న్యూఢిల్లీ : 2021-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచిక (ఎస్ఈఈఐ)లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. వీటితో పాటు కర్ణాటక, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలు కూడా మెరుగైన పనితీరును కనబరిచాయి. రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచిక 2021-22 నివేదికను కేంద్ర విద్యుత్, నూతన - పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్కే సింగ్ సోమవారం ఢిల్లీలో విడుదల చేశారు. స్టేట్ ఎనర్జీ ఎఫీషియెన్సీ ఇండెక్స్ 2021-22లో ఫ్రంట్ రన్నర్ విభాగంలో ఏపీ, తెలంగాణ సహా 5 రాష్ట్రాలు 60 పాయింట్ల కంటే ఎక్కువగా సాధించాయి. కాగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, అస్సాం, చండీగఢ్‌లు తమ తమ రాష్ట్ర గ్రూప్స్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచాయి. అయితే గత ఇండెక్స్ కంటే తెలంగాణ, ఏపీ అత్యధికంగా అభివృద్ధిని ప్రదర్శించాయి.

అవునూ.. మన అడవుల్లో ఏనుగెందుకు లేదు?

మీరు ఓ విషయాన్ని గమనించారా? మన రాష్ట్రంలో జూలో తప్ప అడవుల్లో ఏనుగులు లేవు. చుట్టూ ఉన్న రాష్ట్రాలన్నింటిలోనూ ఉన్నాయి. దక్షిణాదిలో అయితే.. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మందలు మందలుగా కనిపిస్తే.. ఇటు ఏపీలోనూ పదుల సంఖ్యలో అటవీ ప్రాంతాల్లో ఏనుగులు తిరుగుతూ ఉంటాయి. మరి తెలంగాణలో ఎందుకు లేవు? ఇటీవలే ఎలిఫెంట్ విష్పరర్స్ డాక్యుమెంటరీకి ఆస్కార్ పురస్కారం దక్కిన నేపథ్యంలో ఏనుగుల మీదకు అందరి దృష్టి మళ్లింది. ఈ నేపథ్యంలో అసలు గజరాజు తెలంగాణలో ఎందుకు లేదు? పక్క రాష్ట్రాల నుంచి ఎందుకు రాదు? అన్న విషయంపై ఓ లుక్కేద్దామా..

- సాక్షి, హైదరాబాద్



నల్లమలకు ఏనుగులు.. శేషాచలానికి పులులు

చారిత్రకంగా, భౌగోళికంగా, ఇతర ప్రధాన కారణాలతో తెలంగాణలో ఏనుగులు లేవు. ఏపీలోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ ఏనుగులు లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగును నల్లమల అటవీ ప్రాంతానికి తీసుకువచ్చేలా ఒక కారిడార్ ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. చిత్తూరు జిల్లాలోని శేషాచలం అడవుల్లో పెద్దపులులు అసలు లేకపోవడం, ఇటు తెలంగాణలో ఏనుగులు లేకపోవడంతో.. రెండు ప్రాంతాల్లో పరస్పరం పులులు, ఏనుగులను మార్పిడి చేస్తే బావుంటుందని అంచనా వేశారు. ఈ విధంగా చేయడం ద్వారా మొత్తం ఉమ్మడి ఏపీవ్యాప్తంగా పుష్కలంగా వన్యప్రాణులతో పాటు జీవవైవిధ్యంతో కూడిన మంచి వాతావరణం ఏర్పడుతుందని ఆశించారు. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.



– ఎ.శంకరన్, ఓఎస్డీ, తెలంగాణ అటవీ శాఖ, వైల్డ్ లైఫ్ విభాగం

ఎందుకు లేవు.. ఎందుకు రావు..

→ తెలంగాణలో ఏనుగులు కనిపించకపోవడానికి ప్రధానంగా భౌగోళిక, వాతావరణ పరిస్థితులే కారణం. తెలంగాణ, చుట్టుపక్కల ప్రాంతాలు భౌగోళికంగా దక్కన్ పీఠభూమిపై ఉండటంతోపాటు అడవుల మధ్య 'డ్రై ఏరియా' కారణంగా చారిత్రకంగానే ఇక్కడ ఏనుగులు లేవు. తెలంగాణకు ఆనుకుని ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలోని జిల్లాలన్నీ (పూర్వపు హైదరాబాద్ స్టేట్‌లోని) పొడి వాతావరణం, వర్షాభావ పరిస్థితులున్న ప్రాంతాలే. రాయచూర్, గుల్బర్గా, అకోలా, బీదర్, నాందేడ్ తదితర చోట్లా ఏనుగులు లేకపోవడంతో తెలంగాణలో ఏనుగుల ప్రవేశానికి అవకాశాలు లేకుండా పోయాయి.

→ ఏనుగులు స్థిర నివాసం ఏర్పరుచుకోవాలంటే దట్టమైన అడవులు, పచ్చదనం అవసరం. కనీసం 1,000–1,500 మిల్లీమీటర్ల వర్షపాత ముండే ప్రాంతాలు కావాలి. తేమ వాతావరణం ఉండాలి. కనీసం 7, 8 నెలల పాటైనా అడవుల్లోని చెట్లు ఆకులు కలిగి ఉండాలి. గడ్డి ఎల్లప్పుడూ పచ్చగా ఉండాలి. ఒక్కో ఏనుగుకు సగటున రోజుకు 150 నుంచి 200 కేజీల మేత అవసరం. ఒక గుంపులో ఐదు ఏనుగులుంటే రోజూ టన్ను మేత కావాలి. తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఇలాంటి దట్టమైన అడవులు లేకపోవడం వల్ల.. పెద్ద పులులు, ఇతర జంతువులు పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలస వచ్చి, స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నా ఏనుగులు మాత్రం రావడం లేదు.




→ అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగులున్న చిత్తూరు, విజయనగరం జిల్లాల నుంచి తెలంగాణలోకి రావడానికి ఎలాంటి అడవుల కనెక్షన్ లేదు. మధ్యలో మైదాన ప్రాంతాలను దాటి ఏనుగులు ఇటు వచ్చేందుకు అవకాశాల్లేవు. ఏపీ సరిహద్దుల్లో ఖమ్మంకు ఆనుకుని పశ్చిమగోదావరి, మహబూబ్‌నగర్‌కు ఆనుకుని కర్నూలు, నల్లగొండ వైపు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఏనుగులు లేవు. దీనితో తెలంగాణలోకి వచ్చే పరిస్థితి లేదు.

→ గతంలో ఉమ్మడి ఏపీలోకి రెండు మార్గాల్లో ఏనుగులు వచ్చాయి. ఒకటి.. చిత్తూరు జిల్లాకు ఆనుకుని ఉన్న కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లోని అడవుల నుంచి వచ్చాయి. ఆ రెండు రాష్ట్రాలు కూడా ఏనుగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలే. ఆయా చోట్ల ఏనుగుల సంతతి పెరగడంతో పొరుగునే ఉన్న ఏపీలోకి ప్రవేశించాయి. స్థిరనివాసం ఏర్పరుచుకునే వాతావరణం, పరిస్థితులు ఉండడంతో ఇక్కడే ఉండిపోయాయి.

→ ఇక రెండోది.. ఒడిశాకు పలుమార్లు భారీ వరదలు రావడంతో సరిహద్దుల్లోని విజయనగరం జిల్లాకు కొన్ని ఏనుగులు వలస వచ్చాయి. తిరిగి వెళ్లకుండా ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే ఉండిపోయాయి. అదేవిధంగా జార్ఖండ్ నుంచి కూడా ఏనుగులు వలస వచ్చాయి.

కాంతులీనుతున్న సాగరతీరం



సాక్షి, విశాఖపట్నం: భీమిలి బీచ్... వారం రోజులుగా రాత్రి సమయంలో నీలివర్ణంతో కాంతులీనుతూ కనువిందు చేస్తోంది. దీనికి కారణం బయోలుమినిసెంట్ తరంగాలని నిపుణులు చెబుతున్నారు. బీచ్‌లో ఈ తరహా మార్పులు చూసేందుకు ఆహ్లాదకరంగా ఉన్నా... ఒకింత ఆందోళన కూడా కలిగిస్తోందని వారు అంటున్నారు. ఫైటో ప్లాంక్టన్ అని పిలిచే సూక్ష్మ జీవులు విడుదల చేసిన రసాయనాల కారణంగా ప్రకాశవంతమైన నీలి కాంతి విడుదలవుతుంది. దీంతో బయోలుమినిసెంట్ తరంగాలు ఏర్పడుతున్నాయి. సముద్రంలోని అతి సూక్ష్మ నీలి, ఆకుపచ్చ శైవలాలే (ఆల్గే) భీమిలి బీచ్ ఇలా నీలివర్ణంలో మెరిసిపోవడానికి కారణమని నిపుణులు వివరిస్తున్నారు. కొన్నిరకాల ఆల్గేల వల్ల బీచ్‌లు ఆకుపచ్చ వర్ణంలోనూ మెరుస్తుంటాయని, నీటిలో పోషకాలు పుష్కలంగా ఉన్నంతవరకూ బీచ్ ప్రకాశవంతంగా కనిపిస్తుందని చెబుతున్నారు. 'దేశంలో ఈ విధంగా బీచ్‌లు తళుక్కున మెరిసిపోవడం కొత్తేమీ కాదు. చాలా బీచుల్లో కొన్నిసార్లు ఈ తరహా బయోలుమినిసెన్స్ కనిపించింది. అయితే, ఈ గ్లో-ఇన్-డార్క్‌కు కారణమైన ఆల్గేలు భారీగా ఉంటే చాలా ఆక్సిజన్‌ను తీసుకుంటాయి. దీనివల్ల సముద్రంలో ఆక్సిజన్ కొరత రావొచ్చు. ఎక్కువ పోషకాలు, వ్యర్థాలు ఉన్నచోట ఈ ఆల్గే పోగుపడుతుంది. ఎక్కువ రోజులు ఈ నీలి మెరుపులు ఉంటే ఆ ప్రాంతంలోని సముద్ర జలాల్లో ఆక్సిజన్ తగ్గి సాగరజలాల్లోని జీవరాశులకు కాస్త ప్రమాదకరమైన వాతావరణం ఏర్పడుతుందనే ఆందోళన కూడా ఉంది. ఏదిఏమైనా... భీమిలి బీచ్‌లో ఈ తరహా అద్భుతం మాత్రం ఆహ్వానించదగిన పరిణామం' అని వాతావరణ నిపుణుడు సాయి కిరణ్ చెప్పారు.

2 రోజుల్లో టెన్త్ స్పాట్

మే నెలలో ఫలితాల వెల్లడికి ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షలు మంగళవారంతో ముగియనున్నాయి. ఒకేషనల్ పరీక్షలు మాత్రం ఈనెల 13 వరకూ కొనసాగుతాయి. రెండు రోజుల్లో మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇప్పటికే సమాధాన పత్రాలను మూల్యాంకన కేంద్రాలకు తీసుకెళ్లి భద్రపరిచారు. ఈ ఏడాది 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి సబ్జెక్టు నిపుణుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మూల్యాంకనానికి స్కూల్ అసిస్టెంట్లను మాత్రమే తీసుకుంటున్నారు. ఈసారి పరీక్షల విధానంలో మార్పులు చేశారు. గతంలో 11 పేపర్లుండగా, ఈసారి ఆరు పేపర్లకే పరిమితం చేశారు. వీటన్నింటిపైనా మూల్యాంకనం చేసే టీచర్లకు అవగాహన కల్పించనున్నారు. మూల్యాంకన కేంద్రాల వద్ద ఈసారి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల మొదటి రెండు రోజులు పేపర్ లీక్ ఘటనలను దృష్టిలో ఉంచుకుని, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు. మూల్యాంకన కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. వీటిని జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు. బయట వ్యక్తులతో సంబంధాలు లేకుండా, సమాచారం బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మూల్యాంకన కేంద్రం బాధ్యులకు కచ్చితమైన ఆదేశాలు పంపారు. మే నెల మొదటి వారంలో మార్కుల క్రోడీకరణ పూర్తి చేసి, మే మూడో వారం కల్లా ఫలితాలు వెల్లడించాలనే ఆలోచనలో ఉన్నట్టు ఓ అధికారి తెలిపారు.

పదో తరగతి పరీక్షల్లో ఏడుగురి డీబార్ పలువురు అధికారుల సస్పెన్షన్

సోమవారం నిర్వహించిన పదోతరగతి సైన్స్ పరీక్షలో హనుమకొండ, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు డీబార అయ్యారు. అలాగే, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వర్ని కాలేజీ సెంటర్‌లో ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. ధర్మసాగర్‌పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించారు.

'అడ్డదారి అభ్యర్థుల' గుర్తింపే లక్ష్యం

- టీఎస్‌పీఎస్సీ లీకేజ్ కేసులో 17 మంది అరెస్టు
- అందరి వాంగ్మూలాలు నమోదు చేసిన సిట్
- వాటిని సరిపోల్చి చూస్తున్న ప్రత్యేక బృందం
- నేడు హైకోర్టుకు కేసు స్టేటస్ రిపోర్టు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ ఇందులో కీలక ఘట్టమైన క్రాస్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించింది. ఈ కేసులో అరెస్టు అయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను సరిపోల్చి చూడటం ద్వారా అడ్డదారిలో లబ్ధిపొందిన అభ్యర్థులు ఇంకా ఎవరైనా ఉన్నారా? అనేది తేల్చనుంది. మరోపక్క మంగళవారం హైకోర్టుకు సమర్పించేందుకు సమగ్ర స్టేటస్ రిపోర్టు సిద్ధం చేస్తోంది. ఇందులో ఇప్పటివరకు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలు, తీసుకున్న చర్యలను వివరించనుంది. కమిషన్ నిర్వహించే ఆరు రకాలైన పరీక్షలకు సంబంధించిన 15 క్వశ్చన్ పేపర్లు లీకైనట్లు ఇప్పటికే సిట్ నిర్ధారించింది. వీటిలో గ్రూప్-1 ప్రిలిమ్స్ సహా నాలుగు పరీక్షలను కమిషన్ రద్దు చేయగా మూడింటిని వాయిదా వేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఉన్న కమిషన్ కార్యదర్శి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన పి.ప్రవీణ్‌కుమార్, టీఎస్‌పీఎస్సీ మాజీ నెట్‌వర్క్ అడ్మిన్ ఎ.రాజశేఖర్‌రెడ్డి సహా మొత్తం 17 మంది నిందితులను సిట్ అరెస్టు చేసింది. వీరిలో డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పేపర్ ఖరీదు చేసిన ఖమ్మం జంట మినహా మిగిలిన 15 మందినీ సిట్ అధికారులు న్యాయస్థానం అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ప్రవీణ్, రాజశేఖర్ సహా నలుగురి విషయంలో అదనపు కస్టడీ ప్రక్రియా జరిగింది. కాగా ఈ కేసు దర్యాప్తులో వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు బృందాలుగా మారి నిందితులను విచారించారు. దాదాపు 37 ప్రశ్నలతో కూడిన క్వశ్చనీర్ ఆధారంగా ముందుకు వెళ్లారు. తొలుత నిందితులను విడివిడిగా, ఆపై ఒకరిద్దరిని కలిపి ఇలా వేర్వేరు పంథాల్లో విచారించిన అధికారులు ప్రతి ఒక్కరి నుంచి ప్రతి సందర్భంలోనూ వాంగ్మూలాలు నమోదు చేశారు. వీటన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేయడం కోసం ఓ ప్రత్యేక క్రాస్ వెరిఫికేషన్ బృందం సిట్‌లో ఏర్పాటైంది.

వాంగ్మూలాల్లో తేడాలు తేల్చేందుకే..

వాంగ్మూలాల మధ్య ఎక్కడైనా తేడాలు ఉన్నాయా? ఒకే వ్యక్తి చెప్పిన, వేర్వేరు నిందితులు ఒకే అంశంపై ఇచ్చిన సమాచారంలో అనుమానాస్పద అంశాలు ఉన్నాయా? అనేది ఈ ప్రక్రియ ద్వారా గుర్తించనున్నారు. అలాగే నిందితుల కాల్ డిటెయిల్స్, వాట్సాప్ చాటింగ్స్‌లతో పాటు బ్యాంకు లావాదేవీలు, యూపీఐ విధానంలో జరిగిన నగదు బదిలీలు, ఆయా సమయాల్లో వీరి లొకేషన్స్ ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా దర్యాప్తులో మిస్సైన లింకులతో పాటు అడ్డదారిలో లబ్ధిపొందిన అభ్యర్థులను గుర్తించాలని సిట్ నిర్ణయించింది. ఖమ్మం జంటను కస్టడీలోకి తీసుకుని విచారించడం మినహా మిగతా దర్యాప్తు దాదాపు పూర్తయింది. తదుపరి న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలను బట్టి సిట్ అధికారులు ముందుకు వెళ్లనున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పకడ్బందీ ఏర్పాట్లు

- వివిధ ప్రభుత్వశాఖలకు ఆదేశాలు
- బీఆర్‌కేఆర్ భవన్‌లో మంత్రుల సమీక్ష

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆ రోజు నిర్వహించే కార్యక్రమాలు, చేస్తున్న ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రులకు వివరించారు.

14న నెక్లెస్ రోడ్డు మూత

14వ తేదీన వాహనాల రాకపోకల కోసం నెక్లెస్ రోడ్డు మూసివేయనున్నందున ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగించాలని ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సోమవారం విగ్రహ తయారీ పనులను మంత్రులు, సీఎస్ తదితరులు పరిశీలించారు. విగ్రహ తుది మెరుగుల పనితీరును అడిగి తెలుసుకున్నారు.

ఎంసెట్‌కు 3 లక్షల దరఖాస్తులు

- ఎంసెట్‌లో నర్సింగ్ చేర్చడమే కారణం
- ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తులు
- లీకేజీల నేపథ్యంలో భద్రతపై సమీక్ష
- ప్రత్యేక ఏర్పాట్లకు ఉన్నత విద్యామండలి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే తెలంగాణ ఎంసెట్‌కు ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించే గడువు సోమవారంతో ముగిసింది. ఈ సంవత్సరం మూడు లక్షలకుపైగా అప్లికేషన్లు వచ్చినట్టు ఎంసెట్ కన్వీనర్ దీన్‌కుమార్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి దాదాపు 50 వేలకుపైగా పెరిగినట్టు అధికారులు వెల్లడించారు. నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి కూడా ఈసారి ఎంసెట్ తప్పనిసరి చేయడంతో నర్సింగ్ చేయాలనుకునే విద్యార్థులు కూడా ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల సంఖ్య ఈసా రి స్వల్పంగా పెరిగిందని అధికారులు తెలిపారు.

అగ్రి, మెడికల్ వైపు... : రాష్ట్రంలో అగ్రికల్చర్, మెడికల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కొన్నికాలేజీల్లో అగ్రికల్చర్ బీఎస్సీకి కూడా అనుమతులు వచ్చాయి. కోవిడ్ తర్వాత ఫార్మా కోర్సుకు డిమాండ్ పెరిగిందని, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నట్టు నిపుణులు చెబుతున్నారు. బీఫార్మసీ తర్వాత ఎం ఫార్మసీకి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇవన్నీ విద్యార్థులను ఫార్మసీ వైపు ఆకర్షిస్తున్నాయి. 2018లో అగ్రి, మెడికల్ ఎంసెట్ విభాగానికి 73 వేల మంది దరఖాస్తు చేస్తే, ఇప్పుడీ సంఖ్య 1.08 లక్షలకు చేరింది. ఇప్పటివరకూ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ మార్కులను కొలమానంగా తీసుకునే వాళ్ళు. ఈ ఏడాది నుంచి ఎంసెట్ మార్కులే కీలకం. ఈ కారణంగా కూడా మెడికల్, అగ్రి దరఖాస్తులు పెరిగినట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ విభాగానికి గత ఏడాది 1.61 లక్షల దరఖాస్తులొస్తే, ఈసారి 1.95 లక్షలు వచ్చాయి. దాదాపు 34 వేలు పెరిగాయి.

పటిష్టమైన భద్రతకు చర్యలు

రాష్ట్రంలో వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీలు జరుగుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతతో ఎంసెట్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అధికారులు పరిశీలించారు. పరీక్ష ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సాంకేతికపరమైన భద్రతపై జేఎన్‌టీయూహెచ్‌తో కలిసి మండలి అధికారులు సమీక్షించారు. పాస్‌వర్డ్స్, కీలకమైన కంప్యూటర్ల భద్రత, అవసరమైన రక్షణ వ్యవస్థపై చర్చించారు. ఎంసెట్ మే 10 నుంచి 14 వరకూ జరుగుతుంది. అప్పటివరకూ జాగ్రత్తగా ఉండాలని మండలి, ఎంసెట్ నిర్వహించే జేఎన్‌టీయూహెచ్ నిర్ణయించింది. తరచూ భద్రతపై సమీక్షించాలని భావిస్తున్నారు.

2018 నుంచి ఎంసెట్ దరఖాస్తులు ఇలా..

సంవత్సరం	ఇంజనీరింగ్	అగ్రికల్చర్
2018	1,47,912	73,078
2019	1,42,218	74,981
2020	1,43,326	78,981
2021	1,64,963	86,641
2022	1,61,552	88,156
2023	1,95,515	1,08,457
	(రెండు విభాగాలకు 333)	

(ఈ ఏడాది అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు గడువు ముగిసేలోగా వచ్చినవి)

నాణ్యమైన విద్యకోసం పోటీ..

ఎంసెట్‌కు ఈ ఏడాది అనూహ్యంగా దరఖాస్తులు పెరిగాయి. దీనిని మేం కూడా ఊహించలేదు. హైదరాబాద్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారడమే దీనికి కారణం. అగ్రి, మెడికల్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ కారణంగానే దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి (ఉన్నత విద్యామండలి చైర్మన్)

అవరోహణ విధానంలో గురుకుల పోస్టుల భర్తీ

ఖాళీలు మిగిలిపోకుండా టీఆర్ఈఐఆర్‌బీ ప్రణాళిక ● పైస్థాయి పోస్టులతో నియామక ప్రక్రియ మొదలు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియలో తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఒకేసారి 9,231 కొలువుల భర్తీకి ఒకే దఫా 9 నోటిఫికేషన్లు జారీ చేసిన బోర్డు.. నూరు శాతం ఉద్యోగాల్లో నియామకాలు జరిపేలా వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం భర్తీ చేయనున్న పోస్టులన్నీ బోధన రంగానికి సంబంధించినవే. కాగా ఒక అభ్యర్థి మూడు నుంచి నాలుగు పోస్టులకు (వేర్వేరు సబ్జెక్టులకు) దరఖాస్తు చేసుకునే వీలుంది. ఈ పరీక్షలన్నీ వేర్వేరు తేదీల్లో నిర్వహిస్తుండటంతో ఇలాంటి వారంతా వివిధ పరీక్షలకు హాజరై అర్హత సాధించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యూహాత్మక ప్రణాళిక ద్వారా భర్తీ ప్రక్రియ చేపట్టకుంటే ఖాళీలు ఎక్కువగా మిగిలేపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల అవరోహణ (డిసెండింగ్ ఆర్డర్)విధానాన్ని అమలు చేయాలని టీఆర్ఈఐఆర్‌బీ నిర్ణయించింది. ఈ పద్ధతిలో నియామకాలు చేపడితే పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ చేపట్టవచ్చని బోర్డు అంచనా వేస్తోంది.

తొమ్మిది కేటగిరీల్లో కొలువులు...

ఐదు సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలో గురుకుల డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలు, పాఠశాలల్లో 9,231 పోస్టుల భర్తీకి టీఆర్ఈఐఆర్‌బీ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో డిగ్రీ లెక్చరర్ (డీఎల్), జూనియర్ లెక్చరర్(జేఎల్), ఫిజికల్ డైరెక్టర్ (పీడీ), పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ), డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్, లైబ్రేరియన్ పోస్టులున్నాయి. కొన్ని పోస్టులు కాలేజీలు, స్కూళ్లలో ఉండడంతో రెండింటికీ దాదాపుగా ఒకే అర్హతలున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే డిగ్రీ లెక్చరర్‌కు అర్హతలున్న అభ్యర్థులు, జూనియర్ లెక్చరర్‌తో పాటు పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.



అవరోహణ పద్ధతి ఇలా..

ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియను నియామక సంస్థలు ఒక క్రమ పద్ధతిలో చేపడతాయి. ఇష్టానుసారంగా చేపడితే అన్ని పోస్టులూ భర్తీకాక తిరిగి ప్రకటనలు జారీ చేసి నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. తాజాగా గురుకుల నియామకాల బోర్డు పరిధిలో 9 వేలకు పైగా ఉద్యోగాలకు ప్రకటనలు జారీ అయ్యాయి. దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన అంతా బోర్డు పరిస్థితులకు అనుగుణంగా నిర్వహించినప్పటికీ నియామకాల కౌన్సెలింగ్‌ను మాత్రం ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తారు. ప్రస్తుతం 9 కేటగిరీల్లో కొలువులున్నాయి. వీటిని పైస్థాయి నుంచి కింది స్థాయికి అవరోహణ క్రమంలో విభజించిన తర్వాత వాటికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామకాలు చేపడతారు. అంటే ముందుగా డిగ్రీ కాలేజీల్లో కొలువులు భర్తీ చేసిన తర్వాత జూనియర్ కాలేజీల్లో పోస్టులు భర్తీ చేస్తారు. ఆ తర్వాత పాఠశాలల్లో పైస్థాయి పోస్టులైన పీజీటీ, టీజీటీ తర్వాత ఇతర కేటగిరీ పోస్టుల్లో నియామకాలు చేపడతారు. దీంతో ప్రకటించిన పోస్టులన్నీ పూర్తిస్థాయిలో భర్తీ అవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇలా కాకుండా కిందిస్థాయి నుంచి మొదలు పెడితే ఇక్కడ ఎంపికైన అభ్యర్థి, ఆ తర్వాత పైస్థాయి పోస్టుకు ఎంపికైతే కిందిస్థాయి పోస్టును వదిలేసేందుకు అవకాశం ఉంటుంది. ఆ విధంగా ఆ ఖాళీ భర్తీ కాకుండా మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలోనే వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు టీఆర్ఈఐఆర్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఒకేరోజు ఒకే సమయంలో 'మోడల్, గురుకుల' పరీక్షలు

- అధికారుల సమన్వయలోపం
- విద్యార్థులు ఏదో ఒక పరీక్షకే హాజరయ్యే పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ మధ్య సమన్వయ లోపం విద్యార్థులకు శాపంగా మారింది. ప్రస్తుతం ప్రవేశ పరీక్షల సీజన్ కావడంతో వివిధ రకాల సెట్‌ల నిర్వహణకు అధికారులు తేదీలు ఖరారు చేస్తున్నారు. ఈ తేదీలపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర విద్యాశాఖ పరిధిలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)ల్లో ఆరోతరగతిలో ప్రవేశాలకు ఈనెల 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. విద్యార్థుల హాల్‌టికెట్లనూ వెబ్‌సైట్‌లో పెట్టింది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)ల పరిధిలో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాల అర్హత పరీక్షను కూడా ఈనెల 16న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. రెండు పరీక్షలు ఒకే రోజు ఉండటంతో... ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏదో ఒక పరీక్షకు మాత్రమే హాజరయ్యే పరిస్థితి. ఒకే రోజు, ఒకే సమయంలో రెండు పరీక్షలు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు అటు ఫీజు నష్టపోగా.. ఇటు ప్రవేశాల్లో అవకాశాన్ని కూడా కోల్పోయే పరిస్థితి నెలకొంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.